
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
అన్నమయ్య
జిల్లా వార్తలు
5
శనివారం 4 అక్టోబరు 2025



నకిలీ మద్యం బాటిల్

నకిలీ మద్యం.. గుట్టు రట్టు

నకిలీ మద్యం బాటిళ్లు



- రూ.1.75 కోట్ల విలువ చేసే లిక్కర్ పట్టివేత
- ములకలచెరువు కేంద్రంగా తయారీ
- స్పిరిట్, బాటిళ్లు, పరికరాలు సీజ్
- పీటీఎం మండల టీడీపీ నేతతో పాటు పలువురు అరెస్టు
- టీడీపీ ఇన్‌చార్జి పీఏతో పాటు విజయవాడకు చెందిన ఇద్దరిపై కేసు
- వివరాలు వెల్లడించిన ఎక్సైజ్ అసిస్టెంట్ కమిషనర్ చంద్రశేఖర్‌రెడ్డి


అదుపులోకి తీసుకున్న నిందితులు, పట్టుబడ్డ నకిలీ మద్యం బాక్సులతో కడప అసిస్టెంట్ కమిషనర్ చంద్రశేఖర్‌రెడ్డి

రాయచోటి, ములకలచెరువు, అక్టోబరు 3(ఆంధ్ర జ్యోతి): ములకలచెరువు కేంద్రంగా తయారవుతున్న నకిలీ మద్యం గుట్టురట్టయింది. కడప ప్రొహిబిషన్, ఎక్సైజ్ అసిస్టెంట్ కమిషనర్ చంద్రశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో శుక్రవారం నకిలీ మద్యం తయారు చేస్తున్న పాత డాబాపై మెరుపుదాడులు నిర్వహించారు. ఈ సందర్భంగా రూ.1.75 కోట్లు విలువ చేసే నకిలీ మద్యంతో పాటు తయారు చేసేందుకు సిద్ధంగా ఉంచిన స్పిరిట్, ఖాళీ బాటిళ్లు, పరికరాలు, అక్రమంగా తరలించే వాహనాన్ని సీజ్ చేశారు. తమిళనాడు, విశాఖపట్నం, పీటీఎం మండలానికి చెందిన ఎనిమిది మందితో పాటు పీటీఎం మండల టీడీపీ నేతలను అరెస్టు చేశారు. కడప అసిస్టెంట్ కమిషనర్ మీడియాతో మాట్లాడుతూ... విజయవాడకు చెందిన జనార్ధన్‌రావు, ఆయన అనుచరుడు రాజులు ములకలచెరువుకు సమీపంలోని కనుగొండ ఆర్చీ సమీపంలో ఉన్న పాత డాబాను అద్దెకు తీసుకుని నకిలీ మద్యం తయారు చేస్తున్నారు. ఈ నకిలీ మద్యాన్ని వాహనం ద్వారా తంబళ్లపల్లె నియోజకవర్గంలోని పలు దుకాణాలకు సరఫరా చేస్తున్నారు. ప్రభుత్వ ధరకంటే తక్కువకు ఇస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. ఈ వ్యవహారంపై ఎక్సైజ్ డైరెక్టర్ రాహుల్‌దేవ్‌కు ఫిర్యాదులు అందడంతో... ఆయన ఆదేశాలతో అసిస్టెంట్ కమిషనర్ చంద్రశేఖర్‌రెడ్డి, అన్నమయ్య జిల్లా ఈఎస్ మధుసూదన్, ఏఈఎస్ జోగేంద్ర, సీఐలు నీలకంఠేశ్వర్‌రెడ్డి, కిషోర్, జహీర్ అహమ్మద్, ఎస్ఐలు హబీబుల్లా, సతీష్‌లు ములకలచెరువులో నకిలీ మద్యం తయారు చేస్తున్న పాత డాబాపై శుక్రవారం ఉదయం మెరుపుదాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో 15 వేల నకిలీ మద్యం బాటిళ్లు, 1050 లీటర్ల స్పిరిట్ క్యాన్లు, 1500 లీటర్ల బ్లెండ్ (తయారైన నకిలీ మద్యం), 10 వేల ఖాళీ మద్యం బాటిళ్లు, 4 వేల మద్యం క్యాపులు, స్టిక్కర్లు, మద్యం బాటిళ్లు తయారు చేసే పరికరాలు, ఇతర సామగ్రి సీజ్ చేశారు. ఈ నకిలీ మద్యం తయారు చేస్తున్న తమిళనాడు రాష్ట్రం కృష్ణగిరికి చెందిన మరిమారన్, తిరుపతూరుకు చెందిన సురేష్, సూర్య, ఆనందన్, ఒరిస్సా రాష్ట్రం బ్రహ్మపూర్‌కు చెందిన ఆనంద్‌దాస్, మిథున్, విశాఖపట్నం చెందిన సయ్యద్ అలీ, వాహన డ్రైవర్ బాలరాజు, నకిలీ మద్యం కలిగి ఉన్న బెల్ట్ షాపు నిర్వాహకుడు పీటీఎం మండలం రంగసముద్రానికి చెందిన నాగరాజును అరెస్టు చేశారు. వీళ్లతో పాటు పీటీఎం మండలంలోని మద్యం దుకాణ నిర్వాహకుడు టీడీపీ నేత కట్టా సురేంద్ర నాయుడు ఇంట్లో తనిఖీలు చేయగా.. అక్కడ నకిలీ మద్యం దొరకడంతో.. ఆయనను అరెస్టు చేశారు. విజయవాడకు చెందిన జనార్ధన్‌రావు, అతని అనుచరుడు రాజు, ములకలచెరువులోని రాక్‌స్టార్ ప్రభుత్వ మద్యం దుకాణ నిర్వాహకుడు రాజేష్‌పైనా కేసు నమోదు చేశారు.. తంబళ్లపల్లె నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి దాసరిపల్లి జయచంద్రారెడ్డి పీఏ పేరుతో ఉన్న వాహనం ద్వారానే నకిలీ మద్యం సరఫరా చేస్తున్నట్లు తమ విచారణలో వెల్లడైందని చెప్పారు. ప్రస్తుతానికి 9 మందిని అరెస్టు చేశామని, ఇంకా విచారణ జరుగుతోందని కడప ప్రొహిబిషన్, ఎక్సైజ్ అసిస్టెంట్ కమిషనర్ చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు. ఈ నకిలీ మద్యం తయారీ వెనుక ఎవరు ఉన్నారో బయట పడుతుందన్నారు.

సర్వత్రా చర్చ

జయచంద్రారెడ్డి పీఏ పైనే కేసు నమోదు కావడం.. ఆయన వాహనంలోనే మద్యం సరఫరా అయినట్లు దాడులు చేసిన అధికారులు పేర్కొనడంతో.. ఈ విషయంపై సర్వత్రా చర్చ జరుగుతోంది. ఈ నకిలీ మద్యం తయారీ వెనుక.. తంబళ్లపల్లె నియోజకవర్గంలోని టీడీపీ ముఖ్యనాయకుల సమీప బంధువుల ప్రమేయం ఉన్నట్లు ప్రచారంలో ఉంది. జిల్లాలోని పలువురు టీడీపీ నాయకుల హస్తం ఉన్నట్లు కూడా ఆరోపణలు వినిపిస్తున్నాయి.

నియోజవర్గ వ్యాప్తంగా దాడులు

ములకలచెరువులో భారీగా నకిలీ మద్యం పట్టుబడడంతో కడప అసిస్టెంట్ కమిషనర్ చంద్రశేఖర్‌రెడ్డి ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి తంబళ్లపల్లె నియోజకవర్గ వ్యాప్తంగా దాడులు నిర్వహించారు. నియోజకవర్గంలోని బెల్ట్‌షాపులు, ప్రభుత్వ మద్యం దుకాణాల్లో తనిఖీలు చేపట్టారు. ములకలచెరువులో నకిలీ మద్యం దొరికిందన్న విషయం నియోజకవర్గ వ్యాప్తంగా వ్యాపించడంతో పలువురు బెల్ట్‌షాపు నిర్వాహకులు అప్రమత్తమైనట్లు సమాచారం.

నకిలీ మద్యం గుట్టురట్టయింది ఇలా..

ఇటీవల జిల్లా ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు పీటీఎం మండలంలో తనిఖీలు నిర్వహిస్తూ.. నకిలీ మద్యం తీసుకెళ్తున్న వాహనాన్ని నిలిపారు. వారి వద్దనున్న స్కానర్‌తో బాటిళ్ల మీద ఉన్న లేబుల్‌ను స్కాన్ చేశారు. అయితే స్కాన్ కాకపోవడంలో అనుమానం వచ్చింది. అక్కడి నుంచి నకిలీ మద్యం తీసుకెళ్తున్న వాహనం వెళ్లిపోయింది. దీంతో విషయాన్ని ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లారు. అలాగే నకిలీ మద్యం తయారీపై ఎక్సైజ్ డైరెక్టర్‌కు ఫిర్యాదులు అందాయి. దీంతో ఆయన కడప అసిస్టెంట్ కమిషనర్‌కు ఆదేశాలు జారీ చేయడంతో నాలుగు రోజులుగా నిఘా ఉంచి పట్టుకున్నట్లు సమాచారం.


క్యాన్లలో ఉంచిన మద్యం బ్లెండ్

ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేద్దాం

- పాఠశాల విద్య కడప ఆర్జేడీ కె.శామ్యూల్


శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న ఆర్జేడీ శామ్యూల్

రాయచోటిటౌన్, అక్టోబరు 3(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలలను మరింత బలోపేతం చేద్దామని పాఠశాల విద్యా కడప ఆర్జేడీ కె.శామ్యూల్ పిలుపునిచ్చారు. 2025 డీఎస్సీ ద్వారా ఎంపికైన ఉపాధ్యాయులకు శుక్రవారం నుంచి రాష్ట్ర వ్యాప్తంగా శిక్షణ కార్యక్రమాలు ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా రాయచోటి పట్టణంలో రెండు వేర్వేరు చోట్ల సబ్జెక్టు టీచర్లకు, మోడల్ స్కూల్స్ ప్రిన్సిపాళ్లకు శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభించారు. అర్చన కళాశాలలో జరిగిన శిక్షణకు 270కు ముగ్గురు ఆబ్సెంటు కాగా, ఇందిరా ప్రియదర్శిని బీఈడీ కళాశాలలో జరిగిన శిక్షణకు 215 మందికి ముగ్గురు ఆబ్సెంటు అయినట్లు ఆర్జేడీ తెలిపారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులను ఉద్దేశించి మాట్లాడుతూ పాఠ్యాంశాలను అవగాహన చేసుకుని విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించాలన్నారు. ఉద్యోగం పొందడానికి ఎంత కష్టపడ్డారో, అదే స్థాయిలో కష్టపడి పేరు ప్రఖ్యాతలు తెచ్చుకోవాలన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య పెంచడంతో పాటు విద్యా ప్రమాణాలను మెరుగుపర్చేందుకు విద్యార్థుల తల్లిదండ్రులతో భాగస్వాములై ఆయా పాఠశాలల అభివృద్ధికి తోడ్పడాలన్నారు. ఈ కార్యక్రమంలో డీఈఓ డాక్టర్ కె.సుబ్రమణ్యం, రాష్ట్ర స్కూల్ గేమ్స్ కార్యదర్శి భానుమూర్తిరాజు, జిల్లా ఓపెన్ స్కూల్ కోఆర్డినేటర్ శ్రీనివాసరాజు పాల్గొన్నారు.

విద్యార్థులకు నాణ్యమైన విద్యనందించాలి

మదనపల్లెటౌన్, అక్టోబరు 3(ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు నాణ్యమైన విద్యాబోధన అందించాలని డీవైఈఓ లోకేశ్వరరెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక గ్రీన్‌వ్యాలీ హైస్కూల్లో ఉమ్మడి కడప జిల్లాకు చెందిన 396 మంది నూతన ఉపాధ్యాయులు (స్కూల్ అసిస్టెంట్లు)కు శిక్షణ తరగతులను ప్రారంభించిన అనంతరం సమగ్ర శిక్ష సీఎంఓ కరుణాకర్‌తో కలిసి ఆయన మాట్లాడారు. ప్రభుత్వం మెగా డీఎస్సీ ద్వారా 16,500 ఉపాధ్యాయ పోస్టులు భర్తీ చేసిందని, ఇందులో భాగంగా నూతన ఉపాధ్యాయులు రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న విద్యా సంక్షేమ పథకాలు, నిర్దేశిత విధులు, గుణాత్మక విద్యపై పూర్తిగా అవగాహన పెంచుకోవాలన్నారు. ఎనిమిది రోజులు నిర్వహించే శిక్షణ తరగతులను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. 11, 12 తేదీల్లో నూతన ఉపాధ్యాయులకు కౌన్సెలింగ్ నిర్వహించి, వారికి ఏయే పాఠశాలల్లో విధులు కేటాయిస్తారో ఉత్తర్వులు అందజేస్తారన్నారు. 13వ తేది వారికి కేటాయించిన పాఠశాలల్లో విధుల్లోకి చేరాలన్నారు. కార్యక్రమంలో ఎంఈఓలు ప్రభాకర్‌రెడ్డి, రెడ్డిశేఖర్‌రెడ్డి, కోర్సు డైరెక్టర్లు మహ్మద్‌ఖాన్, శ్రీనివాసులు, చంద్రకళ, గ్రీన్‌వ్యాలీ స్కూల్ దివాకర్ తదితరులు పాల్గొన్నారు.

విజయానికి ప్రతీక దసరా పండుగ

- ఎస్పీ ధీరజ్ కునుబిల్లి
- జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయంలో ఘనంగా ఆయుధ పూజ

రాయచోటిటౌన్, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): విజయానికి ప్రతీక దసరా పండుగ అని ఎస్పీ ధీరజ్ కునుబిల్లి పేర్కొన్నారు. జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయంలో విజయదశమి పర్వదినాన్ని పురస్కరించుకుని గురువారం ఆయుధపూజ కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహించారు. ఎస్పీ స్వయంగా ఈ వేడుకల్లో పాల్గొని పండితుల మంత్రోచ్ఛరణల మధ్య ప్రత్యేక పూజలు నిర్వహించారు. జిల్లా వ్యాప్తంగా విధులు నిర్వర్తించే అధికారులు, సిబ్బంది ఉపయోగించే ఆయుధాలు, పోలీసు వాహనాలు, ప్రత్యేక భద్రతా విభాగాల ఆయుధాలకు శాస్త్రోక్తంగా పూజలు చేశారు. అనంతరం మాట్లాడుతూ జిల్లా ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆరోగ్యంతో, ఐశ్వర్యంతో జీవించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఏఆర్ డీఎస్పీ శ్రీనివాసులు, ఎస్పీ సీఐ రాజారమేశ్, ఆర్ఐ పెద్దయ్య సహా ఇతర పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.


పోలీసు వాహనాలకు పూజలు నిర్వహిస్తున్న ఎస్పీ ధీరజ్ కునుబిల్లి

నేడు అంకురార్పణ



వాల్మీకిపురం, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): వాల్మీకిపురం పట్టణంలో వెలసిన పట్టాభిరామాలయంలో పవిత్రోత్సవాలకు టీటీడీ ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేశారు. ఈ నెల 4వ తేది శనివారం సాయంత్రం అంకురార్పణతో ఉత్సవాలు ప్రారంభం కానున్నట్లు ఆలయ అధికారులు, కృష్ణమూర్తి, నాగరాజులు పేర్కొన్నారు. 5 నుంచి 7వ తేది వరకు ఆలయంలో పవిత్ర మహోత్సవాలు, విశేష పూజా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు.

అహింసావాది.. మహాత్మా గాంధీ

- స్వర్ణాంధ్ర, స్వచ్ఛాంధ్ర అవార్డుల్లో జిల్లాకు రెండో స్థానం
- మంత్రి రాంప్రసాద్‌రెడ్డి, కలెక్టర్ నిశాంత్‌కుమార్


గాంధీ విగ్రహానికి నివాళులర్పిస్తున్న మంత్రి రాంప్రసాద్‌రెడ్డి, కలెక్టర్ నిశాంత్‌కుమార్

రాయచోటి(నేతాజీసర్కిల్), అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): సత్యం, అహింసావాది జాతిపిత మహాత్మాగాంధీ అని రాష్ట్ర రవాణా, యువజన, క్రీడాశాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి, కలెక్టర్ నిశాంత్‌కుమార్‌లు తెలిపారు. గాంధీ జయంతి సందర్భంగా గురువారం స్థానిక కలెక్టరేట్ ఆవరణంలో మహాత్మాగాంధీ విగ్రహానికి కలెక్టర్ నిశాంత్ కుమార్, జేసీ ఆదర్శ్ రాజేంద్రన్‌లతో కలిసి మంత్రి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం మొక్కలు నాటి నీరు పోశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామాలే దేశానికి పట్టుకొమ్మలని, గ్రామ స్వరాజ్యమే దేశ అభివృద్ధికి మూలం అని చాటిన వ్యక్తి గాంధీజీ అన్నారు. గాంధీజీ ఆదర్శాలను ఆదర్శంగా తీసుకొని ప్రధాని మోదీ, సీఎం చంద్రబాబు స్వచ్ఛతాహి సేవా కార్యక్రమాలను అమలు చేస్తున్నట్లు తెలిపారు. స్వచ్ఛతను ప్రజలందరూ జీవితంలో భాగస్వామ్యం చేసుకోవాలని కలెక్టర్ తెలియజేశారు. రాష్ట్ర ప్రభుత్వం స్వచ్ఛాంధ్ర- స్వర్ణాంధ్ర కార్యక్రమానికి బుధవారం ప్రకటించిన అవార్డుల్లో అన్నమయ్య జిల్లాకు 2వ స్థానం దక్కిందని తెలిపారు. జిల్లా స్థాయిలో 49 అవార్డులు ప్రకటించారని, అక్టోబరు 6న జిల్లా, రాష్ట్ర స్థాయిలో జరిగే కార్యక్రమాల్లో అవార్డు అందిస్తారన్నారు. కలెక్టర్ మాట్లాడుతూ గాంధీ పాటించిన విలువలు సమాజంలో ప్రతిఒక్కరూ అలవర్చుకోవాలని సూచించారు. కలెక్టరేట్‌లోని పీజీఆర్ఎస్ హాలులో డీఆర్వో మధుసూదన్‌రావు మహాత్మాగాంధీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. డ్వామా పీడీ వెంకటరత్నం, సెక్షన్ సూపరింటెండెంట్ రామాంజనేయులు, రాయచోటి డిప్యూటీ తహసీల్దార్ వంశీ, సిబ్బంది పాల్గొన్నారు.

తగ్గిన ధరలకే వస్తువులను విక్రయించాలి

- కలెక్టర్ నిశాంత్‌కుమార్

గుర్రంకొండ, అక్టోబరు 3(ఆంధ్రజ్యోతి): ప్రజలు నిత్యం కొనుగోలు చేసే వస్తువులను తగ్గిన ధరలకే వ్యాపారులు విక్రయించాలని కలెక్టర్ నిషాంత్‌కుమార్ పేర్కొన్నారు. సూపర్ జీఎస్టీ.. సూపర్ సేవింగ్ కార్యక్రమాన్ని శుక్రవారం గుర్రంకొండ ఎంపీడీవో కార్యాలయంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన కలెక్టర్ మాట్లాడుతూ ప్రజలపై ఆర్థిక భారాన్ని తగ్గించాలనే ఉద్దేశంతో కేంద్ర ప్రభుత్వం జీఎస్టీ సంస్కరణలు చేసిందన్నారు. ఈ సంస్కరణలతో ప్రజలు కొనుగోలు చేసే ప్రతి చిన్న వస్తువుపై ధరలు తగ్గినట్లు చెప్పారు. పిల్లలు తినే బిస్కెట్ నుంచి లక్షలాది రూపాయల విలువ చేసే వాహనాల వరకు ధరలు తగ్గాయని, ప్రజలు కొనుగోలు చేసే ప్రతి వస్తువు జీఎస్టీ పరిధిలోకి వస్తుందన్నారు. అలాగే దుకాణాల వద్ద వ్యాపారులు బోర్డులు ఏర్పాటు చేసేలా చూడాలని అధికారులకు సూచించారు. అనంతరం వ్యవసాయ రంగంలో తగ్గిన ఎరువులు, మందులు, డ్రిప్ పరికరాలు, స్ప్రేయర్లను రేట్లను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో డీఏవో శివనారాయణ, డీహెచ్‌వో సుభాషిణి, డీఎంఏవో లక్ష్మీప్రసన్న, ఏవో రత్నమ్మ, ఎంపీడీవో పరమేశ్వరరెడ్డి, తహసీల్దార్ లక్ష్మీప్రసన్న, నాయకులు మూర్తిరావు, జగదీష్, మురళీ, నౌషాద్‌అహ్మద్, మహాత్మారెడ్డి, బయ్యారెడ్డి పాల్గొన్నారు.

జాక్‌పాట్ విధానంపై రైతులు ఫిర్యాదు

గుర్రంకొండ టమోటా మార్కెట్ యార్డులో జాక్‌పాట్ విధానంతో వ్యాపారులు దోచుకొంటున్నారని రైతులు కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. మార్కెట్ శాఖ అధికారులకు పలుమార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని ఆరోపించారు. స్పందించిన కలెక్టర్ మార్కెట్ యార్డులో అక్రమాలపై చర్యలు తీసుకొంటామని రైతులకు హామీ ఇచ్చారు.



డ్రిప్ ఎరువులను పరిశీలిస్తున్న కలెక్టర్ నిశాంత్‌కుమార్

ముగిసిన దసరా ఉత్సవాలు

- గజవాహనంపై ఊరేగిన భద్రకాళీ అమ్మవారు
- పట్టువస్త్రాలు సమర్పించిన మంత్రి దంపతులు


మదనపల్లె: ధనలక్ష్మీదేవి అలంకరణలో కన్యకాపరమేశ్వరీదేవి

రాయచోటిటౌన్, అక్టోబరు 3(ఆంధ్రజ్యోతి): జిల్లాలో దసరా శరన్నవరాత్రి ఉత్సవాలు గురువారంతో ముగిశాయి. ఈ నేపథ్యంలో ఆయా ఆలయాల్లో అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి మూలవిరాట్‌ను పురవీధుల్లో ఊరేగించారు. కాగా జిల్లా కేంద్రమైన రాయచోటి పట్టణంలోని భద్రకాళీ అమ్మవారు చివరిరోజు గజవాహనంపై ఊరేగుతూ భక్తులకు దర్శనమిచ్చారు. చెక్‌పోస్టు శివాలయం, గాంధీబజార్‌లోని కన్యకాపరమేశ్వరి ఆలయం, పాతరాయచోటిలోని అగస్త్యేశ్వరాలయం, తోపు గంగమ్మ ఆలయం, గాలివీడు రోడ్డులోని గంగమ్మ ఆలయం, కొత్తపేట రామాపురంలోని చౌడేశ్వరి దేవాలయం, చెన్నముక్కపల్లె వద్ద గల కాశీవిశ్వేశ్వర విశాలాక్షి ఆలయాల్లో అమ్మవారు వివిధ రూపాల్లో భక్తులకు దర్శనమిచ్చారు. శుక్రవారం ఉదయం వసంతోత్సవం నిర్వహించారు. పీలేరు బండ్లవంక నడివీధి గంగమ్మ పురవీధుల్లో ఊరేగారు. మదనపల్లె కన్యకాపరమేశ్వరీదేవి అమ్మవారు ధనలక్ష్మీదేవి రూపంలో భక్తులను కటాక్షించారు. కాగా వీరభద్రాలయంలోని భద్రకాళీ అమ్మవారికి మంత్రి రాంప్రసాద్‌రెడ్డి, హరితమ్మ దంపతులు కుటుంబ సభ్యులతో కలిసి పట్టువస్త్రాలను సమర్పించారు.


రాయచోటి: ఉమాదేవి అమ్మవారి ఊరేగింపులో కోలాటం ఆడుతున్న దృశ్యం


కలికిరిలో సప్తమాతృకలతో ఊరేగుతున్న పార్వతీదేవి


రాయచోటి: గజవాహనంపై పురవీధుల్లో విహరిస్తున్న భద్రకాళీ సమేత వీరభద్రస్వామి


బీజాపూర్ జిల్లాలో లొంగిపోయిన మావోయిస్టులు

ఛత్తీస్‌గఢ్‌లో ఇద్దరు గిరిజనుల హత్య

- మావోయిస్టుల ఘాతుకం
- బీజాపూర్ జిల్లాలో లొంగిపోయిన 103మంది మావోయిస్టులు

చర్ల, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): ఛత్తీస్‌గఢ్‌లోని బీజాపూర్, సుకుమా జిలాల్లో మావోయిస్టులు ఇద్దరు గిరిజనులను హత్య చేశారు. బీజాపూర్ జిల్లా పూజారి కాంకేర్ గ్రామానికి చెందిన మడకం భీమా(45)ను మావోయిస్టులు గురువారం అతని ఇంటి ఆవరణలోనే దారుణంగా కత్తులతో పొడిచి చంపేశారు. భీమా 2018లో తెలంగాణలోకి వెళ్లిపోయి, ములుగు జిల్లాలో ఓ ఎస్ఐతో కలిసి పని చేశాడని, గ్రామంలో పోలీస్ క్యాంప్ పెట్టిన తరువాత తిరిగి వచ్చి, ప్రజలను బెదిరిస్తూ, రూ.లక్షలు దోచుకుంటున్నాడని, భూములు ఆక్రమిస్తున్నాడని అందుకే హత్య చేశామని మావోయిస్టులు ఓ లేఖలో పేర్కొన్నారు. అలాగే సుకుమా జిల్లా కిష్టారం అడవుల్లో ఓ గిరిజనుడిని మావోయిస్టులు హతమార్చారు. ఇదిలా ఉంటే ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం గంగలూరు అడవుల్లో గురువారం సాయంత్రం ఎన్‌కౌంటర్ జరిగింది. ఒక మావోయిస్టు చనిపోయాడు. మరోవైపు, బీజాపూర్ జిల్లా పోలీసులు ఎదుట గురువారం 103 మంది మావోయిస్టు పార్టీ సభ్యులు లొంగిపోయారు. వీరిలో 22 మంది మహిళలున్నారు. లొంగి పోయిన వారిలో 47మందిపై మొత్తం కలిపి రూ.1.06కోట్ల రివార్డులున్నట్టు ఎస్పీ జితేంద్ర యాదవ్ తెలిపారు. ఈ ఏడాది జనవరి నుంచి ఇప్పటివరకు 421మంది మావోయిస్టులు అరెస్టయ్యారని, 410 మంది లొంగి పోయారని, 137 మంది ఎన్‌కౌంటర్లలో మృతి చెందారని వెల్లడించారు.

అసభ్య పోస్టుల కేసులో అంజద్ బాషా పీఏ అరెస్టు

- కడప కోర్టులో హాజరు.. బెయిల్ మంజూరు

కడప క్రైం, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): కడప ఎమ్మెల్యే ఆర్.మాధవిపై అసభ్య పదజాలంతో ఉన్న వీడియోను సోషల్ మీడియాలో పోస్టు చేసిన కేసులో మాజీ డిప్యూటీ సీఎం అంజద్‌బాషా పీఏ షేక్ మహ్మద్‌ఖాజాను పోలీసులు అరెస్టు చేశారు. గురువారం అతన్ని కడప ఎక్సైజ్ కోర్టులో హాజరు పరచగా.. సొంత పూచీకత్తుపై అతనికి కోర్టు బెయిలు మంజూరు చేసింది. ఆ వివరాలను కడప డీఎస్పీ వెంకటేశ్వర్లు, వన్‌టౌన్ సీఐ రామకృష్ణ విలేకరులకు వివరించారు. కడప అక్బర్ వీధికి చెందిన షేక్ మహ్మద్ ఖాజా మాజీ డిప్యూటీ సీఎం అంజద్‌బాషాకు పీఏగా పనిచేస్తున్నాడు. 2024 ఎన్నికల సమయంలో ప్రస్తుత కడప ఎమ్మెల్యే మాధవి, ఆమె భర్త శ్రీనివాసరెడ్డిపై కడప అలంఖాన్‌పల్లెకు చెందిన విజయలక్ష్మి అసభ్యకరంగా మాట్లాడారు. ఆ వీడియోను అంజద్‌బాషా అతని సోదరుడు అహ్మద్‌బాషా ప్రోద్బలంతో సోషల్ మీడియాలో షేక్ మహ్మద్‌ఖాజా పోస్టు చేశాడు. ఈ వీడియో వైరల్ కావడంతో టీడీపీ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసరెడ్డి ఫిర్యాదు మేరకు అంజద్‌బాషా, అహ్మద్‌బాషా, షేక్ మహ్మద్‌ఖాజాలపై కేసు నమోదు చేశారు. షేక్ మహ్మద్ ఖాజాను బుధవారం హైదరాబాద్‌లో అదుపులోకి తీసుకున్నారు. గురువారం కోర్టులో హాజరు పరిచారు. ఎవరైనా సోషల్ మీడియాలో అసభ్యకరమైన వీడియోలు పోస్టు చేస్తే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఈ సందర్భంగా పోలీసులు హెచ్చరించారు.

'సిట్' ముందు హాజరైన మిథున్‌రెడ్డి

విజయవాడ, అక్టోబరు 3(ఆంధ్రజ్యోతి): మద్యం కుంభకోణంలో నిందితుడిగా ఉన్న రాజంపేట ఎంపీ పీవీ మిథున్‌రెడ్డి విజయవాడలోని సిట్ అధికారుల ముందు శుక్రవారం హాజరయ్యారు. ప్రతి సోమవారం, శుక్రవారం సిట్ అధికారుల ముందు హాజరవ్వాలని కోర్టు బెయిల్ ఉత్తర్వుల్లో షరతు విధించింది. దాని ప్రకారం మిథున్‌రెడ్డి సిట్ కార్యాలయానికి వచ్చి పుస్తకాల్లో సంతకం చేశారు. ఇటీవలే ఆయనకు కోర్టు బెయిల్ మంజూరు చేయడంతో రాజమహేంద్రవరం కేంద్ర కారాగారం నుంచి విడుదలైన విషయం తెలిసిందే.


సర్జరీ సిస్టమ్‌ను ప్రారంభిస్తున్న సత్యసాయి సెంట్రల్ ట్రస్టు సభ్యుడు చక్రవర్తి, పక్కన సత్యసాయి సెంట్రల్ ట్రస్టు మేనేజింగ్ ట్రస్టీ ఆర్జే రత్నాకర్ తదితరులు

'సత్యసాయి' ఆస్పత్రిలో రోబోటిక్ సర్జరీ సేవలు

- గుండె, యూరాలజీ విభాగంలో అందుబాటులోకి సేవలు

పుట్టపర్తి రూరల్, అక్టోబరు 3(ఆంధ్రజ్యోతి): శ్రీసత్యసాయి జిల్లా పుట్టపర్తిలోని సత్యసాయి సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిలో అత్యాధునిక రోబోటిక్ సర్జరీ సేవలు అందుబాటులోకి వచ్చాయి. రూ.8 కోట్ల విలువైన అత్యాధునిక రోబోటిక్ సర్జరీ వ్యవస్థను సత్యసాయి సెంట్రల్ ట్రస్టు మేనేజింగ్ ట్రస్టీ ఆర్జే రత్నాకర్, సభ్యుడు చక్రవర్తి గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా రత్నాకర్ మాట్లాడుతూ, భగవాన్ సత్యసాయి ధ్యేయమైన విలువలు, కరుణ, ప్రేమతో కూడిన అత్యాధునిక వైద్యాన్ని ఉచితంగా అందుబాటులోకి తెచ్చామన్నారు. ఎస్ఎస్ ఇన్నొవేషన్స్ అనే భారతీయ సంస్థ ప్రపంచ స్థాయి ప్రమాణాలకు తగ్గట్లు ఈ రోబోటిక్ శస్త్ర చికిత్స వ్యవస్థను అభివృద్ధి చేసిందన్నారు. ఈ వ్యవస్థతో శరీరంలోని సున్నితమైన ప్రాంతాలకు కూడా అత్యంత కచ్చితత్వంతో, సంక్లిష్టమైన శస్త్ర చికిత్సలను సులభతరంగా చేయవచ్చని వెల్లడించారు. రోబోటిక్ సర్జరీకి రూ.లక్షలు ఖర్చు అవుతుందని, కానీ సత్యసాయి సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిలో పూర్తి ఉచితంగా అందుతుందని స్పష్టం చేశారు.


రోబోటిక్ సర్జరీ యంత్రాలు

ములకలచెరువు కేంద్రంగా
నకిలీ మద్యం తయారీ

- రూ.1.75 కోట్ల విలువైన నకిలీ మద్యం స్వాధీనం
- స్పిరిట్, బాటిళ్లు, పరికరాలు సీజ్.. 9 మంది అరెస్టు


నకిలీ మద్యాన్ని తయారు చేస్తున్న దృశ్యం.. స్వాధీనం చేసుకున్న నకిలీ మద్యం బాక్సులు

రాయచోటి, అక్టోబరు 3(ఆంధ్రజ్యోతి): అన్నమయ్య జిల్లా ములకలచెరువులో శుక్రవారం ఎక్సైజ్ అధికారులు దాడులు జరిపి రూ.1.75కోట్ల విలువైన నకిలీ మద్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. కడప ప్రొహిబిషన్, ఎక్సైజ్ అసిస్టెంట్ కమిషనర్ చంద్రశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఈ దాడులు జరిగాయి. అనంతరం ఆయన మీడియాకు వివరాలు వెల్లడించారు. విజయవాడకు చెందిన జనార్దన్‌రావు, ఆయన అనుచరుడు రాజు ములకలచెరువుకు సమీపంలోని కనుగొండ ఆర్చి సమీపంలో ఉన్న పాత డాబాను అద్దెకు తీసుకుని నకిలీ మద్యం తయారు చేస్తున్నారు. ఈ మద్యాన్ని వాహనం ద్వారా తంబళ్లపల్లె నియోజకవర్గంలోని పలు ప్రాంతాలకు సరఫరా చేస్తున్నారు. ప్రభుత్వ ధర కంటే తక్కువకే ఇస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. పలు ప్రభుత్వ మద్యం షాపులకు కూడా ఈ మద్యాన్ని సరఫరా చేస్తున్నారు. ఇటీవల జిల్లా ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు పెద్దతిప్ప సముద్రం మండలంలో తనిఖీలు నిర్వహిస్తూ.. నకిలీ మద్యం తీసుకెళ్తున్న వాహనాన్ని నిలిపారు. బాటిళ్ల మీద ఉన్న లేబుల్‌ను స్కాన్ చేశారు. అయితే స్కాన్ కాకపోవడంతో అనుమానం వచ్చి విషయాన్ని ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లారు. ఈ వ్యవహారంపై ఎక్సైజ్ డైరెక్టర్ రాహుల్ దేవ్‌కు ఫిర్యాదులు అందడంతో అధికారులు గత నాలుగు రోజులుగా నిఘా ఉంచి శుక్రవారం ఈ దాడులు చేశారు. 15 వేల నకిలీ మద్యం బాటిళ్లు, 1050 లీటర్ల స్పిరిట్ క్యాన్లు, 1500 లీటర్ల బ్లెండ్(తయారైన నకిలీ మద్యం), 10 వేల ఖాళీ మద్యం బాటిళ్లు, 4 వేల మద్యం సీసా మూతలు.. స్టిక్కర్లు, మద్యం బాటిళ్లు తయారు చేసే పరికరాలు, ఇతర సామగ్రి, నకిలీ మద్యం సరఫరా చేసే వాహనాన్ని సీజ్ చేశారు. తమిళనాడు రాష్ట్రం కృష్ణగిరికి చెందిన మరిమారన్, తిరుపత్తూరుకు చెందిన సురేశ్, సూర్య, ఆనంద న్, ఒడిశా రాష్ట్రం బ్రహ్మపూర్‌కు చెందిన ఆనంద్ దాస్, మిథున్, విశాఖపట్నానికి చెందిన స య్యద్ అలీ, వాహన డ్రైవర్ బాలరాజు, నకిలీ మద్యం కలిగి ఉన్న బెల్ట్ షాపు నిర్వాహకుడు రంగసముద్రానికి చెందిన నాగరాజు, పెద్దతిప్ప సముద్రంలోని మద్యం దుకాణ నిర్వాహకుడు టీడీపీ నేత కట్టా సురేంద్రనాయుడును అరెస్టు చేశారు. విజయవాడకు చెందిన జనార్దన్‌రావు, అతని అనుచరుడు రాజు, ములకలచెరువులోని రాక్‌స్టార్ ప్రభు త్వ మద్యం దుకాణ నిర్వాహకుడు రాజేశ్ తదితరులపైనా కేసు నమోదు చేశారు.


సమావేశంలో వివరాలు వెల్లడిస్తున్న ఎక్సైజ్ అసిస్టెంట్ కమిషనర్ చంద్రశేఖర్‌రెడ్డి

నిందితుల్లో తంబళ్లపల్లె టీడీపీ ఇన్‌చార్జి పీఏ

రాజేశ్ తంబళ్లపల్లె నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి దాసరిపల్లి జయచంద్రారెడ్డి పీఏగా పనిచేస్తున్నారు. ఇతని పేరుతో ఉన్న వాహనం ద్వారానే నకిలీ మద్యం సరఫరా చేస్తున్నారు. దీనిపై సర్వత్రా చర్చ జరుగుతోంది. ఈ నకిలీ మద్యం తయారీ వెనుక తంబళ్లపల్లె నియోజకవర్గ టీడీపీ ముఖ్య నాయకుల సమీప బంధువుల ప్రమేయం ఉన్నట్టు ప్రచారం జరుగుతోంది. ఈ నకిలీ మద్యం తయారీలో జిల్లాలోని పలువురు టీడీపీ నాయకుల హస్తం ఉన్నట్టు కూడా ఆరోపణలు వినిస్తున్నాయి. నియోజకవర్గంలోని పలు బెల్ట్‌షాపులు, ప్రభుత్వ మద్యం దుకాణాల్లోనూ ఎక్సైజ్ అధికారులు దాడులు నిర్వహించారు.

గ్యాంగ్ రేప్ కేసు నిందితులకు రిమాండ్

- గత నెల 25న చిత్తూరు సమీపంలో బాలికపై అఘాయిత్యం

చిత్తూరు అర్బన్, అక్టోబరు 3(ఆంధ్రజ్యోతి): ఇటీవల చిత్తూరులో ఇంటర్ విద్యార్థినిపై గ్యాంగ్ రేప్‌కు పాల్పడిన ముగ్గురు యువకులను పోలీసులు శుక్రవారం అరెస్టు చేశారు. ఇందుకు సంబంధించిన వివరాలను డీఎస్పీ సాయినాథ్ మీడియాకు వివరించారు. గత నెల 25వ తేదీన చిత్తూరు నగర సమీపంలో ఉన్న నీవా నగర వనం పార్కుకు వచ్చిన యువ జంటను ముగ్గురు యువకులు బెదిరించారు. బాలికపై అత్యాచారానికి పాల్పడ్డారు. ఆ జంటలోని యువకుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు 29వ తేదీన పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ కేసులో నిందితులైన మహేష్, కిశోర్, హేమంత్‌ను శుక్రవారం అరెస్టు చేసి కోర్టులో హాజరు పరిచారు. ముగ్గురు నిందితులకు పోక్సో కోర్టు ఈ నెల 16 వరకు రిమాండ్ విధించింది. నిందితుల్లో ఒకరైన మహేష్ ఓ బాలికను ఈవ్ టీజింగ్ చేసిన కేసులో నిందితుడిగా ఉన్నాడు. కిశోర్ 2022లో నగరంలోని ఓ వైన్ షాపులో పనిచేస్తుండగా అక్కడి మద్యాన్ని బ్లాక్‌లో విక్రయించాడని అతనిపై కేసు నమోదైంది. కాలక్షేపం కోసం పార్కులకు వచ్చే ప్రేమ జంటలను లక్ష్యంగా చేసుకుని వారు కలిసున్న దృశ్యాలను వీడియో తీసి వారిని బెదిరించడం.. వారి వద్ద ఉన్న నగదు, బంగారాన్ని లాక్కోవడం.. లైంగిక వేధింపులకు పాల్పడటం.. వీరి నేర ప్రవృత్తిగా పోలీసుల దర్యాప్తులో వెల్లడైంది. కాగా.. నిందితుల్ని స్థానిక డీపీవో కార్యాలయం నుంచి అర కిలో మీటరు దూరంలో ఉన్న కోర్టు వరకు బేడీలు వేసి రోడ్డుపై నడిపించుకుంటూ తీసుకెళ్లారు.

హోటల్ సిబ్బందిపై వైసీపీ నేత నాగార్జున యాదవ్ దాడి

- అల్పాహారం ఆలస్యంగా ఇచ్చారని దౌర్జన్యం
- ఇరువురికి గాయాలు.. కేసు నమోదు


హోటల్ యజమాని కొడుకు ప్రేమ్‌కుమార్

సత్తెనపల్లి, అక్టోబరు 3(ఆంధ్రజ్యోతి): అల్పాహారం తీసుకురావడంలో ఆలస్యం అయిందని హోటల్ యజమాని, సిబ్బందిపై వైసీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి యనమల నాగార్జున యాదవ్ అతని అనుచరులు రెచ్చిపోయారు. వారిపై దాడి చేసి గాయపర్చారు. ఈ దాడి ఘటన గురువారం రాత్రి పల్నాడు జిల్లా సత్తెనపల్లిలోని తాలూకాసెంటర్‌లో జరిగింది. రాత్రి 10 గంటల సమయంలో నాగార్జున యాదవ్ అతని అనుచరులు పట్టణంలోని గుడ్‌మార్నింగ్ హోటల్‌కు టిఫిన్ చేసేందుకు వచ్చారు. టిఫిన్ అందించడం ఆలస్యమవుతుందని నాగార్జునయాదవ్ అతని అనుచరులు గొడవకు దిగారు. హోటల్ యజమాని శేఖర్, అతని కుమారుడు ప్రేమ్‌కుమార్, వర్కర్ నాగేశ్వరరావుపై దాడి చేశారు. ఈ ఘటనలో ప్రేమ్‌కుమార్, వర్కర్‌కు గాయాలయ్యాయి. తనతో పెట్టుకుంటే అబ్బూరు ఊరు ఊరంతా కదిలొస్తుందంటూ హోటల్ యజమాని శేఖర్‌ను నాగార్జున యాదవ్ బెదిరించారు. దాడి ఘటనపై హోటల్ యజమాని శేఖర్ పట్టణ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.


హోటల్ యజమానిపై దౌర్జన్యం చేస్తున్న వైసీపీ నాయకుడు యనమల నాగార్జునయాదవ్

దేవపట్ల పీహెచ్‌సీ ఆకస్మిక తనిఖీ


వైద్య సిబ్బందితో మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో లక్ష్మీనరసయ్య

రాయచోటి (నేతాజీ సర్కిల్), అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): దేవపట్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని డీఎంహెచ్‌వో డాక్టర్ లక్ష్మీనరసయ్య శుక్రవారం సందర్శించారు. వైద్యులు సమ్మెలో ఉన్న కారణంగా ప్రజలకు వైద్య సేవలు అందుతున్న తీరును పరిశీలించేందుకు వైద్యులు డాక్టర్ అజాజ్ అహ్మద్‌తో మాట్లాడి పరిస్థితులను తెలుసుకున్నారు. రికార్డులను పరిశీలించారు. పీహెచ్‌సీల్లో ప్రసవాలు జరిగేలా సిబ్బంది కృషి చేయాలన్నారు. సీజనల్ వ్యాధులపై గ్రామాల్లో అవగాహన సమావేశాలు నిర్వహించి ప్రజలను చైతన్య పరచాలన్నారు. కార్యక్రమంలో డాక్టర్ విష్ణువర్ధన్‌రెడ్డి, ఎంపీహెచ్ ఈవో వెంకటేశ్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

రైతులకు ఉపయోగపడే పనులను గుర్తించండి


సమావేశంలో మాట్లాడుతున్న చిదంబర్‌రెడ్డి

రాయచోటి (నేతాజీ సర్కిల్), అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): ఉపాధి హామీ పథకంలో రైతులకు ఉపయోగపడే పనులను గుర్తించాలని సర్పంచుల సంఘం జిల్లా అధ్యక్షుడు ఏఐపీపీ న్యూఢిల్లీ జనరల్ సెక్రటరీ చిదంబర్‌రెడ్డి తెలిపారు. గుట్టపల్లి సచివాలయంలో ఉపాధి హామీ పనుల గుర్తింపు గ్రామ సభల్లో ఆయన పాల్గొన్నారు. ఏపీవో రెడ్డిజవహర్ అధ్యక్షతన నిర్వహించిన ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ 2026-27 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి ఉపాధి హామీ పనులను గుర్తించాలని తెలియజేశారు. రెండవ గ్రామ సభలో గుర్తించిన పనులను ప్రజలకు తెలియజేస్తామన్నారు. ఎంపీటీసీ సభ్యుడు రవీంద్ర నాయుడు మాట్లాడుతూ అక్రమాలకు తావు లేకుండా పనులు జరిగేలా చూడాలన్నారు. కార్యక్రమంలో ఉపాధి హామీ టీఏ, ఫీల్డ్ అసిస్టెంట్లు తదితరులు పాల్గొన్నారు.

వివాదాస్పద స్థల పరిశీలన


రికార్డులు పరిశీలిస్తున్న అధికారులు

పీలేరు, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): ఆవు వారిపల్లె వద్ద కొంత కాలంగా వివాదాల్లో నలుగుతున్న సర్వే నెం.440లోని స్థలాన్ని శుక్రవారం జిల్లా ఉన్నతాధికారులు పరిశీలించారు. జిల్లా సర్వే, ల్యాండ్ రికార్డ్స్ ఏడీ భరత్ కుమార్, సర్వే శాఖ రాయచోటి డివిజన్ ఇన్‌స్పెక్టర్ ప్రసాద్, డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ గురివిరెడ్డి పరిశీలించారు. వారు మాట్లాడుతూ ఆవువారిపల్లెకు చెందిన ఇరుపక్షాల మధ్య కోర్టు కేసుల నేపథ్యంలో కోర్టు, జిల్లా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు క్షేత్రస్థాయి పరిశీలన జరిపినట్లు తెలిపారు. కార్యక్రమంలో తహసీల్దారు శివకుమార్, సర్వేయర్ రెడ్డిశేఖర్, వీఆర్వో వెంకటేశ్, తదితరులు పాల్గొన్నారు.

అనుమానాస్పద స్థితిలో వాచ్‌మన్ మృతి


అనుమానాస్పదంగా మృతిచెందిన రవితేజ

ఓబులవారిపల్లె, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఏపీఎండీసీ పబ్లిక్ స్కూల్ వాచ్‌మన్ పసుపులేటి రవితేజ(29) అనుమానాస్పద స్థితిలో మృతిచెందినట్లు పోలీసులు కేసు నమోదు చేశారు. మంగంపేట పునరావాసప్రాంతంలోని అరవ వీధికి చెందిన పసుపులేటి సుబ్బరాయుడు కుమారుడు రవితేజ పదేళ్లుగా ఏపీఎండీసీ స్కూల్లో వాచ్‌మన్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. శుక్రవారం ఉదయం మొదటి షిఫ్టులో డ్యూటీకి హాజరైన అతను స్కూలు ప్రాంగణంలో కిందపడడంతో, పక్కనే ఉన్న ఆసుపత్రికి వెళ్లి చికిత్స చేయించుకున్నాడు. మధ్యాహ్నం స్కూల్ బయట ఉన్న మోటారును ఆన్ చేసేందుకు వెళ్లి అక్కడే పడిపోయాడు. విషయం గమనించిన సిబ్బంది అతనిని తొలుత మంగంపేట ఆసుపత్రికి, అక్కడినుంచి కోడూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ పరీక్షించిన వైద్యులు అప్పటికే అతను మృతి చెందినట్లు ధ్రువీకరించారు. అతను విద్యుత్ షాక్‌తో మృతిచెందాడా అన్న విషయంపై అనుమా నాలు వ్యక్తమవుతున్నా. తమ కుటుంబానికి న్యాయం చేయాలని మృతుని అక్క చంద్రిక పోలీసులకు ఫిర్యాదు చేశారు. మృతదేహాన్ని రైల్వేకోడూరు ప్రభుత్వాసుపత్రికి తరలించినట్లు పోలీసులు తెలిపారు. మృతుడికి భార్య, ఇద్దరు చిన్న పిల్లలు ఉన్నారు. అయితే, ఏపీఎండీసీ స్కూలు యాజమాన్యం ఈ విషయంపై ఇప్పటివరకు పట్టించుకోలేదని గ్రామస్థులు వాపోయారు.


జోరుగా మద్యం అమ్మకాలు..!

- అధికారుల తీరుపై మండిపాటు

గుర్రంకొండ, అక్టోబరు 3(ఆంధ్రజ్యోతి): పట్టణంలో గాంధీ జయంతి రోజున కూడా మద్యం అమ్మకాలు జోరందుకున్నాయి. ఉదయం నుంచీ రాత్రి వరకు విచ్చలవిడిగా సాగాయి. గ్రామాల్లో కూడా బెల్టుషాపుల్లో మద్యం ఏరులైపారింది. పట్టణంలోని మార్కెట్ యార్డు, ఖంద్రిగ, ఇందిరమ్మకాలనీ, మద్యం దుకాణాల పక్కనున్న బెల్టుషాపుల వద్ద గురువారం మద్యం విక్రయాలు జరగడం విమర్శలకు దారితీస్తోంది. మద్యం దుకాణాలు బంద్ కావడంతో ముందు రోజే బెల్టుషాపు నిర్వాహకులు తమకు కావాల్సినంత మద్యాన్ని కొనుగోలు చేసి స్టాక్ ఉంచుకున్నారు. ఈ విషయమై అధికారుల తీరుపై ప్రజలు మండిపడుతున్నారు. ఈ విషయమై వాల్మీకిపురం ఎక్సైజ్ శాఖ సీఐ లతశ్రీని వివరణ కోరగా నిబంధనలకు విరుద్ధంగా గుర్రంకొండలో మద్యం అమ్మిఉంటే విచారించి చర్యలు తీసుకుంటామన్నారు.


మద్యం దుకాణం పక్కనే మద్యం విక్రయిస్తున్న బెల్టుషాపు నిర్వాహకులు

రోడ్డు ప్రమాదంలో కార్యదర్శి మృతి


కృష్ణప్రసాద్ (ఫైల్‌ఫొటో)

పెద్దతిప్పసముద్రం, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): బూర్లపల్లె పంచాయతీ కార్యదర్శి కృష్ణప్రసాద్ (58) రోడ్డు ప్రమాదంలో దుర్మరణం చెందాడని పోలీసులు తెలిపారు. ఇటీవల బదిలీల్లో భాగంగా సత్యసాయి జిల్లా సోమందేపల్లెకు చెందిన కృష్ణప్రసాద్ బూర్లపల్లె పంచాయతీ కార్యదర్శిగా విధుల్లో చేరారు. గత నెల 27న శనివారం విధులు ముగించుకుని సాయంత్రం ద్విచక్రవాహనంలో తమ స్వగ్రామం సోమందేపల్లెకు బయలుదేరాడు. ఈ క్రమంలో సోమందేపల్లె సమీప నల్లకొండ్రాయునిపల్లె క్రాస్ వద్ద ద్విచక్ర వాహనాన్ని గుర్తు తెలి యని వాహనం ఢీ కొనడంతో అతను తీవ్రంగా గాయపడ్డారు. పెనుగొండ హైవే పోలీసులు గమనించి కుటుంబ సభ్యులకు సమాచారమందించి అతన్ని పెనుగొండ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం కర్నూలు జనరల్ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ గురువారం ఉదయం 10 గంటలకు మృతి చెందారు. కృష్ణప్రసాద్ మృతిపై ఎంపీడీఓ అబ్దుల్‌కలాం ఆజాద్, ఏఓ శ్రీధర్, ఆర్‌డబ్ల్యూఎస్ బోరు మెకానిక్ చంద్ర, సహ పంచాయతీ కార్యదర్శులు, బూర్లపల్లె సుధాకర్‌రెడ్డి సంతాపం తెలిపారు. కాగా దహనక్రియలకు ప్రభుత్వం నుంచి అందించే సహాయంలో భాగంగా రూ.25 వేలను మృతుడి కుటుంబ సభ్యులకు ఎంపీడీఓ అందించారు.

జీఎస్టీ తగ్గింపుపై అవగాహన

రాయచోటి(నేతాజీసర్కిల్), అక్టోబరు3(ఆంధ్రజ్యోతి): సూపర్ జీఎస్టీ.. సూపర్ సేవింగ్‌పై ప్రజల్లో అవగాహన కల్పిస్తున్నట్లు రాయచోటి జీఎస్టీ వాణిజ్య పన్నుల అధికారి షేక్.సుమయ తెలిపారు. శుక్రవారం రాయచోటి మున్సిపల్ కమిషనర్ రవి, ఎంపీడీవో పరిపూర్ణ అరుంధతితో కలిసి మండల పరిషత్ కార్యాలయం నుంచి బంగ్లా వరకు అవగాహన ర్యాలీ నిర్వహించారు. ప్లకార్డులు ప్రదర్శిస్తూ నినాదాలు చేశారు. పూర్తి స్థాయిలో ప్రజల్లో అవగాహన తీసుకొచ్చి తగ్గిన జీఎస్టీ ప్రకారం అమ్మకాలు జరిగే విధంగా చూస్తామని, ప్రజల్లో చైతన్యం వచ్చినప్పుడే ఇది సాధ్యమని తెలిపారు. కార్యక్రమంలో ఈవోపీఆర్‌డీ సురేశ్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.




అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

రోడ్డు ప్రమాదంలో ఆయా..


మహిళ మృతదేహం

మదనపల్లె అర్బన్, అక్టోబరు 3 (ఆంధ్ర జ్యోతి): ఓ ప్రైవేటు స్కూల్‌లో ఆయాగా పనిచేస్తున్న ముని లక్ష్మమ్మ (55) రోడ్డు ప్రమాదంలో మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. పుంగనూరు మండలం, లదిగం వాసి మునిలక్ష్మమ్మ రోడ్డు దాటుతుండగా బైక్ ఢీ కొనడంతో ఆమె అక్కడికక్కడే మృతి చెందింది. సమాచారం అందుకున్న తాలుకా సీఐ కళా వెంకటరమణ సంఘటన స్థలానికి చేరుకుని ట్రాఫిక్ క్లియర్ చేసి మృతదేహాన్ని మదనపల్లె జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ పేర్కొన్నారు.

పురుగుల మందుతాగి వృద్ధుడు..


నరసింహులు మృతదేహం

మదనపల్లెఅర్బన్, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): అనారోగ్యంతో పురుగుల మందు తాగి వృద్ధుడు ఆత్మహత్య చేసుకున్న సంఘటన మదనపల్లె మండలంలో చోటు చేసుకుంది. పోలీసుల వివరాల మేరకు.. గురువారం మదనపల్లె మండలం, రంగారెడ్డికాలనీకి చెందిన లేట్ ఉత్తన్న కుమారుడు బండా నరసింహులు(68) గురువారం ఉదయం బయటకు వెళ్లి కొత్త ఇళ్ల సమీపంలో పురుగుల మందుతాగి ఆత్మహత్యకు పాల్పడాడు. కొన్ని రోజులుగా అనారోగ్యంతో ఉన్న ఆయన మందులు సక్రమంగా వేసుకోలేదని భార్య గంగులమ్మ మందలించడంతో మనస్థాపానికి గురై ఆత్మహత్య చేసుకున్నాడు. గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే మదనపల్లె జిల్లా ప్రభుత్వాస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. కుమారుడు రమణ ఫిర్యాదు మేరకు సీఐ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

అంబులెన్సు ఢీకొని ఆర్ఎంపీ..


నరేంద్రరావు (ఫైల్ ఫొటో)

రైల్వేకోడూరు, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని హీరో షోరూం ఎదురుగా ప్రధానదారిలో బుధవారం రాత్రి ఓ ప్రైవేటు అంబులెన్సు ఢీకొని ఆర్ఎంపీ మృతిచెందాడు. పోలీసుల కథనం మేరకు... పట్టణంలోని బలిజవీధికి చెందిన ఆర్ఎంపీ నార్జాల నరేంద్రరావు (59) వైద్యశాలను మూసిన అనంతరం బలిజపల్లె గంగమ్మ ఆలయానికి బైక్‌లో వెళుతుండగా కడప వైపు నుంచి వస్తున్న ఓ ప్రైవేటు అంబులెన్స్ ఢీకొంది. దీంతో తీవ్రంగా గాయపడిన ఆయనను స్థానికులు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం తిరుపతిలోని ఓ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

పరిశుభ్రతకు పట్టం

● చెన్నూరు గ్రామ పంచాయతీకి స్వచ్ఛ ఆంధ్ర అవార్డు

● 6న సీఎం చేతుల మీదుగా ప్రదానం

చెన్నూరు, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): చెన్నూరు గ్రామ పంచాయతీకి రాష్ట్రస్థాయి స్వచ్ఛ ఆంధ్ర అవార్డుకు ఎంపికైంది. పరిశుభ్రతతోనే అభివృద్ధి అనే ధ్యేయంతో ప్రణాళికాబద్ధంగా పనిచేయడంతోనే రాష్ట్ర ప్రభుత్వం ఈ అవార్డుకు ఎంపిక చేసింది. రాష్ట్రంలోని ఆరు మున్సిపాలిటీలు, ఆరు గ్రామ పంచాయతీలను స్వచ్ఛాంధ్ర అవార్డుకు ఎంపిక చేయగా... అందులో జిల్లాలోని చెన్నూరు గ్రామ పంచాయతీ అవార్డు దక్కించుకుంది. ఈనెల 6న విజయవాడలో జరిగే స్వచ్ఛ ఆంధ్ర అవార్డుల ప్రదానోత్సవ కార్యక్రమంలో చెన్నూరు గ్రామ పంచాయతీ కార్యదర్శి రామసుబ్బారెడ్డి, సర్పంచ్ ఎస్.వెంకటసుబ్బయ్యలు ఈ అవార్డు అందుకోనున్నారు.

చెన్నూరు మేజరు గ్రామ పంచాయతీగా ఏర్పడినప్పటి నుంచి పరిశుభ్రతపై అత్యధిక ప్రాధాన్యతనిచ్చారు. గత చంద్రబాబు పాలనలో చెన్నూరు గ్రామ పంచాయతీలో చెత్త సంపద తయారీ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. దీంతో పరిశుభ్రతపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించారు. దీంతో ఉదయం 5గంటలకే పంచాయతీ కార్యదర్శి రామసుబ్బారెడి, డిప్యూటీ ఎంపీడీవో గంగనపల్లె సురేశ్ బాబు పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి సారించేవారు. వీరికి సర్పంచ్ వెంకటసుబ్బయ్య సైతం పూర్తి సహాయ సహకారాలు అందించేవారు. డిప్యూటీ ఎంపీడీవో నిరంతరం పారిశుధ్య కార్మికులకు అవగాహన కల్పించి.. ప్రతి ఇంటి ముందు ఉన్న చెత్తను ఉదయం 5 నుంచి శుభ్రపరిచి చెత్త సంపద కేంద్రాలకు తరలించేవారు. 15రోజులకోమారు గ్రామ పంచాయతీలో డ్రైనేజీలు శుభ్రం చేయడం, వర్షాకాలం వస్తే మురికి ఉన్న చోట బ్లీచింగ్ చల్లడం, దోమలున్న చోట ఫాగింగ్ చేయడం వంటి కార్యక్రమాలు చేపట్టేవారు. ఈ నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం మేజరు గ్రామ పంచాయతీ చెన్నూరును స్వచ్ఛ ఆంధ్ర అవార్డుకు ఎంపిక చేసింది.


చెత్త సంపద కేంద్రంలో వ్యర్థాలతో తయారవుతున్న ఎరువు



చెన్నూరు చెత్తసంపద కేంద్రం వద్ద పచ్చదనం

అంతా పచ్చదనమే..

గ్రామ పంచాయతీల్లో సేకరించే చెత్తను చెత్త సంపద కేంద్రాలకు తరలించి.. ఎరువుగా మార్చి రైతులకు కిలో లెక్కన అందించేవారు. ఇక్కడి ఎస్‌డబ్ల్యూపీసీని చూడగానే అదేదో కసువు వేసే దిబ్బలా కాకుండా పూలు, పండ్ల మొక్కలతో ఆకట్టుకునేలా తీర్చిదిద్దారు. దీంతో ఇక్కడ వాతావరణం ఆహ్లాదకరంగా ఉంటుంది. ఇది కూడా స్వచ్ఛ ఆంధ్ర అవార్డుకు ప్రధాన కారణమని చెప్పవచ్చు.

పరిశుభ్రతపై ప్రత్యేక దృష్టి



గ్రామ పంచాయతీలో ఎక్కడ అపరిశుభ్రత ఉందని చెప్పినా.. ఫోను ద్వారా తెలిపినా వెంటనే స్పందిస్తున్నాం. ఏ ప్రాంతంలో వ్యర్థాలున్నా అక్కడకు పారిశుధ్య సిబ్బందితో వెళ్లి నిమిషాల వ్యవధిలోనే శుభ్రం చేయిస్తున్నాం. ప్రజలు కూడా పరిశుభ్రతపై సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

- జి.సురేశ్‌బాబు, డిప్యూటీ ఎంపీడీవో, చెన్నూరు

ప్రజల ఆరోగ్యమే ముఖ్యం



చెన్నూరు పంచాయతీలో 20వేలకు పైగా జనాభా ఉన్నారు. ప్రజల ఆరోగ్యం కోసం పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి సారిస్తూ.. పంచాయతీలోని ప్రతి వార్డుల్లో నిరంతరం పర్యవేక్షిస్తాం. ముఖ్యంగా మురుగుకాల్వలు శుభ్రం చేయించడం, బ్లీచింగ్ చల్లించడం, వర్షాకాలంలో దోమల నివారణకు ఫాగింగ్ చేయిం చడం తదితర కార్యక్రమాలు చేపడుతున్నాం.

-డి.రామసుబ్బారెడ్డి, పంచాయతీ కార్యదర్శి

అవార్డు రావడం సంతోషంగా ఉంది



పంచాయతీకి స్వచ్ఛ ఆంధ్ర అవార్డు రావడం చాలా సంతోషగా ఉంది. పంచాయతీ సర్పంచ్‌గా గెలిపించిన ప్రజల బాగు కోసం ప్రతి రోజూ వీధి వీధినా తిరుగుతున్నాం. ఎవరు ఏ సమస్య తెలిపినా వెంటనే పరిష్కరిస్తున్నాం

-ఎస్.వెంకటసుబ్బయ్య, సర్పంచ్, చెన్నూరు

గండికోట నుంచి మైలవరానికి 6వేల క్యూసెక్కులు విడుదల

కొండాపురం, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): గండికోట ప్రాజెక్టు నుంచి మైలవరం జలాశయానికి శుక్రవారం రాత్రి నుంచి 6,000 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నట్లు ఈఈ ఉమామహేశ్వర్లు తెలిపారు. అదేవిధంగా ప్రాజెక్టులోకి జీఎన్‌ఎస్‌ఎస్ కాలువ ద్వారా వచ్చే ఇన్‌ఫ్లో 12,000 క్యూసెక్కుల వరకు పెరిగే అవకాశం ఉన్నందున మైలవరం జలాశయానికి నీటిని విడుదల చేస్తున్నట్లు తెలిపారు. అదేవిధంగా గండికోట నుంచి సీబీఆర్‌కు 1000 క్యూసెక్కులు, తాగునీటి అవసరాల దృష్ట్యా మరో 20 క్యూసెక్కుల నీరు వదులుతున్నామని తెలిపారు. కాగా గండికోట ప్రాజెక్టులో ప్రస్తుతం పూర్తిస్థాయి నీటిమట్టం 26.85 టీఎంసీలు ఉందని ఆయన తెలిపారు.

6 నుంచి ఎస్‌జీఎఫ్ క్రీడా ఎంపికలు

కడప స్పోర్ట్స్, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): కడప డీఎస్‌ఏ మైదానంలో ఎస్‌జీఎఫ్ క్రీడా ఎంపికలు (చెస్, యోగా, బ్యాడ్మింటన్, కబడ్డీ, ఖోఖో, వాలీ బాల్, అథ్లెటిక్స్) ఈ నెల 6 నుంచి 8వ తేదీ వరకు నిర్వహిస్తున్నట్లు ఎస్‌జీఎఫ్ స్పోర్ట్స్ కడప మండల కోఆర్డినేటరు మహబూబ్‌బాషా వెల్లడించారు. తొలుత 6న ఇండోర్ స్టేడియంలో చెస్, యోగా, స్టేడియంలో బ్యాడ్మింటన్, కబడ్డీ పోటీలు జరగనున్నాయన్నారు. ఔత్సాహిక క్రీడాకారులు ఉదయం 9గంటలకు ఆయా వేదికల వద్ద రిపోర్టు చేయాల్సి ఉంటుందన్నారు. 7వ తేదీ కడప మున్సిపల్ ఉర్దూ హైస్కూలులో ఖోఖో, డీఎస్ఏ మైదానంలో వాలీబాల్ ఎంపికలు ఉంటాయన్నారు. 8న వైఎస్ఆర్ స్పోర్ట్స్ స్కూలులో అథ్లెటిక్స్ ఎంపికలు పైన తెలిపిన ఏడు క్రీడాంశాల్లో నిర్వహిస్తారన్నారు.

వెల్లాల దేవస్థానానికి రూ.లక్షా 116లు విరాళం

రాజుపాలెం, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ పుణ్యక్షేత్రమైన చెన్నకేశవ సంజీవరాయుస్వామి దేవస్థానానికి శుక్రవారం నాగినేని జయమ్మ (కర్నూలు) అనే మహిళ దేవస్థాన పునర్ నిర్మాణానికి రూ.లక్షా116లు విరాళం అందించారు. ఆమె కుటుంబ సభ్యులకు దేవస్థానం ఆధ్వర్యంలో చైర్మన్ నారాయణరెడ్డి, ఆలయ సిబ్బంది ప్రత్యేక పూజలు చేయించి సన్మానించారు.

రూ.3.25లక్షలు పలికిన దుర్గాంబ అమ్మవారి లడ్డు

బ్రహ్మంగారిమఠం, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పి.కొత్తపల్లె గ్రామంలో వెలసిన కోడూరు దుర్గాంబదేవి ఆలయ ప్రాంగణంలో దసరా మహోత్సవాల్లో భాగంగా దశమి రోజు లడ్డూ వేలం నిర్వహించగా రూ.3.25 లక్షలు పాట పాడి ఆనంవారిపల్లెకు చెందిన తిమ్మారెడ్డి రవీంద్రారెడ్డి దక్కించుకున్నారు. అలాగే జౌకుపల్లెకు చెందిన బసిరెడ్డి శివమ్మ, దుగ్గిరెడ్డి దంపతులు కలశం చెంబు రూ.2.80 లక్షలకు కైవసం చేసుకున్నారు. బసిరెడ్డి శామిణి, సిద్దారెడ్డి దంపతులు రూ.75వేలకు కుంకుమబరిణె దక్కించు కున్నారు. ఆలయ చైర్మన్ బసిరెడ్డి దుగ్గిరెడ్డి, కమిటీ పెద్దలు పాల్గొన్నారు.

జీఎస్టీ తగ్గింపుతో రైతులకు లబ్ధి

కడప కలెక్టరేట్, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): జీఎస్టీ తగ్గడంతో రైతులకు అవసరమయ్యే వ్యవసాయ పరికరాల కొనుగోలులో మరింత లబ్ధి చేకూరనుందని జిల్లా రెవెన్యూ అధికారి విశ్వేశ్వరనాయుడు, జిల్లా వ్యవసాయ అధికారి చంద్రానాయక్ తెలిపారు. శుక్రవారం కలెక్టరేట్ ప్రాంగణంలో సూపర్ జీఎస్టీ - సూపర్ సేవింగ్స్‌పై రైతులకు అవగాహన కల్పించేలా ట్రాక్టర్ల ర్యాలీని డీఆర్వో, వ్యవసాయశాఖ అధికారులు జెండా ఊపి ప్రారంభించారు. ఈ ర్యాలీ కలెక్టరేట్ నుంచి సెవెన్‌రోడ్స్, ఆర్టీసీ బస్టాండ్ వరకు సాగింది.


ర్యాలీ నిర్వహిస్తున్న వ్యవసాయశాఖ అధికారులు, సిబ్బంది

స్కూటర్ ఢీ... వృద్ధుడు మృతి

చాపాడు, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కేతవరం గ్రామంలో ఈనెల 2న గురువారం రాత్రి మోటారు సైకిల్ ఢీకొనడంతో పండిటి వరప్రసాద్ (70) అనే వృద్ధుడు మృతి చెందాడు. పోలీసుల వివరాల మేరకు.. వరప్రసాదు గ్రామం వెలుపల ఉన్న బహిర్భూమికి వెళుతుండగా వెనుకవైపు నుంచి వచ్చిన మోటారు సైకిల్ ఢీకొనడంతో తీవ్ర గాయాలయ్యాయి. చికిత్స కోసం 108 వాహనంలో ప్రొద్దుటూరు జిల్లా ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందాడు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

వేంపల్లెలో గోహింస.. పోలీసులకు ఫిర్యాదు


ఆటోకు కట్టేసి ఈడ్చుకెళ్తున్న దృశ్యం

వేంపల్లె, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): వేంపల్లె పట్టణంలో శుక్రవారం ఉదయం ఓ గోవును ఆటోకు కట్టి ఈడ్చు కెళుతూ హింసించిన వ్యక్తులపై పోలీసులకు ఫిర్యాదు చేశారు. స్థానిక జిల్లా పరిషత్ బాలుర హైస్కూల్ వద్ద పడుకొని ఉన్న గోవును మదీనాపురం ప్రాంతానికి చెందిన ముగ్గురు వ్యక్తులు తాడుతో కట్టేసి ఈడ్చుకెళ్తుండగా రిటైర్డ్ ఆర్మీ ఉద్యోగి అనిల్ అడ్డుకొని అధికారులకు, పోలీసులకు సమాచారం ఇచ్చారు. గోవును విడిపించి స్థానిక పశువైద్య సిబ్బందిని పిలిపించి చికిత్స చేయించారు. అనంతరం గోవును హింసించిన వ్యక్తులపై పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి కఠినంగా చర్య లు తీసుకోవాలని కోరారు. అలాగే స్థానిక ఈఓ నాగభూషణంరెడ్డి, స్థానిక ప్రజలు పోలీస్ స్టేషన్‌కు వెళ్లి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని కోరారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

● ముగ్గురికి గాయాలు


దేవేందర్‌రెడ్డి మృతదేహం

వీరపునాయునిపల్లె, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని ఎన్.పాలగిరి గ్రామానికి సమీపంలో శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో రామిరెడ్డి దేవేందర్‌రెడ్డి (19) అనే యువకుడు మృతి చెందగా, ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి. పోలీసుల వివరాల మేరకు.. వేంపల్లె మండలం ముత్నకూరు గ్రామానికి చెందిన దేవేందర్‌రెడ్డి, వీరకుమార్‌రెడ్డి కలిసి పల్సర్ బైకులో పెట్రోల్ కోసం వీరపునాయునిపల్లెకు వస్తుండగా పాలగిరి మార్గమధ్యలో వెనుకవైపు నుంచి వస్తున్న లారీ ఢీకొంది. దీంతో పల్సర్ బైకు అదుపుతప్పి ప్రొద్దుటూరు నుంచి స్కూటీలో నారేపల్లెకు వస్తున్న స్కూటీని ఢీకొంది. ఈ సంఘటనలో దేవేందర్‌రెడ్డి మృతి చెందగా, వీరకుమార్‌రెడ్డికి తీవ్ర గాయాలయ్యా యి. మెరుగైన చికిత్స కోసం కర్నూలు ఆసుపత్రికి రెఫర్ చేశారు. అలాగే స్కూటీలో వస్తున్న ధర్మారెడ్డి అతని చెల్లెలుకు గాయాలయ్యాయి. వీరు ప్రొద్దుటూరు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. మృతుడి తండ్రి రామగంగిరెడ్డి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

దంపతులపై దాడి.. కేసు నమోదు..

రైల్వేకోడూరు రూరల్, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): దాడి కేసులో నిందితులపై కేసు నమోదు చేసినట్లు రైల్వేకోడూరు ఎస్ఐ లక్ష్మీ ప్రసాద్‌రెడ్డి తెలిపారు. స్థానిక చిట్వేలి రోడ్డులో కూకట్ల కమలాకర్ నిర్వహిస్తున్న దుకాణం వద్దకు గురువారం రాత్రి ధర్మాపురానికి చెందిన శివ, మరికొందరు వచ్చి ఫోన్ పే చేస్తామని, నగదు ఇవ్వాలని అడిగారు. తన వద్ద ప్రస్తుతం డబ్బు లేదని, మరుసటి రోజు వస్తే ఇస్తానని కమలాకర్ చెప్పడంతో ఇరువురి మధ్య వాగ్వాదం జరిగింది. దీంతో ఆగ్రహానికి లోనైన శివ, అతని సహచరులు కమలాకర్ దంపతులపై దాడి చేశారు. దుకాణం అద్దాలు ధ్వంసం చేసి వస్తువులు చెల్లా చెదురు చేశారు. సమాచారం అందిన వెంటనే పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని, దాడి చేసిన వారిని అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

రైతు ఉత్పత్తిదారుల సంఘాలు బలోపేతం కావాలి

● సెర్ప్ అడిషనల్ సీఈవో



సమావేశంలో మాట్లాడుతున్న పీడీ రాజ్యలక్ష్మి

కడప ఎన్జీఆర్ సర్కిల్, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): రైతు ఉత్పత్తిదారుల సంఘాలు మరింత బలోపేతం కావాలని రాష్ట్ర పేదరిక నిర్మూలన సంస్థ (సెర్ప్) అదనపు సీఈవో శ్రీరాములునాయుడు అన్నారు. స్థానిక టీటీడీసీలో కడప-అన్నమయ్య జిల్లాల్లోని రైతు ఉత్పత్తిదారుల సంఘాల ప్రతినిధులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా రైతు ఉత్పత్తదారుల సంఘాలు చేపట్టిన ప్రగతిని సమీక్షించారు. అనంతరం డీఆర్‌డీఏ పీడీ డాక్టర్ రాజ్యలక్ష్మి మాట్లాడుతూ రైతు ఉత్పత్తిదారుల సంఘాల ద్వారా మరింత నాణ్యతతో కూడిన దిగుబడులు సాధించాల్సిన అవసరం ఉందన్నారు. వాటా మూల ధనం నుంచి రుణాలు అందించడంలో నగదు లావాదేవీలు చేయకూడదని సూచించారు. ఇప్పటి నుంచి నెల లోపు అన్ని చట్టబద్ధమైన లైసెన్సులు పొందాలన్నారు. పంటల వారీగా రైతులు చేపట్టిన పంటల పోషక విధానంపై శిక్షణలు నిర్వహించారని, మిగతా రైతులు కూడా దీన్ని అలవరుచుకునేలా అవగాహన తీసుకురావాలన్నారు. రైతు ఉత్పత్తి సంఘ సభ్యుల నుంచి అనుభవం ఉన్న 15 మందిని బోర్డు డైరెక్టరుగా నియమించుకోవాలని సూచించారు. ఉన్నతాధికారులతో సంభాషించగల అనుభవజ్ఞులైన చొరవ గల రైతులను గుర్తించి 15 మంది సభ్యులతో ఒక బోర్డు ఏర్పాటు చేసినట్లు చెప్పారు. కార్యక్రమంలో అన్నమయ్య జిల్లా డీఆర్‌డీఏ పీడీ నాగేశ్వర్‌రావు, రెండు జిల్లాల డీపీఎంలు, ఏపీయంలు, సీసీలు, తదితరులు హాజరయ్యారు.

పోటాపోటీగా బండలాగుడు పోటీలు


ప్రారంభిస్తున్న రితీష్‌రెడ్డి, సూర్యనారాయణరెడ్డి

అట్లూరు, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అట్లూరు క్రాస్‌రోడ్డు వద్ద అబ్బిరెడ్డి స్వామి దసరా ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం నిర్వహించిన ఎడ్ల పోటీలు పోటాపోటీగా సాగాయి. బద్వేలు నియోజకవర్గం సమన్వయకర్త రితీష్‌రెడ్డి, డీసీసీబీ బ్యాంకు చైర్మన్ మంచూరి సూర్యనారాయణరెడ్డి ఎడ్ల పోటీలను ప్రారంభించారు. పోటీల్లో 8 జతలు ఎడ్లు పాల్గొన్నాయి. ప్రథమ స్థాయిలో తెలంగాణ రాష్ట్రం సూర్యపేట జిల్లా హుజూర్‌నగర్‌కు చెందిన ఎస్.సురేందర్‌రెడ్డి ఎడ్లు ప్రథమ స్థానంలో నిలిచాయి. డీసీసీ బ్యాంకు చైర్మన్ రూ.80వేలు బహుమతి అందించారు. రెండోస్థానంలో కుర్ర వెంకటయాదవ్ ఎడ్లు నిలిచి రూ.60వేలు బహుమతి అందుకున్నారు. మూడో స్థానంలో అనంతపురం జిల్లాకు చెందిన కె.రామాంజనేయులు ఎడ్లు నిలిచాయి. అలాగే మూడు, నాలుగు స్థానాల్లో నిలిచిన ఎడ్లకు ఆలయ కమిటీ నిర్వాహకులు రెడ్డప్పరెడ్డి ఆధ్వర్యంలో బహుమతులు అందించారు. కార్యక్రమంలో ఆరవ శ్రీనివాసులురెడ్డి, దశరథ రామరెడ్డి, మట్టి ఈశ్వర్‌రెడ్డి, పి.నరసింహులు పాల్గొన్నారు.

అభివృద్ధి, సంక్షేమం కూటమి ప్రభుత్వ ధ్యేయం

కలసపాడు, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): అభివృద్ధి ప్రజాసంక్షేమమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం ముందుకు సాగుతోందని బద్వేలు టీడీపీ ఇన్‌చార్జి రితేష్‌కుమార్‌రెడ్డి పేర్కొన్నారు. మండలంలోని సిద్ధమూర్తిపల్లె నుంచి వెంకటాపురం రోడ్డు పనులను ప్రారంభించారు. అనంతరం సింగరాయపల్లెలో వాటర్ ప్లాంట్, గ్రంథాలయం పనులకు శంకుస్థాపన చేశారు. అనంతరం తడుకువాగు లిఫ్ట్ ఇరిగేషన్‌ను రైతులతో కలిసి పరిశీలించారు. టీడీపీ నేతలు రంతు, పట్టాభిరెడ్డి, రంగారెడ్డి, మన్యం మల్లికార్జునరెడ్డి, దాదన భూపాల్‌రెడ్డి, స్వామి రంగారెడ్డి పాల్గొన్నారు.

7న జడ్పీ స్టాండింగ్ కమిటీ సమావేశం

కడప రూరల్, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లా జడ్పీ స్థాయి సంఘ సమావేశాన్ని 7న నిర్వహిస్తున్నా మని జడ్పీ సీఈవో సి.ఓబులమ్మ తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి సమావేశం నిర్వహిస్తామన్నారు. జడ్పీటీసీ సభ్యులు, సంబంధిత శాఖల జిల్లా అధికారులు తప్పక హాజరు కావాలని కోరారు.

టెంకాయల విక్రయహక్కు వేలం వాయిదా

చక్రాయపేట, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): గండిక్షేత్రంలో టెంకాయల విక్రయహక్కు కల్పించేందుకు ఏర్పాటు చేసిన వేలం వాయిదా వేసినట్లు ఆలయ సహాయ కమిషనర్ వెంకటసుబ్బయ్య తెలిపారు. గండి కార్యాలయంలో ఏర్పాటు చేసిన వేలంలో ఇద్దరు పాటదారులు ఒక్కొక్కరు రూ.10లక్షల ధరావత్తు చెల్లించినప్పటికీ పాట పాడేందుకు ఆసక్తి చూపకపోవడంతో వాయిదా వేసినట్లు తెలిపారు. జిల్లా దేవదాయశాఖ తనిఖీదారులు శివయ్య, దేవ స్థానం మాజీ చైర్మన్ వెంకటస్వామి, ప్రధాన అర్చకులు, పోలీసులు, సిబ్బంది పాల్గొన్నారు.

రేపు పారా స్విమ్మింగ్ పోటీలు

లక్కిరెడ్డిపల్లె, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): జిల్లా స్థాయి పారా స్విమ్మింగ్ పోటీలు ఈ నెల 5న నిర్వహిస్తున్నట్లు జిల్లా పారా స్పోర్ట్స్ ప్రెసిడెంట్ చంద్రశేఖర్ తెలిపారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఈ నెల 4న ఉమ్మడి కడప మున్సిపల్ మైదానంలో పేర్లు రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు. జిల్లా స్థాయిలో గెలుపొందిన వారు ఈ నెల 7న ఏలూరులో నిర్వహించనున్న రాష్ట్ర స్థాయి పారా స్విమ్మింగ్ చాంపియన్ షిప్‌లో పాల్గొంటారని ఆయన తెలియజేశారు. ఆసక్తి ఉన్న దివ్యాంగులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.

చెన్నకేశవస్వామికి వెండి పాదాలు సమర్పణ


స్వామికి వెండిపాదాలు తీసుకువెళ్తున్న దృశ్యం

కలసపాడు, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): కలసపాడులోని గోదాదేవి సమేత లక్ష్మీ చెన్నకేశవస్వామి దేవస్థానంలో రూ.50వేలు విలువలైన వెండిపాదాలను టీడీపీ యువనేత బుసికె శ్రావణ్‌కుమార్‌రెడ్డి సమర్పించారు. దసరా సంద ర్భంగా చెన్నకేశవస్వామికి కుటుంబ సమేతంగా ఈ వెండిపాదాలను సమర్పించారు.

శిక్షణ పూర్తి చేస్తేనే ఉద్యోగం

● పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ విజయరామరాజు

కడప ఎడ్యుకేషన్, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): మెగా డీఎస్సీ ద్వారా ఇటీవల ఎంపికైన కొత్త టీచర్లకు శిక్షణ తప్పనిసరి. శిక్షణ పూర్తి చేసిన తర్వాతే వారికి నియామకపు ఉత్తర్వులు జారీ చేస్తామని ఇటీవల జిల్లా విద్యాశాఖ అధికారులతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ విజయరామరాజు స్పష్టం చేశారు. వీరికి శుక్రవారం శిక్షణ ప్రారంభమైంది. 10వ తేదీ వరకు ఈ శిక్షణ ఉంటుంది. ఏదైనా కారణంతో శిక్షణకు మినహాయింపు కోరితే అనుమతిస్తారు. అయితే వారి కోసం తర్వాత మళ్లీ శిక్షణ కల్పిస్తారు. ఉపాధ్యాయ పోస్టులు ఖాళీగా ఉన్న పాఠశాలల్లో కొత్తవారిని నియమిస్తారు. ఈ ఏడాది జూన్‌లో జరిగిన బదిలీల్లో భాగంగా ఏదైనా పాఠశాలలకు చెందిన ఉపాధ్యాయులంతా బదిలీలు కోరి ఇంకా రిలీవర్ రాని కారణంగా అక్కడే పనిచేస్తుంటే.. అలాంటి చోట కొత్తవారికి మొదట ప్రాధాన్యత కల్పిస్తారు. కేటగిరీ 3, 4 ప్రాంతాల్లోనే ప్రాధాన్యత క్రమంలో నియమించాలని నిర్ణయించారు. సెప్టెంబరు 30 నాటికి ఖాళీలను పరిగణనలోకి తీసుకుని ఆన్‌లైన్‌లో ఖాళీల వివరాలను అప్‌లోడ్ చేయాలని విద్యాశాఖ అధికారులను ఆదేశించారు. కాగా.. జిల్లాలో ఎంపికైన 680 మంది నూతన ఉపాధ్యాయులకు శిక్షణ మొదలైంది. వీరిలో ఎస్టీటీ తెలుగు, ఉర్దూ విభాగాలకు కడపనగర శివారులోని గ్లోబల్ ఇంజనీరింగ్ కళాశాలలో శిక్షణ ఇస్తున్నారు. అలాగే స్కూల్ అసిస్టెంట్, ఫిజికల్ ఎడ్యుకేషన్‌కు సంబంధించి అన్నమయ్య జిల్లా మదనపల్లె పట్టణం పుంగనూరు రోడ్డులో ఉన్న గ్రీన్ వ్యాలీ ఇంటర్నేషనల్ స్కూల్లో శిక్షణ ప్రారంభించారు. శిక్షణ సమయంలోనే వారికి కౌన్సెలింగ్ నిర్వహించి పోస్టులు ఇస్తారు. ఈనెల 13 నుంచి కొత్త టీచర్లు విధులకు హాజరుకానున్నారు.

మరోవైపు మెగా డీఎస్సీ తుది జాబితాపై ఏమైనా అభ్యంతరాలుంటే అభ్యర్థులు అక్టోబరు 25 వరకు తెలుపవచ్చని డీఎస్సీ కన్వీనర్ ఎంవీ కృష్ణారెడ్డి తెలిపారు. ఇందుకోసం జిల్లా స్థాయి పోస్టులకు ఆర్జేడీ, ఇద్దరు డీఈఓలతో జోనల్ కమిటీ, రాష్ట్ర స్థాయి పోస్టులకు ముగ్గురు రాష్ట్రస్థాయి అధికారులతో కమిటీ లను నియమించినట్లు పేర్కొన్నారు. ఈ కమిటీలు 15 రోజుల్లో ఫిర్యాదులను పరిష్కరిస్తాయన్నారు. అభ్యర్థులు జోనల్ స్థాయి కమిటీ నిర్ణయంపై సంతృప్తి చెందకపోతే రాష్ట్రస్థాయి కమిటీకి అప్పీల్‌చేసుకోవచ్చని, రాష్ట్రస్థాయి కమిటీ నిర్ణయంపైన సంతృప్తి చెందక పోతే తుది అప్పిలేట్ అథారిటీ (పాఠశాల విద్య డైరెక్టర్)కు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. తుది అప్పిలేట్ అథారిటీ ఈ ఫిర్యా దులను 30 రోజుల్లో పరిష్కరిస్తుందని డీఎస్సీ కన్వీనర్ వివరించారు.

వరిలో అగ్గి తెగులు, సుడిదోమ నివారణకు సూచనలు

సుండుపల్లె, అక్టోబరు3(ఆంధ్రజ్యోతి): అగ్గి తెగులు, సుడిదోమ కారణంగా వరి రైతులు నష్టపోయే ప్రమాదం ఉందని జిల్లా వనరుల కేంద్రం వ్యవసాయశాఖ అధికారి రామకృష్ణంరాజు, శాస్త్రవేత్త డాక్టర్ పీరుసాహెబ్ తెలిపారు. శుక్రవారం మండ లంలోని తిమ్మసముద్రంలో వరిపైరును వారు పరిశీలించారు. అగ్గి తెగులు, సుడిదోమ ఉధృతిని తగ్గించేందుకు పురుగుల మందులను పిచికారీ చేయాలని సూచించారు. ఫైసీన్ఎస్ఎల్, ట్రైఫ్లోమిజో ఫైరామ్ మందులను వాడాలని సూచించారు. ఇ లాంటి పరిస్థితుల్లో యూరియా వినియోగించ రాదన్నారు. మండల వ్యవసాయశాఖ అధికారి మహబూబ్‌బాషా, ఆర్ఎస్‌కే సిబ్బంది, ఏపీసీఎన్ఎఫ్ సిబ్బంది పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి తీవ్రగాయాలు

సుండుపల్లె, అక్టోబరు3(ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో చెంద్రాజుగారిపల్లెకు చెందిన సుధాకర్ (55) తీవ్రగాయాలైనట్లు స్థానికులు తెలిపారు. శుక్రవారం మడితాడు సమీపంలో రాయవరం ప్రధాన రహదారిపైన వస్తున్న ఆర్టీసీ బస్సు ద్విచక్రవాహనాన్ని ఢీకొంది. గాయాలపాలైన వ్యక్తిని ఆసుపత్రికి తరలించారు. ఈ విషయంపై పోలీసులను సంప్రదించగా ఎటువంటి ఫిర్యాదు అందలేదని తెలిపారు.

సబ్సిడీపై గడ్డి విత్తనాలు

పెనగలూరు, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని రైతులకు 75 శాతం సబ్సిడీతో గడ్డి విత్తనాలు పంపిణీ చేస్తున్నట్లు కాకర్లవారిపల్లె వెటర్నరీ డాక్టర్ ఎం.సురేష్ తెలిపారు. 460 రూపాయలు విలువ చేసే 5 కిలోల ప్యాకెట్‌కు 75 శాతం సబ్సిడీ పోను 115 రూపాయలు చెల్లించాల్సి ఉంటుందన్నారు. ఈ అవకాశాన్ని పాడిరైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

దుర్గమ్మ ఆలయ నిర్మాణానికి రూ.5 లక్షలు విరాళం



దుర్గమ్మ గుడి నిర్మాణానికి రూ.5 లక్షల విరాళం ప్రకటిస్తున్న తలమంచి గిరీష్‌రెడ్డి

పెనగలూరు, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలోని వినాయకనగర్‌లో నిర్మించనున్న దుర్గమ్మ దేవాలయ నిర్మాణానికి తలమంచి గిరీష్‌రెడ్డి చారిటబుల్ ట్రస్టు ఛైర్మన్ రూ.5,00116 విరాళాన్ని ప్రకటించినట్లు పి.కొత్తపల్లె గ్రామ ప్రజలు పి.యానాదయ్యానాయుడు, ఆకుల చిన్నా తెలిపారు. వినాయకనగర్‌లో సిమెంటు రోడ్లు, డ్రైనేజీలను కుడా ముక్కా రూపానందరెడ్డి, ఎమ్మెల్యే అరవ శ్రీధర్ సహకారంతో నిర్మిస్తామని పెనగలూరు మాజీ సర్పంచ్ బీఎల్ నరసింహారెడ్డి తెలిపారు. ఈ కార్యక్ర మంలో గ్రామ పెద్దలు తలమంచి సుబ్బారెడ్డి, టి.దినేష్ రెడ్డి, నవీన్, పి.యానాదయ్య నాయుడు, ఏ చిన్నా, పెంచలయ్య, మెకానిక్ శివ, పాలకొండయ్య, రాజా పాల్గొన్నారు.

కోల్డ్‌స్టోరేజి ప్లాంటు ప్రారంభం



కోల్డ్‌స్టోరేజి ప్లాంటును ప్రారంభిస్తున్న సీఐ బాబు

ఒంటిమిట్ట, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలో ఓబినేని గురవయ్య ఏర్పాటు చేసిన రైపెనింగ్ చాంబర్, కోల్డ్‌స్టోరేజి కేంద్రాన్ని గురువారం సీఐ బాబు ప్రారంభిం చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఒంటిమిట్టలో నాణ్యమైన అరటికాయలు ప్రజలకు అందించేందుకు కోల్డ్‌స్టోరేజి కేంద్రం ఉపయోగపడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర టీడీపీ మహిళా కార్యనిర్వాహక కార్యదర్శి ఓబినేని సుబ్బమ్మ, టీడీపీ సీనియర్ నాయకుడు ఎస్వీ రమణ, కొమరా వెంకటనరసయ్య, మామిళ్ల ఈశ్వరయ్య, పాముూరు సుబ్రమణ్యం, వెంకట రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గోకులం షెడ్లు నాణ్యతతో నిర్మించుకోవాలి

● మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి



గోకులం షెడ్డు నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న మంత్రి

రాయచోటి(నేతాజీ సర్కిల్), అక్టోబరు3(ఆంధ్రజ్యోతి): పాడి రైతులు గోకులం షెడ్లను నాణ్యతగా నిర్మించుకోవాలని రాష్ట్ర రవాణా, యువజన, క్రీడాశాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి తెలియజేశారు. మండలంలోని ముదినేనివాండ్లపల్లె వద్ద గురువారం గోకులం షెడ్ నిర్మాణం పనులకు డ్వామా పీడీ వెంకటరత్నంతో కలిసి భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నారాయణరెడ్డిపల్లెలో పంచాయతీరాజ్‌శాఖ ఆధ్వర్యంలో ఉపాధి హామీ కింద పాలెంవాండ్లపల్లె నుండి కొత్తవడ్డెపల్లె వరకు రూ. 47.5 లక్షలతో నిర్మించిన తారు రోడ్డును ఆయన సోదరుడు లక్ష్మీప్రసాద్‌రెడ్డి, స్థానిక టీడీపీ నాయకుడు సహదేవరెడ్డి, గ్రామస్తులతో కలిసి ప్రారంభించారు. కొండావాండ్లపల్లెలో చౌడేశ్వరికి పూజలు నిర్వహించారు. ఎంపీడీవో రామచంద్ర, ఏపీడీ మధుబాబు, రాష్ట్ర పాల ఏకరి కార్పొరేషన్ ఛైర్మన్ నాగేశ్వర్‌నాయుడు, మాజీ సర్పంచ్ శశిధర్‌రెడ్డి, సంబేపల్లె పీఏసీఎస్ అధ్యక్షుడు శివప్రసాద్‌రెడ్డి, ఎంపీటీసీ సభ్యుడు పొత్తూరి రవీందర్‌నాయుడు, ఉలవల రాజేంద్ర, మాధం బసిరెడ్డి, నూరెకరాల రంగారెడ్డి, ఖాదర్‌బాషా తదితరులు పాల్గొన్నారు.

రాయచోటిటౌన్: పట్టణంలోని భద్రకాళీ సమేత వీరభద్రాలయంలో విజయదశమి పండుగ సందర్భంగా రాష్ట్ర రవాణా, యువజన, క్రీడాశాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి హరితమ్మ దంపతులు కుటుంబ సభ్యులతో కలిసి పట్టువస్త్రాలను సమర్పించారు.

30 ఏళ్ల కల.. కూటమి ప్రభుత్వంలో సాకారం

●ఎమ్మెల్యే అరవ శ్రీధర్, కుడా ఛైర్మన్ ముక్కా



రక్షణ గోడ పనులకు భూమి పూజ చేస్తున్న ఎమ్మెల్యే అరవ శ్రీధర్, కుడా ఛైర్మన్ రూపానందరెడ్డి

రైల్వేకోడూరు, అక్టోబరు 3(ఆంధ్రజ్యోతి): 30 ఏళ్ల నాటి కల కూటమి ప్రభుత్వంతో సాకారం అయిందని రైల్వేకోడూరు ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ అరవ శ్రీధర్, కుడా ఛైర్మన్ ముక్కా రూపానందరెడ్డిలు తెలిపారు. గురు వారం కాంట్రాక్టర్ పాటూరు శ్రీనివాసులురెడ్డి ఆధ్వర్యంలో గుంజననది వద్ద రక్షణ గోడ పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు రక్షణగోడ పనులకు రూ. 32.70 కోట్ల నిధులు మంజూరు చేయించామని తెలిపారు. ఈ కార్యక్రమంలో టీడీపీ సాంస్కృతిక విభాగం రాష్ట్ర అధ్యక్షుడు పంతగాని నరసింహప్రసాద్, జన సేన రాష్ట్ర కార్యదర్శి తాతంశెట్టి నాగేంద్ర, జనసేన రాయలసీమ జోనల్ ప్రతినిధులు పగడాల వెంకటేష్, మైసూరివారిపల్లె మహిళా సర్పంచ్ కారుమంచి సంయుక్త తదితరులు పాల్గొన్నారు.

డబుల్ రోడ్డు పనులకు శ్రీకారం

రైల్వేకోడూరు-చిట్వేలి డబుల్ రోడ్డు పనులకు శుక్రవారం ఎమ్మెల్యే టీడీపీ ఇన్‌ఛార్జ్, కుడా ఛైర్మన్ భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైల్వేకోడూరు-చిట్వేలి మార్గంలో రూ. 40 కోట్లతో కల్వర్టులు, సిమెంట్, తారు రోడ్లు వేస్తున్నామని తెలిపారు. మిగిలిన తారు రోడ్డు పనులు పూర్తి చేయడానికి తగిన చర్యలు తీసుకున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు, కాంట్రాక్టర్ పాటూరి శ్రీనివాసులురెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మహాత్మా గాంధీకి నివాళి

పట్టణంలోనిగాంధీ విగ్రహానికి ఎమ్మెల్యే, , టీడీపీ ఇన్‌చార్జి పూలమాలలు వేసి ఘనంగా నివాళి అర్పించారు.

జీఎస్టీ అవగాహన ర్యాలీ

మండల పరిషత్ కార్యాలయాల ఆవరణలో జీఎస్టీ అవగాహనకు నిర్వహించిన ట్రాక్టర్ ర్యాలీలో వారు మాట్లాడుతూ రైతు సంక్షేమమే ధ్యేయంగా కూటమి ప్రభుత్వాలు పని చేస్తున్నాయని తెలిపారు. టీడీపీ యువ నాయకుడు ముక్కా సాయివికాస్‌రెడ్డి, జనసేన రాష్ట్ర కార్యదర్శి తాతంశెట్టి నాగేంద్ర, టీడీపీ యువ నాయకులు పోతురాజు నవీన్, నార్జాల హేమరాజ్ తదితరులు పాల్గొన్నారు.

జీఎస్టీ తగ్గింపుతో వ్యవసాయ రంగానికి చేయూత



లక్కిరెడ్డిపల్లె: ర్యాలీ నిర్వహిస్తున్న అధికారులు నాయకులు

సుండుపల్లె, అక్టోబరు3(ఆంధ్రజ్యోతి): జీఎస్టీ తగ్గింపుతో కూటమి ప్రభుత్వం వ్యవసాయ రంగానికి చేయూతనిస్తోందని మండల వ్యవసాయశాఖ అధికారి మహబూబ్‌బాషా తెలిపారు. శుక్రవారం మండల కేంద్రానికి సమీపంలోని ఈడిగపల్లి రైతు సేవా కేంద్రం నుంచి సుండుపల్లె సర్కిల్ వరకు ట్రాక్టర్లతో ర్యాలీ నిర్వహించారు. వ్యవసాయ అనుబంధ రంగాలకు ఉపయోగించే వస్తువులు, పనిముట్లతో పాటు 12 రకాల బయోపెస్టిసైడ్స్, డ్రిప్ ఇరిగేషన్, స్ప్రింక్లర్లు, అక్వా కల్చర్ పరికరాలు, డ్రోన్లు, పాల క్యాన్లు, వ్యవసాయ యంత్రాలు, ట్రాక్టర్లు, టైర్లు మొదలగు వాటిపైన జీఎస్టీ తగ్గించినట్లు వివరించారు. జీఎస్టీ అమలుపై ప్రజలకు, రైతులకు అవగాహన కల్పించేందుకు ర్యాలీ నిర్వహించామన్నారు. తహసీల్దార్ మహబూబ్‌చాంద్, ఎంపీడీవో సుధాకర్‌రెడ్డి, టీడీపీ, జనసేన నాయకులు పాల్గొన్నారు.

లక్కిరెడ్డిపల్లె: మండల కేంద్రంలో వ్యవసాయ సహాయ సంచాలకుడు జయరామిరెడ్డి, ఎంపీడీవో రెడ్డెయ్య ఆధ్వర్యంలో ఎంపీడీవో అన్నిశాఖల అధికారులతో ర్యాలీ నిర్వహించారు. ఈవోపీఆర్‌డీ ఉషారాణి, ఎంఈవో చక్రేనాయక్, ఏపీఎం నిరంజన్, ఏవో రాజకుమారి

చిన్నమండెం: వండాడి గ్రామంలో వ్యవసాయ పనిముట్లపై జీఎస్టీ తగ్గింపుపై, ఏపీఎంఐపీ పీడీ, వ్యవసాయ అధికారి, ఉద్యాన శాఖ అధికారి అధ్యక్ష తన ట్రాక్టర్ ర్యాలీ నిర్వహిం చారు.

రామాపురం : లక్కిరెడ్డిపల్లె మార్కెట్ కమిటీ మాజీ ఛైర్మన్ మద్దిరేవుల రమేశ్‌రెడ్డి ఆధ్వర్యంలో మండల కేంద్రంలో ర్యాలీ నిర్వహించారు.

ఓబులవారిపల్లె : చిన్నఓరంపాడు గ్రామ పంచాయతిలో జరిగిన ర్యాలీకి ఇన్‌చార్జి ముక్కా రూపానందరెడ్డి హాజరయ్యారు. చావిడి నుంచి క్రాస్‌రోడ్డు వరకు ర్యాలీగా వెళ్లి జీఎస్టీతో ఉపయోగాలను వివరించారు.

కౌన్సిలర్ రాఘవేంద్రరాజు బీజేపీలో చేరిక



బీజేపీలో చేరుతున్న రాఘవేంద్రరాజు, శివమణిరెడ్డి

రాజంపేట టౌన్, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి) : రాజంపేట మున్సిపల్ కౌన్సిలర్ రేనాటి రాఘవేంద్ర రాజు, సినీ దర్శకుడుగాడి శివమణిరెడ్డి గురువారం అమరావతిలోని బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యా లయంలో పార్టీ అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ సమక్షంలో బీజేపీ కండువా వేసుకున్నారు. ఈ సంద ర్భంగా వారు మాట్లాడుతూ బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నాగోతు రమేష్‌నాయుడు, పార్లమెంట్ అధ్యక్షులు సాయి లోకేశ్ ఆహ్వానం మేరకు బీజేపీలో చేరినట్లు తెలిపారు. ఈ సందర్భంగా రాష్ట్ర అధ్య క్షుడు మాధవ్ మాట్లాడుతూ బీజేపీ యువతకు పెద్దపీట వేస్తుందని, యువత పార్టీ బలోపేతానికి కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్సీ మోర్చా, రాష్ట్ర అధ్యక్షుడు సురేష్, గుంటూరు జడ్పీ ఛైర్మన్ పాటూరు నాగభూషణం పాల్గొన్నారు.

శ్రీకాళహస్తి దేవస్థానం అభివృద్ధే లక్ష్యం

రైల్వేకోడూరు, అక్టోబరు 3(ఆంధ్రజ్యోతి): తిరుపతి జిల్లా శ్రీ కాళహస్తి దేవస్థానం అభివృద్ధే తన లక్ష్యమని ఆలయ ఛైర్మన్ కొట్టే సాయి తెలిపారు. శుక్రవారం రైల్వేకోడూరు నియోజకవర్గంలో పలు కార్యక్రమాలకు ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా కూటమి యువ నాయకుడు పోతురాజు నవీన్ నివాసంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశం లో ఆయన మాట్లాడుతూ తనకు ఈ పదవి రావడం పూర్వజన్మసుకృతం అని తెలిపారు. రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కొణిదెల పవన్‌కళ్యాణ్ తనపై ఎంతో నమ్మకంతో ఈ పదవిని కట్టబెట్టారని తెలిపారు. శ్రీకాళహస్తి నియోజకవర్గంలో కూటమి నాయకులు, కార్యకర్తల మేలు మరిచిపోలేనని తెలిపారు. శ్రీకాళహస్తి ఆలయ అభివృద్ధితో పాటు ఆలయ ప్రాచుర్యాన్ని భక్తులకు చేరే విధంగా చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ కాళహస్తి ఆలయ అభివృద్ధికి అందరి సహకారం తీసుకుంటామని తెలిపారు. తన ప్రమాణస్వీకారానికి తేదీ ఖరారు కాలేదన్నారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు పోతురాజు సుమన్, నార్జాల హేమరాజ్ తదితరులు పాల్గొన్నారు.

ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేయాలి : హౌసింగ్ పీడీ



నిర్మాణాలను పరిశీలిస్తున్న హౌసింగ్ పీడీ రమేశ్‌రెడ్డి

సుండుపల్లె, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): ఇంటి నిర్మాణాలు, డిసెంబరు ఆఖరుకు పూర్తి చేయకపోతే బిల్లులు మంజూరు కావని హౌసింగ్ పీడీ రమేశ్ రెడ్డి తెలిపారు. శుక్రవారం సుండుపల్లె సమీపంలోని జగనన్న కాలనీని ఆయన పరిశీలించారు. ప్రభుత్వం నుంచి అందాల్సిన స్టీల్ సిమెంటు, నగదు సకాలంలో జమ అందజేస్తామని తెలియజేశారు. ప్రభుత్వం ఇచ్చిన గడువు నాటికి నిర్మాణాలు పూర్తి చేయాలని ఆదేశించారు. అనంతరం సుండుపల్లె ఎంపీడీవో కార్యాలయంలో ఇంజనీరింగ్ అసిస్టెంట్లతో సమావేశం నిర్వహించారు. లబ్ధిదారులకు అవగాహన కల్పించి సత్వరం నిర్మాణాలు పూర్తయ్యేలా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ మురళీకృష్ణ, హౌసింగ్ ఏఈ రెడ్డి, ఇంజనీరింగ్ అసిస్టెంట్ చంద్ర శేఖర్‌నాయక్, సిబ్బంది పాల్గొన్నారు.

దివ్యాంగుడికి చేయూత



దివ్యాంగుడికి పింఛను అందిస్తున్న సుబ్రమణ్యం

ఓబులవారిపల్లె, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి) : ఎన్టీఆర్ భరోసా పెన్షన్ అందని దివ్యాంగుడికి పెన్షన్ సొమ్మును అందించి ఆదుకున్నారు మండల పరిధిలోని జీవనజ్యోతి ఆనంద నిలయం ఆశ్రమ వ్యవస్థాపక ఛైర్మన్ పాణ్యం సుబ్రమణ్యం. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలం కేకే వడ్డిపల్లెకు చెందిన మల్లిక కార్తిక్ అనే వ్యక్తి ప్రమాదంలో రెండు చేతులు కోల్పోవడంతో అతని కుటుంబం తీవ్ర ఇబ్బందులు పడుతోందని కొందరు తెలుపగా బాధితులను విచారించామన్నారు. ప్రభుత్వం నుంచి పెన్షన్ వచ్చే వరకు ఆశ్రమం ద్వారా పెన్షన్ అందిస్తామని హామీ ఇస్తూ, గ్రామ పెద్దల సమక్షంలో పెన్షన్ మొత్తం అందజేశారు. దేవుడు తనకు ఇచ్చిన దాంట్లో కొంతమేర సామాజిక సేవకు వెచ్చిస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆశ్రమ మేనేజర్ రఘురామయ్య, విద్యాకమిటీ ఛైర్మన్ లోకేష్, గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో పారువేట ఉత్సవం



రాజంపేట: పారువేట ఉత్సవంలో కన్యకాపరమేశ్వరి

రాజంపేట టౌన్, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి) : శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా గురువారం పట్టణంలో కన్యకాపరమేశ్వరిని రాజరాజే శ్వరిగా అలంకరించి పారువేట, శమీ దర్శనం ఉత్సవం నిర్వహించారు. అమ్మవారి ఆయుధాలు ధరించి వారిని జమ్మిచెట్టు వరకు గ్రామోత్సవం నిర్వహించారు. చౌడేశ్వరికి గ్రామోత్సవం నిర్వహించారు. శుక్రవారం కన్యకాపరమేశ్వరికి ఊంజలసేవ, వసంతోత్సవాలు నిర్వహించారు.

నందలూరు: నాగిరెడ్డి పల్లె వాసవి కన్యకా పరమేశ్వరి దేవాలయంలో శుక్రవారం రాత్రి ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు యంబలూరు నరసింహస్వామి ఆధ్వర్యంలో ఊంజల్ సేవ నిర్వహించారు.

రైల్వేకోడూరు: పట్టణంలో కన్యకాపరమేశ్వరి వాసవాంబగా దర్శనమిచ్చారు.

ఒంటిమిట్ట: అమ్మవారు డోలాధిరోహణ అలంకారంలో దర్శన మిచ్చారు.

పారిశుధ్య కార్మికులను కొనసాగించాలి



నిరసన వ్యక్తం చేస్తున్న కార్మికులు

రాయచోటి కలెక్టరేట్, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని మదనపల్లి ప్రభుత్వ మెడికల్ కళాశాలలో 20 ఏళ్లుగా సేవలందిస్తున్న పారిశుధ్య కార్మికులకు 50 ఏళ్లు పూర్తయిందనే సాకుతో ఇంటికి పంపే నిబంధనలు తక్షణమే తొలగించి వారిని కొనసాగించాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి సాంబశివ డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం జిల్లా కలెక్టర్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మదనపల్లి ప్రభుత్వ ఆసుపత్రిలో 20 ఏళ్లుగా అతి తక్కువ వేతనంతో పనిచేసిన పారిశుధ్య కార్మికులకు వేతనాలు పెంచి ఉద్యోగాలు పర్మినెంట్ చేయాల్సింది పోయి 50 ఏళ్లు పూర్తయ్యాయనే సాకుతో తొలగించడం అన్యాయమన్నారు. ఈ కార్యక్రమంలో పారిశుధ్య కార్మికులు లక్ష్మీపార్వతి, అలివేలు, కృష్ణవేని, చోటీమ, లలిత, రాజేశ్వరి పాల్గొన్నారు.

ప్రజల భాగస్వామ్యంతోనే మలేరియా నియంత్రణ



మలేరియాపై అవగాహన కల్పిస్తున్న జయరామయ్య

లక్కిరెడ్డిపల్లె, అక్టోబరు3 (ఆంధ్రజ్యోతి): సమాజ భాగస్వామ్యంతోనే మలేరియా నియంత్రణ సాధ్యమని మలేరియా సబ్‌యూనిట్ ఆఫీసర్ జయ రామయ్య తెలిపారు. శుక్రవారం పందిళ్లపల్లిలో ఆయన మాట్లాడుతూ ప్రతి శుక్రవారం డ్రైడేగా పాటించాలన్నారు. జ్వరం వచ్చిన వెంటనే ఆసుపత్రులకు వెళ్లి చికిత్సలు చేయించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ రిజ్వాన్‌బేగ్, సీహెచ్‌వో రవీంద్ర, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ ఓబులేశ్, ఆరోగ్య కార్యకర్తలు సుభాషిణి, శైలజ, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

అసర్ల గంగమ్మ పంచలోహ విగ్రహం అందజేత

గాలివీడు, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని కుషావతి నదీతీరంలో ఉన్న అసర్ల గంగమ్మ ఆలయానికి గురువారం దసరా సందర్భంగా నడింపల్లికి చెందిన కొంగ లక్ష్మీనారాయణ కుటుంబ సభ్యులు నరేంద్ర, వెంకటేశ్వర్లు, రాజశేఖర్ రూ.46 వేలు విలువ జేసే 2 అడుగుల ఎత్తున్న అసర్ల గంగమ్మ పంచలోహ విగ్రహాన్ని అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అసర్ల గంగమ్మ చుట్టుప్రక్కల గ్రామాల ప్రజలకు కొంగు బంగారంగా విరాజిల్లుతోందన్నారు.

'ఓట్ చోర్.. గద్దె చోడ్'పై సంతకాల సేకరణ




సంతకాలు సేకరిస్తున్న కాంగ్రెస్ నేతలు

రాయచోటిటౌన్, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పార్టీ జాతీయ నాయకులు రాహుల్ గాంధీ చేపట్టిన గడప గడపకు ఓట్ చోర్ గద్దె చోడ్ కార్యక్రమం ద్వారా సంతకాలు సేకరి స్తున్నట్లు కాంగ్రెస్ పార్టీ అన్నమయ్య జిల్లా అధ్యక్షుడు గాజుల భాస్కర్ తెలిపారు. శుక్రవారం పట్టణంలోని రాయుడుకాలనీలో రాయచోటి పట్టణ అధ్యక్షుడు షేక్. బాబాసర్దార్ సంతకాల సేకరణ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆ యన మాట్లాడుతూ ఈ కార్యక్రమానికి పెద్ద ఎత్తున ఆదరణ లభించింద న్నారు. పదేళ్లుగా భారతీయ జనతా పార్టీ ప్రభుత్వం ప్రజల ప్రాథమిక హక్కైన ఓటును దొంగలించి దొడ్డిదారిన అధికారంలోకి వచ్చిందన్నారు. బీజేపీ దేశవ్యాప్తంగా పెద్ద ఎత్తున ఓటర్ల జాబితాను తమకు అనుకూలంగా మార్చుకుందని ధ్వజమెత్తారు. ఈ ఓటు చోరీని ప్రశ్నించాల్సిన అవసరం ఉందన్నారు. ఈ కార్యక్రమానికి డీసీసీ చీఫ్ సెక్రటరీ అమీర్‌బాషా, డీసీసీ అధికార ప్రతినిధి మన్సూర్‌అలీఖాన్, ఉపాధ్యక్షుడు దర్బార్‌బాషా, ఉపాధ్యక్షుడు చెన్నకృష్ణ, మహిళా అధ్యక్షురాలు సృజనారెడ్డి, లక్కిరెడ్డిపల్లె మండల అధ్యక్షుడు నాగార్జున, సుండుపల్లె అధ్యక్షుడు సల్మాన్, చిన్నమండెం మండల అధ్యక్షుడు షబ్బీర్, షేక్. మహబూబ్‌అలీ, రెహానా, రెడ్డెమ్మ, లక్ష్మీదేవి తదితరులు పాల్గొన్నారు.

కాంట్రాక్ట్ కార్మికుల ఉద్యోగాలు రెగ్యులర్ చేయాలి

రాయచోటిటౌన్, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ కాం ట్రాక్ట్ కార్మికుల ఉద్యోగాలను సంస్థలో విలీనం చేసి, రెగ్యు లర్ చేయడంతో పాటు ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలను వెంటనే పరిష్కరించా లన్న డిమాండ్‌తో ఈ నెల 5న ఆదివారం విజయవాడలో నిర్వహించనున్న రౌండ్ టేబుల్ సమావేశాన్ని జయప్రదం చేయాలని ఏపీ విద్యుత్ ట్రేడ్ యూనియన్ పోరాట కమిటీ నేతలు శుక్రవారం ఒక ప్రకటనలో పిలుపు నిచ్చారు. 27 వేల మందికి పైగా కార్మికుల ఉద్యోగాలను రెగ్యులర్ చేయకపోవడంతో పాటు, రెగ్యులర్ ఉద్యోగికి ఇచ్చే జీతంలో 5వ వంతు ఇస్తూ వారి శ్రమను, హక్కులను దోచుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయంపై దశాబ్దాలుగా పోరాడుతున్నా విద్యుత్ యాజమాన్యం గానీ, ప్రభుత్వం గానీ పట్టించుకోవడం లేదన్నారు. కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీ ప్రకారం కాంట్రాక్ట్ కార్మికులను సంస్థలో విలీనం చేసి రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేస్తున్నామన్నారు. ఉద్యోగులకు కూడా వారికి రావాల్సిన డీఏలు ఇవ్వలేదని, పాత పెన్షన్ ఇవ్వాలని, జేఎల్ఎం 2లకు ఏపీఎస్ఈబీ సర్వీసు రూల్స్‌ను వర్తింపజేసి న్యాయం చేయాలని కోరారు. కార్యక్రమంలోఏవీ రమణ, ఖాదర్‌బాషా, రెడ్డెప్ప, సుబ్రమణ్యంరాజు, నాయుడు, శ్రీనివాసులరెడ్డి, నగేశ్‌గౌడ్, బాలకృష్ణ, హేమ, నారాయణ పాల్గొన్నారు.

'పేద ప్రజలను ఆదుకోవడం మా లక్ష్యం'



ఎల్‌వోసీ లెటర్‌ను అందిస్తున్న మండిపల్లి లక్ష్మీప్రసాద్‌రెడ్డి

గాలివీడు, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): పేద ప్రజలను ఆదుకోవడం తమ లక్ష్యమని, వారికి ఏ కష్టం వచ్చినా తాము ముందుంటామని డాక్టర్ మండిపల్లి లక్ష్మీప్రసాద్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం అనారోగ్యంతో బాధపడుతున్న గోరాన్ చెరువు వాసి గొల్లరెడ్డి ప్రకాశ్ నాయుడుకు ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి రూ.3 లక్షలు ఎల్‌వోసీ పత్రాన్ని మంజూరు చేయించారు. గ్రామ నాయకులు దాసరి మధుసూదన్‌రెడ్డి, బసిరెడ్డి నరసారెడ్డి, ఆవులకుంట శ్రీకాంత్, ఇతర నాయకుల సమక్షంలో వారికి అందజేశారు.

మండల అభివృద్ధికి సహకరించాలి



మాట్లాడుతున్న ఎంపీపీ మేడా విజయభాస్కర్‌రెడ్డి

నందలూరు, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి) : అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేసి మండల అభివృద్ధికి సహకరించాలని ఎంపీపీ మేడా విజయభాస్కర్‌రెడ్డి కోరారు. శుక్రవారం మండల అభివృద్ధి కార్యాలయ సభా భవనంలో సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులు సంక్షేమ పథకాల గురించి చర్చించారు. నాగిరెడ్డిపల్లె మేజర్ గ్రామ పంచాయతీలో అభివృద్ధి పనులకు తీర్మానం ఇవ్వకపోవడంతో ఇతర పంచాయతీల్లో ఆ సేవలను చేపట్టాల్సి వస్తుందని, గ్రామ సభలకు తమను ఆహ్వానించడం లేదని ఎంపీటీసీ సభ్యులు పంచాయతీ సెక్రటరిని ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో రాధాకృష్ణన్, తహసీల్దారు అమరేశ్వరి, ప్రజా ప్రతినిధులు, మండల అధికారులు పాల్గొన్నారు.

కలెక్టరేట్ ఎదుట గ్రామీణ వైద్యుల ధర్నా

రాయచోటి కలెక్టరేట్, అక్టోబరు3 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ గ్రామీణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యుల సంఘం సూచనల మేరకు అన్నమయ్య జిల్లాలో డైరెక్టర్ అండ్ పబ్లిక్ హెల్త్ పరిధిలో పనిచేస్తున్న గ్రామీణ వైద్యులు, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ వైద్యుల సంఘం సంయుక్తంగా దీర్ఘకాలికంగా అపరిష్కృతంగా ఉన్న తమ డిమాండ్లపై శుక్రవారం కలెక్టరేట్ ఎదుట ధర్నా చేశారు. టైమ్ బౌండ్ ప్రమోషన్స్, ఇన్ సర్వీస్ పీజీ కోటా, నోషన్ ఇంక్రిమెంట్ తదితర డిమాండ్లు నెరవేరే వరకు వెనక్కు వెళ్లే ప్రసక్తే లేదని అక్టోబరు 4 నుంచి విజయవాడలో రిలే నిరాహార దీక్షలో పాల్గొంటామని వారు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో అన్నమయ్య జిల్లా వైద్యులు పాల్గొన్నారు.


బీజాపూర్ జిల్లాలో లొంగిపోయిన మావోయిస్టులు

ఛత్తీస్‌గఢ్‌లో ఇద్దరు గిరిజనుల హత్య

- మావోయిస్టుల ఘాతుకం
- బీజాపూర్ జిల్లాలో లొంగిపోయిన 103మంది మావోయిస్టులు

చర్ల, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): ఛత్తీస్‌గఢ్‌లోని బీజాపూర్, సుకుమా జిలాల్లో మావోయిస్టులు ఇద్దరు గిరిజనులను హత్య చేశారు. బీజాపూర్ జిల్లా పూజారి కాంకేర్ గ్రామానికి చెందిన మడకం భీమా(45)ను మావోయిస్టులు గురువారం అతని ఇంటి ఆవరణలోనే దారుణంగా కత్తులతో పొడిచి చంపేశారు. భీమా 2018లో తెలంగాణలోకి వెళ్లిపోయి, ములుగు జిల్లాలో ఓ ఎస్ఐతో కలిసి పని చేశాడని, గ్రామంలో పోలీస్ క్యాంప్ పెట్టిన తరువాత తిరిగి వచ్చి, ప్రజలను బెదిరిస్తూ, రూ.లక్షలు దోచుకుంటున్నాడని, భూములు ఆక్రమిస్తున్నాడని అందుకే హత్య చేశామని మావోయిస్టులు ఓ లేఖలో పేర్కొన్నారు. అలాగే సుకుమా జిల్లా కిష్టారం అడవుల్లో ఓ గిరిజనుడిని మావోయిస్టులు హతమార్చారు. ఇదిలా ఉంటే ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం గంగలూరు అడవుల్లో గురువారం సాయంత్రం ఎన్‌కౌంటర్ జరిగింది. ఒక మావోయిస్టు చనిపోయాడు. మరోవైపు, బీజాపూర్ జిల్లా పోలీసులు ఎదుట గురువారం 103 మంది మావోయిస్టు పార్టీ సభ్యులు లొంగిపోయారు. వీరిలో 22 మంది మహిళలున్నారు. లొంగి పోయిన వారిలో 47మందిపై మొత్తం కలిపి రూ.1.06కోట్ల రివార్డులున్నట్టు ఎస్పీ జితేంద్ర యాదవ్ తెలిపారు. ఈ ఏడాది జనవరి నుంచి ఇప్పటివరకు 421మంది మావోయిస్టులు అరెస్టయ్యారని, 410 మంది లొంగి పోయారని, 137 మంది ఎన్‌కౌంటర్లలో మృతి చెందారని వెల్లడించారు.

అసభ్య పోస్టుల కేసులో అంజద్ బాషా పీఏ అరెస్టు

- కడప కోర్టులో హాజరు.. బెయిల్ మంజూరు

కడప క్రైం, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): కడప ఎమ్మెల్యే ఆర్.మాధవిపై అసభ్య పదజాలంతో ఉన్న వీడియోను సోషల్ మీడియాలో పోస్టు చేసిన కేసులో మాజీ డిప్యూటీ సీఎం అంజద్‌బాషా పీఏ షేక్ మహ్మద్‌ఖాజాను పోలీసులు అరెస్టు చేశారు. గురువారం అతన్ని కడప ఎక్సైజ్ కోర్టులో హాజరు పరచగా.. సొంత పూచీకత్తుపై అతనికి కోర్టు బెయిలు మంజూరు చేసింది. ఆ వివరాలను కడప డీఎస్పీ వెంకటేశ్వర్లు, వన్‌టౌన్ సీఐ రామకృష్ణ విలేకరులకు వివరించారు. కడప అక్బర్ వీధికి చెందిన షేక్ మహ్మద్ ఖాజా మాజీ డిప్యూటీ సీఎం అంజద్‌బాషాకు పీఏగా పనిచేస్తున్నాడు. 2024 ఎన్నికల సమయంలో ప్రస్తుత కడప ఎమ్మెల్యే మాధవి, ఆమె భర్త శ్రీనివాసరెడ్డిపై కడప అలంఖాన్‌పల్లెకు చెందిన విజయలక్ష్మి అసభ్యకరంగా మాట్లాడారు. ఆ వీడియోను అంజద్‌బాషా అతని సోదరుడు అహ్మద్‌బాషా ప్రోద్బలంతో సోషల్ మీడియాలో షేక్ మహ్మద్‌ఖాజా పోస్టు చేశాడు. ఈ వీడియో వైరల్ కావడంతో టీడీపీ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసరెడ్డి ఫిర్యాదు మేరకు అంజద్‌బాషా, అహ్మద్‌బాషా, షేక్ మహ్మద్‌ఖాజాలపై కేసు నమోదు చేశారు. షేక్ మహ్మద్ ఖాజాను బుధవారం హైదరాబాద్‌లో అదుపులోకి తీసుకున్నారు. గురువారం కోర్టులో హజరు పరిచారు. ఎవరైనా సోషల్ మీడియాలో అసభ్యకరమైన వీడియోలు పోస్టు చేస్తే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఈ సందర్భంగా పోలీసులు హెచ్చరించారు.

'సిట్' ముందు హాజరైన మిథున్‌రెడ్డి

విజయవాడ, అక్టోబరు 3(ఆంధ్రజ్యోతి): మద్యం కుంభకోణంలో నిందితుడిగా ఉన్న రాజంపేట ఎంపీ పీవీ మిథున్‌రెడ్డి విజయవాడలోని సిట్ అధికారుల ముందు శుక్రవారం హాజరయ్యారు. ప్రతి సోమవారం, శుక్రవారం సిట్ అధికారుల ముందు హాజరవ్వాలని కోర్టు బెయిల్ ఉత్తర్వుల్లో షరతు విధించింది. దాని ప్రకారం మిథున్‌రెడ్డి సిట్ కార్యాలయానికి వచ్చి పుస్తకాల్లో సంతకం చేశారు. ఇటీవలే ఆయనకు కోర్టు బెయిల్ మంజూరు చేయడంతో రాజమహేంద్రవరం కేంద్ర కారాగారం నుంచి విడుదలైన విషయం తెలిసిందే.


సర్జరీ సిస్టమ్‌ను ప్రారంభిస్తున్న సత్యసాయి సెంట్రల్ ట్రస్టు సభ్యుడు చక్రవర్తి, పక్కన సత్యసాయి సెంట్రల్ ట్రస్టు మేనేజింగ్ ట్రస్టీ ఆర్జే రత్నాకర్ తదితరులు

'సత్యసాయి' ఆస్పత్రిలో రోబోటిక్ సర్జరీ సేవలు

- గుండె, యూరాలజీ విభాగంలో అందుబాటులోకి సేవలు

పుట్టపర్తి రూరల్, అక్టోబరు 3(ఆంధ్రజ్యోతి): శ్రీసత్యసాయి జిల్లా పుట్టపర్తిలోని సత్యసాయి సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిలో అత్యాధునిక రోబోటిక్ సర్జరీ సేవలు అందుబాటులోకి వచ్చాయి. రూ.8 కోట్ల విలువైన అత్యాధునిక రోబోటిక్ సర్జరీ వ్యవస్థను సత్యసాయి సెంట్రల్ ట్రస్టు మేనేజింగ్ ట్రస్టీ ఆర్జే రత్నాకర్, సభ్యుడు చక్రవర్తి గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా రత్నాకర్ మాట్లాడుతూ, భగవాన్ సత్యసాయి ధ్యేయమైన విలువలు, కరుణ, ప్రేమతో కూడిన అత్యాధునిక వైద్యాన్ని ఉచితంగా అందుబాటులోకి తెచ్చామన్నారు. ఎస్ఎస్ ఇన్నొవేషన్స్ అనే భారతీయ సంస్థ ప్రపంచ స్థాయి ప్రమాణాలకు తగ్గట్లు ఈ రోబోటిక్ శస్త్ర చికిత్స వ్యవస్థను అభివృద్ధి చేసిందన్నారు. ఈ వ్యవస్థతో శరీరంలోని సున్నితమైన ప్రాంతాలకు కూడా అత్యంత కచ్చితత్వంతో, సంక్లిష్టమైన శస్త్ర చికిత్సలను సులభతరంగా చేయవచ్చని వెల్లడించారు. రోబోటిక్


రోబోటిక్ సర్జరీ యంత్రాలు

సర్జరీకి రూ.లక్షలు ఖర్చు అవుతుందని, కానీ సత్యసాయి సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిలో పూర్తి ఉచితంగా అందుతుందని స్పష్టం చేశారు.

ములకలచెరువు కేంద్రంగా
నకిలీ మద్యం తయారీ

- రూ.1.75 కోట్ల విలువైన నకిలీ మద్యం స్వాధీనం
- స్పిరిట్, బాటిళ్లు, పరికరాలు సీజ్.. 9 మంది అరెస్టు


నకిలీ మద్యాన్ని తయారు చేస్తున్న దృశ్యం.. స్వాధీనం చేసుకున్న నకిలీ మద్యం బాక్సులు

రాయచోటి, అక్టోబరు 3(ఆంధ్రజ్యోతి): అన్నమయ్య జిల్లా ములకలచెరువులో శుక్రవారం ఎక్సైజ్ అధికారులు దాడులు జరిపి రూ.1.75కోట్ల విలువైన నకిలీ మద్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. కడప ప్రొహిబిషన్, ఎక్సైజ్ అసిస్టెంట్ కమిషనర్ చంద్రశేఖర్‌రెడ్డి అధ్వర్యంలో ఈ దాడులు జరిగాయి. అనంతరం ఆయన మీడియాకు వివరాలు వెల్లడించారు. విజయవాడకు చెందిన జనార్దన్‌రావు, ఆయన అనుచరుడు రాజు ములకలచెరువుకు సమీపంలోని కనుగొండ ఆర్చి సమీపంలో ఉన్న పాత డాబాను అద్దెకు తీసుకుని నకిలీ మద్యం తయారు చేస్తున్నారు. ఈ మద్యాన్ని వాహనం ద్వారా తంబళ్లపల్లె నియోజకవర్గంలోని పలు ప్రాంతాలకు సరఫరా చేస్తున్నారు. ప్రభుత్వ ధర కంటే తక్కువకే ఇస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. పలు ప్రభుత్వ మద్యం షాపులకు కూడా ఈ మద్యాన్ని సరఫరా చేస్తున్నారు. ఇటీవల జిల్లా ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు పెద్దతిప్ప సముద్రం మండలంలో తనిఖీలు నిర్వహిస్తూ.. నకిలీ మద్యం తీసుకెళ్తున్న వాహనాన్ని నిలిపారు. బాటిళ్ల మీద ఉన్న లేబుల్‌ను స్కాన్ చేశారు. అయితే స్కాన్ కాకపోవడంతో అనుమానం వచ్చి విషయాన్ని ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లారు. ఈ వ్యవహారంపై ఎక్సైజ్ డైరెక్టర్ రాహుల్ దేవ్‌కు ఫిర్యాదులు అందడంతో అధికారులు గత నాలుగు రోజులుగా నిఘా ఉంచి శుక్రవారం ఈ దాడులు చేశారు. 15 వేల నకిలీ మద్యం బాటిళ్లు, 1050 లీటర్ల స్పిరిట్ క్యాన్లు, 1500 లీటర్ల బ్లెండ్(తయారైన నకిలీ మద్యం), 10 వేల ఖాళీ మద్యం బాటిళ్లు, 4 వేల మద్యం సీసా మూతలు.. స్టిక్కర్లు, మద్యం బాటిళ్లు తయారు చేసే పరికరాలు, ఇతర సామగ్రి, నకిలీ మద్యం సరఫరా చేసే వాహనాన్ని సీజ్ చేశారు. తమిళనాడు రాష్ట్రం కృష్ణగిరికి చెందిన మరిమారన్, తిరుపత్తూరుకు చెందిన సురేశ్, సూర్య, ఆనంద న్, ఒడిశా రాష్ట్రం బ్రహ్మపూర్‌కు చెందిన ఆనంద్ దాస్, మిథున్, విశాఖపట్నానికి చెందిన సయ్యద్ అలీ, వాహన డ్రైవర్ బాలరాజు, నకిలీ మద్యం కలిగి ఉన్న బెల్ట్ షాపు నిర్వాహకుడు రంగసముద్రానికి చెందిన నాగరాజు, పెద్దతిప్ప సముద్రంలోని మద్యం దుకాణ నిర్వాహకుడు టీడీపీ నేత కట్టా సురేంద్రనాయుడును అరెస్టు చేశారు. విజయవాడకు చెందిన జనార్దన్‌రావు, అతని అనుచరుడు రాజు, ములకలచెరువులోని రాక్‌స్టార్ ప్రభుత్వ మద్యం దుకాణ నిర్వాహకుడు రాజేశ్ తదితరులపైనా కేసు నమోదు చేశారు.


సమావేశంలో వివరాలు వెల్లడిస్తున్న ఎక్సైజ్ అసిస్టెంట్ కమిషనర్ చంద్రశేఖర్‌రెడ్డి

నిందితుల్లో తంబళ్లపల్లె టీడీపీ ఇన్‌చార్జి పీఏ

రాజేశ్ తంబళ్లపల్లె నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి దాసరిపల్లి జయచంద్రారెడ్డి పీఏగా పనిచేస్తున్నారు. ఇతని పేరుతో ఉన్న వాహనం ద్వారానే నకిలీ మద్యం సరఫరా చేస్తున్నారు. దీనిపై సర్వత్రా చర్చ జరుగుతోంది. ఈ నకిలీ మద్యం తయారీ వెనుక తంబళ్లపల్లె నియోజకవర్గ టీడీపీ ముఖ్య నాయకుల సమీప బంధువుల ప్రమేయం ఉన్నట్టు ప్రచారం జరుగుతోంది. ఈ నకిలీ మద్యం తయారీలో జిల్లాలోని పలువురు టీడీపీ నాయకుల హస్తం ఉన్నట్టు కూడా ఆరోపణలు వినిస్తున్నాయి. నియోజకవర్గంలోని పలు బెల్ట్‌షాపులు, ప్రభుత్వ మద్యం దుకాణాల్లోనూ ఎక్సైజ్ అధికారులు దాడులు నిర్వహించారు.

గ్యాంగ్ రేప్ కేసు నిందితులకు రిమాండ్

- గత నెల 25న చిత్తూరు సమీపంలో బాలికపై అఘాయిత్యం

చిత్తూరు అర్బన్, అక్టోబరు 3(ఆంధ్రజ్యోతి): ఇటీవల చిత్తూరులో ఇంటర్ విద్యార్థినిపై గ్యాంగ్ రేప్‌కు పాల్పడిన ముగ్గురు యువకులను పోలీసులు శుక్రవారం అరెస్టు చేశారు. ఇందుకు సంబంధించిన వివరాలను డీఎస్పీ సాయినాథ్ మీడియాకు వివరించారు. గత నెల 25వ తేదీన చిత్తూరు నగర సమీపంలో ఉన్న నీవా నగర వనం పార్కుకు వచ్చిన యువ జంటను ముగ్గురు యువకులు బెదిరించారు. బాలికపై అత్యాచారానికి పాల్పడ్డారు. ఆ జంటలోని యువకుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు 29వ తేదీన పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ కేసులో నిందితులైన మహేష్, కిశోర్, హేమంత్‌ను శుక్రవారం అరెస్టు చేసి కోర్టులో హాజరు పరిచారు. ముగ్గురు నిందితులకు పోక్సో కోర్టు ఈ నెల 16 వరకు రిమాండ్ విధించింది. నిందితుల్లో ఒకరైన మహేష్ ఓ బాలికను ఈవ్ టీజింగ్ చేసిన కేసులో నిందితుడిగా ఉన్నాడు. కిశోర్ 2022లో నగరంలోని ఓ వైన్ షాపులో పనిచేస్తుండగా అక్కడి మద్యాన్ని బ్లాక్‌లో విక్రయించాడని అతనిపై కేసు నమోదైంది. కాలక్షేపం కోసం పార్కులకు వచ్చే ప్రేమ జంటలను లక్ష్యంగా చేసుకుని వారు కలిసున్న దృశ్యాలను వీడియో తీసి వారిని బెదిరించడం.. వారి వద్ద ఉన్న నగదు, బంగారాన్ని లాక్కోవడం.. లైంగిక వేధింపులకు పాల్పడటం.. వీరి నేర ప్రవృత్తిగా పోలీసుల దర్యాప్తులో వెల్లడైంది. కాగా.. నిందితుల్ని స్థానిక డీపీవో కార్యాలయం నుంచి అర కిలో మీటరు దూరంలో ఉన్న కోర్టు వరకు బేడీలు వేసి రోడ్డుపై నడిపించుకుంటూ తీసుకెళ్లారు.

హోటల్ సిబ్బందిపై వైసీపీ నేత నాగార్జున యాదవ్ దాడి

- అల్పాహారం ఆలస్యంగా ఇచ్చారని దౌర్జన్యం
- ఇరువురికి గాయాలు.. కేసు నమోదు


హోటల్ యజమాని కొడుకు ప్రేమ్‌కుమార్

సత్తెనపల్లి, అక్టోబరు 3(ఆంధ్రజ్యోతి): అల్పాహారం తీసుకురావడంలో ఆలస్యం అయిందని హోటల్ యజమాని, సిబ్బందిపై వైసీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి యనమల నాగార్జున యాదవ్ అతని అనుచరులు రెచ్చిపోయారు. వారిపై దాడి చేసి గాయపర్చారు. ఈ దాడి ఘటన గురువారం రాత్రి పల్నాడు జిల్లా సత్తెనపల్లిలోని తాలూకాసెంటర్‌లో జరిగింది. రాత్రి 10 గంటల సమయంలో నాగార్జున యాదవ్ అతని అనుచరులు పట్టణంలోని గుడ్‌మార్నింగ్ హోటల్‌కు టిఫిన్ చేసేందుకు వచ్చారు. టిఫిన్ అందించడం ఆలస్యమవుతుందని నాగార్జునయాదవ్ అతని అనుచరులు గొడవకు దిగారు. హోటల్ యజమాని శేఖర్, అతని కుమారుడు ప్రేమ్‌కుమార్, వర్కర్ నాగేశ్వరరావుపై దాడి చేశారు. ఈ ఘటనలో ప్రేమ్‌కుమార్, వర్కర్‌కు గాయాలయ్యాయి. తనతో పెట్టుకుంటే అబ్బూరు ఊరు ఊరంతా కదిలొస్తుందంటూ హోటల్ యజమాని శేఖర్‌ను నాగార్జున యాదవ్ బెదిరించారు. దాడి ఘటనపై హోటల్ యజమాని శేఖర్ పట్టణ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.


హోటల్ యజమానిపై దౌర్జన్యం చేస్తున్న వైసీపీ నాయకుడు యనమల నాగార్జునయాదవ్

దేవపట్ల పీహెచ్‌సీ ఆకస్మిక తనిఖీ


వైద్య సిబ్బందితో మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో లక్ష్మీనరసయ్య

రాయచోటి (నేతాజీ సర్కిల్), అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): దేవపట్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని డీఎంహెచ్‌వో డాక్టర్ లక్ష్మీనరసయ్య శుక్రవారం సందర్శించారు. వైద్యులు సమ్మెలో ఉన్న కారణంగా ప్రజలకు వైద్య సేవలు అందుతున్న తీరును పరిశీలించేందుకు వైద్యులు డాక్టర్ అజాజ్ అహ్మద్‌తో మాట్లాడి పరిస్థితులను తెలుసుకున్నారు. రికార్డులను పరిశీలించారు. పీహెచ్‌సీల్లో ప్రసవాలు జరిగేలా సిబ్బంది కృషి చేయాలన్నారు. సీజనల్ వ్యాధులపై గ్రామాల్లో అవగాహన సమావేశాలు నిర్వహించి ప్రజలను చైతన్య పరచాలన్నారు. కార్యక్రమంలో డాక్టర్ విష్ణువర్ధన్‌రెడ్డి, ఎంపీహెచ్ఈవో వెంకటేశ్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

రైతులకు ఉపయోగపడే పనులను గుర్తించండి


సమావేశంలో మాట్లాడుతున్న చిదంబర్‌రెడ్డి

రాయచోటి (నేతాజీ సర్కిల్), అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): ఉపాధి హామీ పథకంలో రైతులకు ఉపయోగపడే పనులను గుర్తించాలని సర్పంచుల సంఘం జిల్లా అధ్యక్షుడు ఏపీపీ న్యూఢిల్లీ జనరల్ సెక్రటరీ చిదంబర్‌రెడ్డి తెలిపారు. గుట్టపల్లి సచివాలయంలో ఉపాధి హామీ పనుల గుర్తింపు గ్రామ సభల్లో ఆయన పాల్గొన్నారు. ఏపీవో రెడ్డిజవహర్ అధ్యక్షతన నిర్వహించిన ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ 2026-27 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి ఉపాధి హామీ పనులను గుర్తించాలని తెలియజేశారు. రెండవ గ్రామ సభలో గుర్తించిన పనులను ప్రజలకు తెలియజేస్తామన్నారు. ఎంపీటీసీ సభ్యుడు రవీంద్ర నాయుడు మాట్లాడుతూ అక్రమాలకు తావు లేకుండా పనులు జరిగేలా చూడాలన్నారు. కార్యక్రమంలో ఉపాధి హామీ టీఏ, ఫీల్డ్ అసిస్టెంట్లు తదితరులు పాల్గొన్నారు.

వివాదాస్పద స్థల పరిశీలన


రికార్డులు పరిశీలిస్తున్న అధికారులు

పీలేరు, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): ఆవు వారిపల్లె వద్ద కొంత కాలంగా వివాదాల్లో నలుగుతున్న సర్వే నెం.440లోని స్థలాన్ని శుక్రవారం జిల్లా ఉన్నతాధికారులు పరిశీలించారు. జిల్లా సర్వే, ల్యాండ్ రికార్డ్స్ ఏడీ భరత్ కుమార్, సర్వే శాఖ రాయచోటి డివిజన్ ఇన్‌స్పెక్టర్ ప్రసాద్, డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ గురివిరెడ్డి పరిశీలించారు. వారు మాట్లాడుతూ ఆవువారిపల్లెకు చెందిన ఇరుపక్షాల మధ్య కోర్టు కేసుల నేపథ్యంలో కోర్టు, జిల్లా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు క్షేత్రస్థాయి పరిశీలన జరిపినట్లు తెలిపారు. కార్యక్రమంలో తహసీల్దారు శివకుమార్, సర్వేయర్ రెడ్డిశేఖర్, వీఆర్వో వెంకటేశ్, తదితరులు పాల్గొన్నారు.

అనుమానాస్పద స్థితిలో వాచ్‌మన్ మృతి

ఓబులవారిపల్లె, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఏపీఎండీసీ పబ్లిక్ స్కూల్ వాచ్‌మన్ పసుపులేటి రవితేజ(29) అనుమానాస్పద స్థితిలో మృతిచెందినట్లు పోలీసులు కేసు నమోదు చేశారు. మంగంపేట పునరావాసప్రాంతంలోని అరవ వీధికి చెందిన పసుపులేటి సుబ్బరాయుడు కుమారుడు రవితేజ పదేళ్లుగా ఏపీఎండీసీ స్కూల్లో వాచ్‌మన్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. శుక్రవారం ఉదయం మొదటి షిఫ్టులో డ్యూటీకి హాజరైన అతను స్కూలు ప్రాంగణంలో కిందపడడంతో, పక్కనే ఉన్న ఆసుపత్రికి వెళ్లి చికిత్స చేయించుకున్నాడు. మధ్యాహ్నం స్కూల్ బయట ఉన్న మోటారును ఆన్ చేసేందుకు వెళ్లి అక్కడే పడిపోయాడు. విషయం గమనించిన సిబ్బంది అతనిని తొలుత మంగంపేట ఆసుపత్రికి, అక్కడినుంచి కోడూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ పరీక్షించిన వైద్యులు అప్పటికే అతను మృతి చెందినట్లు ధ్రువీకరించారు. అతను విద్యుత్ షాక్‌తో మృతిచెందాడా అన్న విషయంపై అనుమానాలు వ్యక్తమవుతున్నా. తమ కుటుంబానికి న్యాయం చేయాలని మృతుని అక్క చంద్రిక పోలీసులకు ఫిర్యాదు చేశారు. మృతదేహాన్ని రైల్వేకోడూరు ప్రభుత్వాసుపత్రికి తరలించినట్లు పోలీసులు తెలిపారు. మృతుడికి భార్య, ఇద్దరు చిన్న పిల్లలు ఉన్నారు. అయితే, ఏపీఎండీసీ స్కూలు యాజమాన్యం ఈ విషయంపై ఇప్పటివరకు పట్టించుకోలేదని గ్రామస్థులు వాపోయారు.


అనుమానాస్పదంగా మృతిచెందిన రవితేజ


జోరుగా మద్యం అమ్మకాలు..!

- అధికారుల తీరుపై మండిపాటు

గుర్రంకొండ, అక్టోబరు 3(ఆంధ్రజ్యోతి): పట్టణంలో గాంధీ జయంతి రోజున కూడా మద్యం అమ్మకాలు జోరందుకున్నాయి. ఉదయం నుంచి రాత్రి వరకు విచ్చలవిడిగా సాగాయి. గ్రామాల్లో కూడా బెల్టుషాపుల్లో మద్యం ఏరులైపారింది. పట్టణంలోని మార్కెట్ యార్డు, ఖంద్రిగ, ఇందిరమ్మకాలనీ, మద్యం దుకాణాల పక్కనున్న బెల్టుషాపుల వద్ద గురువారం మద్యం విక్రయాలు జరగడం విమర్శలకు దారితీస్తోంది. మద్యం దుకాణాలు బంద్ కావడంతో ముందు రోజే బెల్టుషాపు నిర్వాహకులు తమకు కావాల్సినంత మద్యాన్ని కొనుగోలు చేసి స్టాక్ ఉంచుకున్నారు. ఈ విషయమై అధికారుల తీరుపై ప్రజలు మండిపడుతున్నారు. ఈ విషయమై వాల్మీకిపురం ఎక్సైజ్ శాఖ సీఐ లతశ్రీని వివరణ కోరగా నిబంధనలకు విరుద్ధంగా గుర్రంకొండలో మద్యం అమ్మిఉంటే విచారించి చర్యలు తీసుకుంటామన్నారు.


మద్యం దుకాణం పక్కనే మద్యం విక్రయిస్తున్న బెల్టుషాపు నిర్వాహకులు

రోడ్డు ప్రమాదంలో కార్యదర్శి మృతి


కృష్ణప్రసాద్ (ఫైల్‌ఫొటో)

పెద్దతిప్పసముద్రం, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): బూర్లపల్లె పంచాయతీ కార్యదర్శి కృష్ణప్రసాద్ (58) రోడ్డు ప్రమాదంలో దుర్మరణం చెందాడని పోలీసులు తెలిపారు. ఇటీవల బదిలీల్లో భాగంగా సత్యసాయి జిల్లా సోమందేపల్లెకు చెందిన కృష్ణప్రసాద్ బూర్లపల్లె పంచాయతీ కార్యదర్శిగా విధుల్లో చేరారు. గత నెల 27న శనివారం విధులు ముగించుకుని సాయంత్రం ద్విచక్రవాహనంలో తమ స్వగ్రామం సోమందేపల్లెకు బయలుదేరాడు. ఈ క్రమంలో సోమందేపల్లె సమీప నల్లకొండ్రాయునిపల్లె క్రాస్ వద్ద ద్విచక్ర వాహనాన్ని గుర్తు తెలియని వాహనం ఢీ కొనడంతో అతను తీవ్రంగా గాయపడ్డారు. పెనుగొండ హైవే పోలీసులు గమనించి కుటుంబ సభ్యులకు సమాచారమందించి అతన్ని పెనుగొండ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం కర్నూలు జనరల్ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ గురువారం ఉదయం 10 గంటలకు మృతి చెందారు. కృష్ణప్రసాద్ మృతిపై ఎంపీడీఓ అబ్దుల్‌కలాం ఆజాద్, ఏఓ శ్రీధర్, ఆర్‌డబ్ల్యూఎస్ బోరు మెకానిక్ చంద్ర, సహ పంచాయతీ కార్యదర్శులు, బూర్లపల్లె సుధాకర్‌రెడ్డి సంతాపం తెలిపారు. కాగా దహనక్రియలకు ప్రభుత్వం నుంచి అందించే సహాయంలో భాగంగా రూ.25 వేలను మృతుడి కుటుంబ సభ్యులకు ఎంపీడీఓ అందించారు.

జీఎస్టీ తగ్గింపుపై అవగాహన

రాయచోటి(నేతాజీసర్కిల్), అక్టోబరు3(ఆంధ్రజ్యోతి): సూపర్ జీఎస్టీ.. సూపర్ సేవింగ్‌పై ప్రజల్లో అవగాహన కల్పిస్తున్నట్లు రాయచోటి జీఎస్టీ వాణిజ్య పన్నుల అధికారి షేక్.సుమయ తెలిపారు. శుక్రవారం రాయచోటి మున్సిపల్ కమిషనర్ రవి, ఎంపీడీవో పరిపూర్ణ అరుంధతితో కలిసి మండల పరిషత్ కార్యాలయం నుంచి బంగ్లా వరకు అవగాహన ర్యాలీ నిర్వహించారు. ప్లకారులు ప్రదర్శిస్తూ నినాదాలు చేశారు. పూర్తి స్థాయిలో ప్రజల్లో అవగాహన తీసుకొచ్చి తగ్గిన జీఎస్టీ ప్రకారం అమ్మకాలు జరిగే విధంగా చూస్తామని, ప్రజల్లో చైతన్యం వచ్చినప్పుడే ఇది సాధ్యమని తెలిపారు. కార్యక్రమంలో ఈవోపీఆర్‌డీ సురేశ్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

రోడ్డు ప్రమాదంలో ఆయా..


మహిళ మృతదేహం

మదనపల్లె అర్బన్, అక్టోబరు 3 (ఆంధ్ర జ్యోతి): ఓ ప్రైవేటు స్కూల్‌లో ఆయాగా పనిచేస్తున్న ముని లక్ష్మమ్మ (55) రోడ్డు ప్రమాదంలో మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. పుంగనూరు మండలం, లదిగం వాసి మునిలక్ష్మమ్మ రోడ్డు దాటుతుండగా బైక్ ఢీ కొనడంతో ఆమె అక్కడికక్కడే మృతి చెందింది. సమాచారం అందుకున్న తాలుకా సీఐ కళా వెంకటరమణ సంఘటన స్థలానికి చేరుకుని ట్రాఫిక్ క్లియర్ చేసి మృతదేహాన్ని మదనపల్లె జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ పేర్కొన్నారు.

పురుగుల మందుతాగి వృద్ధుడు..


నరసింహులు మృతదేహం

మదనపల్లెఅర్బన్, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): అనారోగ్యంతో పురుగుల మందు తాగి వృద్ధుడు ఆత్మహత్య చేసుకున్న సంఘటన మదనపల్లె మండలంలో చోటు చేసుకుంది. పోలీసుల వివరాల మేరకు.. గురువారం మదనపల్లె మండలం, రంగారెడ్డికాలనీకి చెందిన లేట్ ఉత్తన్న కుమారుడు బండా నరసింహులు(68) గురువారం ఉదయం బయటకు వెళ్లి కొత్త ఇళ్ల సమీపంలో పురుగుల మందుతాగి ఆత్మహత్యకు పాల్పడాడు. కొన్ని రోజులుగా అనారోగ్యంతో ఉన్న ఆయన మందులు సక్రమంగా వేసుకోలేదని భార్య గంగులమ్మ మందలించడంతో మనస్థాపానికి గురై ఆత్మహత్య చేసుకున్నాడు. గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే మదనపల్లె జిల్లా ప్రభుత్వాస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. కుమారుడు రమణ ఫిర్యాదు మేరకు సీఐ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

అంబులెన్సు ఢీకొని ఆర్ఎంపీ..


నరేంద్రరావు (ఫైల్ ఫొటో)

రైల్వేకోడూరు, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని హీరో షోరూం ఎదురుగా ప్రధానదారిలో బుధవారం రాత్రి ఓ ప్రైవేటు అంబులెన్సు ఢీకొని ఆర్ఎంపీ మృతిచెందాడు. పోలీసుల కథనం మేరకు... పట్టణంలోని బలిజవీధికి చెందిన ఆర్ఎంపీ నార్జాల నరేంద్రరావు (59) వైద్యశాలను మూసిన అనంతరం బలిజపల్లె గంగమ్మ ఆలయానికి బైక్‌లో వెళుతుండగా కడప వైపు నుంచి వస్తున్న ఓ ప్రైవేటు అంబులెన్స్ ఢీకొంది. దీంతో తీవ్రంగా గాయపడిన ఆయనను స్థానికులు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం తిరుపతిలోని ఓ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

పరిశుభ్రతకు పట్టం

- చెన్నూరు గ్రామ పంచాయతీకి స్వచ్ఛ ఆంధ్ర అవార్డు
- 6న సీఎం చేతుల మీదుగా ప్రదానం



చెన్నూరు చెత్తసంపద కేంద్రం వద్ద పచ్చదనం

చెన్నూరు, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): చెన్నూరు గ్రామ పంచాయతీకి రాష్ట్రస్థాయి స్వచ్ఛ ఆంధ్ర అవార్డుకు ఎంపికైంది. పరిశుభ్రతతోనే అభివృద్ధి అనే ధ్యేయంతో ప్రణాళికాబద్ధంగా పనిచేయడంతోనే రాష్ట్ర ప్రభుత్వం ఈ అవార్డుకు ఎంపిక చేసింది. రాష్ట్రంలోని ఆరు మున్సిపాలిటీలు, ఆరు గ్రామ పంచాయతీలను స్వచ్ఛాంధ్ర అవార్డుకు ఎంపిక చేయగా... అందులో జిల్లాలోని చెన్నూరు గ్రామ పంచాయతీ అవార్డు దక్కించుకుంది. ఈనెల 6న విజయవాడలో జరిగే స్వచ్ఛ ఆంధ్ర అవార్డుల ప్రదానోత్సవ కార్యక్రమంలో చెన్నూరు గ్రామ పంచాయతీ కార్యదర్శి రామసుబ్బారెడ్డి, సర్పంచ్ ఎస్.వెంకటసుబ్బయ్యలు ఈ అవార్డు అందుకోనున్నారు.

చెన్నూరు మేజరు గ్రామ పంచాయతీగా ఏర్పడినప్పటి నుంచి పరిశుభ్రతపై అత్యధిక ప్రాధాన్యతనిచ్చారు. గత చంద్రబాబు పాలనలో చెన్నూరు గ్రామ పంచాయతీలో చెత్త సంపద తయారీ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. దీంతో పరిశుభ్రతపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించారు. దీంతో ఉదయం 5గంటలకే పంచాయతీ కార్యదర్శి రామసుబ్బారెడి, డిప్యూటీ ఎంపీడీవో గంగనపల్లె సురేశ్ బాబు పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి సారించేవారు. వీరికి సర్పంచ్ వెంకటసుబ్బయ్య సైతం పూర్తి సహాయ సహకారాలు అందించేవారు. డిప్యూటీ ఎంపీడీవో నిరంతరం పారిశుధ్య కార్మికులకు అవగాహన కల్పించి.. ప్రతి ఇంటి ముందు ఉన్న చెత్తను ఉదయం 5 నుంచి శుభ్రపరిచి చెత్త సంపద కేంద్రాలకు తరలించేవారు. 15రోజులకోమారు గ్రామ పంచాయతీలో డ్రైనేజీలు శుభ్రం చేయడం, వర్షాకాలం వస్తే మురికి ఉన్న చోట బ్లీచింగ్ చల్లడం, దోమలున్న చోట ఫాగింగ్ చేయడం వంటి కార్యక్రమాలు చేపట్టేవారు. ఈ నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం మేజరు గ్రామ పంచాయతీ చెన్నూరును స్వచ్ఛ ఆంధ్ర అవార్డుకు ఎంపిక చేసింది.


చెత్త సంపద కేంద్రంలో వ్యర్థాలతో తయారవుతున్న ఎరువు

అంతా పచ్చదనమే..

గ్రామ పంచాయతీల్లో సేకరించే చెత్తను చెత్త సంపద కేంద్రాలకు తరలించి.. ఎరువుగా మార్చి రైతులకు కిలో లెక్కన అందించేవారు. ఇక్కడి ఎస్‌డబ్ల్యూపీసీని చూడగానే అదేదో కసుపు వేసే దిబ్బలా కాకుండా పూలు, పండ్ల మొక్కలతో ఆకట్టుకునేలా తీర్చిదిద్దారు. దీంతో ఇక్కడ వాతావరణం ఆహ్లాదకరంగా ఉంటుంది. ఇది కూడా స్వచ్ఛ ఆంధ్ర అవార్డుకు ప్రధాన కారణమని చెప్పవచ్చు.

పరిశుభ్రతపై ప్రత్యేక దృష్టి



గ్రామ పంచాయతీలో ఎక్కడ అపరిశుభ్రత ఉందని చెప్పినా.. ఫోను ద్వారా తెలిపినా వెంటనే స్పందిస్తున్నాం. ఏ ప్రాంతంలో వ్యర్థాలున్నా అక్కడకు పారిశుధ్య సిబ్బందితో వెళ్లి నిమిషాల వ్యవధిలోనే శుభ్రం చేయిస్తున్నాం. ప్రజలు కూడా పరిశుభ్రతపై సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

- జి.సురేశ్‌బాబు, డిప్యూటీ ఎంపీడీవో, చెన్నూరు

ప్రజల ఆరోగ్యమే ముఖ్యం



చెన్నూరు పంచాయతీలో 20వేలకు పైగా జనాభా ఉన్నారు. ప్రజల ఆరోగ్యం కోసం పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి సారిస్తూ.. పంచాయతీలోని ప్రతి వార్డుల్లో నిరంతరం పర్యవేక్షిస్తాం. ముఖ్యంగా మురుగుకాల్వలు శుభ్రం చేయించడం, బ్లీచింగ్ చల్లించడం, వర్షాకాలంలో దోమల నివారణకు ఫాగింగ్ చేయిం చడం తదితర కార్యక్రమాలు చేపడుతున్నాం.

-డి.రామసుబ్బారెడ్డి, పంచాయతీ కార్యదర్శి

అవార్డు రావడం సంతోషంగా ఉంది



పంచాయతీకి స్వచ్ఛ ఆంధ్ర అవార్డు రావడం చాలా సంతోషగా ఉంది. పంచాయతీ సర్పంచ్‌గా గెలిపించిన ప్రజల బాగు కోసం ప్రతి రోజూ వీధి వీధినా తిరుగుతున్నాం. ఎవరు ఏ సమస్య తెలిపినా వెంటనే పరిష్కరిస్తున్నాం

-ఎస్.వెంకటసుబ్బయ్య, సర్పంచ్ చెన్నూరు

నల్లగుట్టపైకి వెళ్లరాదని గ్రామస్తుల నిరసన


నట్టగుట్ట వద్ద అంకిశెట్టిపల్లె గ్రామస్థుల నిరసన

మదనపల్లె అర్బన్, అక్టోబరు 3(ఆంధ్రజ్యోతి): నల్లగుట్టపైకి ఇతరులు వెళ్లరాదని గురువారం గ్రామస్తులు నిరసన వ్యక్తం చేశారు. గ్రామ సమీపంలో నల్లగుట్ట ఉందని ఏన్నో ఏళ్లగా పశువులు, మేకలు, గొర్రెలు మెపుతూ జీవిస్తున్నట్లు పేర్కొన్నారు. పొలాల వద్దకు వెళ్లడానికి అనుకూలంగా గుట్ట ఉన్నట్లు చెప్పారు. పీటీఎం శివప్రసాద్ బుద్ధుడి విగ్రహం అక్రమంగా ఏర్పాటు చేసి గ్రామస్తులను ఇబ్బందులకు గురిచేస్తున్నట్లు చెప్పారు. ఇది ప్రభుత్వ స్థలమని, గంగమ్మ ఆలయం ఉందని తరతరాలుగా పూజలు నిర్వహిస్తున్నామని, వీరు ఆక్రమించడంతో అమ్మవారికి పూజలు చేయడానికి వీలులేకుండా పోయిందని వాపోయారు. నేరేడేపండ్లు, శీతాపలాలు, ఉలింజికాయలు, గోరింజపళ్లు, కలిమికాయలు జీవనాధారం కోసం నల్లగుట్ట ఉపయోగంగా ఉండేదన్నారు. పీటీఎం శివప్రసాద్ 2015లో గుట్టను ఆక్రమించి గ్రామస్తులను వెళ్లకుండా భయభ్రాంతులకు గురి చేస్తున్నట్లు వివరించారు. ఇందులో అంకిశెట్టిపల్లె, తుమ్మలతండా, నడిమితండా, మునగమాకులపల్లె, నల్లగుట్టపల్లె, ఒంటిలుల, సాములవారియిండ్లు పేద ప్రజలకు ఇది జీవనాధారంగా ఉండేదన్నారు. ఉన్నతాధికారులు స్పందించి తమకు న్యాయం చేయాలని కోరారు.

ఇసుక అక్రమ రవాణాపై తహసీల్దార్‌కు ఫిర్యాదు

పెద్దతిప్పసముద్రం, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): కర్ణాటక సరిహద్దు గ్రామం టి.సదుం చెన్నరాయునిపల్లె సమీప పాపాఘ్ని నది నుంచి ఇసుకను పగలు డంప్ చేసి రాత్రి గుట్టు చప్పుడు కాకుండా కర్ణాటక రాష్ట్రానికి తరలించి సొమ్ము చేసుకుంటున్నారని తహసీల్దార్ శ్రీరాములు నాయక్‌కు టి.సదుం పంచాయతీ అనంతాపురం వాసులు సుబ్బిరెడ్డి, శ్రీనాథ్, పక్రుద్దీన్ ఫిర్యాదు చేశారు. కొందరు నేతలు ఇంటి నిర్మాణం పేరుతో రోజూ పదుల సంఖ్యలో ఇసుకను పాపాఘ్ని నుంచి ఇసుకను డంప్ చేసి రాత్రిళ్లు కర్ణాక సరిహద్దు గ్రామాలకు తరలించి సొమ్ము చేసుకుంటున్నారన్నారు. డంప్ చేసిన ఇసుకను సీజ్ చేసి అక్రమ నిర్మాణాన్ని అడ్డుకోవాలని గ్రామస్తులు కోరారు.

వైభవంగా మహాచండీ హోమం


పుర్ణాహుతి చేస్తున్న వేదపండితులు

పెద్దతిప్పసముద్రం అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): విసనకర్రవాండ్లపల్లెలో శుక్రవారం మహాచండీ హోమం వైభవంగా నిర్వహించారు. గ్రామంలో ఆర్య వైశ్యులు దేవకీ వెంకటేష్, దేవకీ కల్పన దంపతులు తమ పూర్వీకుల జ్ఞాపకార్థం గత నెల 12వ తేదీన ఆలయంలో అమ్మవార్ల నూతన విగ్రహాలను ప్రతిష్ఠించారు. 41 రోజుల పాటు పూజా కార్యక్రమాలను గ్రామస్తులందరు చేశారు. మండలం పూర్తి అయిన సందర్భంగా శుక్రవారం ఆలయ నిర్మాణ దాతలైన దేవకీ వెంకటేష్ కుటుంబ సభ్యులతో కలిసి తిరుపతికి చెందిన వేదపండితులచే ఉదయం నుంచి ఆలయంలో అమ్మవార్లకు విశేష పూజలు, మహాచండీ హోమం, కలశ స్థాపన, నవకన్య పూజలను నిర్వహించారు. తిరుపతి వేద పండితులు శ్రీకాంత్‌స్వామి, సోమశేఖర్ స్వామి, దివ్యతేజ స్వామి, సిద్ధార్థ స్వాములు వేద మంత్రోచ్చారణల నడుమ అమ్మవార్లకు పూజలు నిర్వహించారు. మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవార్లకు చీరసారె సమర్పించారు. భక్తులకు తీర్థప్రసాదాలు, అన్నదానం నిర్వహించారు. ఈనెల 7,8 తేదీల్లో అమ్మవార్లకు గ్రామస్తులు జ్యోతులను మోసి జాతరను నిర్వహిస్తారని ఆలయ నిర్మాణ దాత దేవకీ వెంకటేష్ తెలిపారు. తమ కుటుంబ సభ్యులతో కలిసి గ్రామస్తులు నిర్వహించే జాతరలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు కృషి చేస్తామన్నారు.

స్కూటర్ ఢీ... వృద్ధుడు మృతి

చాపాడు, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కేతవరం గ్రామంలో ఈనెల 2న గురువారం రాత్రి మోటారు సైకిల్ ఢీకొనడంతో పండిటి వరప్రసాద్ (70) అనే వృద్ధుడు మృతి చెందాడు. పోలీసుల వివరాల మేరకు.. వరప్రసాదు గ్రామం వెలుపల ఉన్న బహిర్భూమికి వెళుతుండగా వెనుకవైపు నుంచి వచ్చిన మోటారు సైకిల్ ఢీకొనడంతో తీవ్ర గాయాలయ్యాయి. చికిత్స కోసం 108 వాహనంలో ప్రొద్దుటూరు జిల్లా ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందాడు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

వేంపల్లెలో గోహింస.. పోలీసులకు ఫిర్యాదు


ఆటోకు కట్టేసి ఈడ్చుకెళ్తున్న దృశ్యం

వేంపల్లె, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): వేంపల్లె పట్టణంలో శుక్రవారం ఉదయం ఓ గోవును ఆటోకు కట్టి ఈడ్చు కెళుతూ హింసించిన వ్యక్తు లపై పోలీసులకు ఫిర్యాదు చేశారు. స్థానిక జిల్లా పరిషత్ బాలుర హైస్కూల్ వద్ద పడుకొని ఉన్న గోవును మదీనాపురం ప్రాంతానికి చెందిన ముగ్గురు వ్యక్తులు తాడుతో కట్టేసి ఈడ్చుకెళ్తుండగా రిటైర్డ్ ఆర్మీ ఉద్యోగి అనిల్ అడ్డుకొని అధికారులకు, పోలీసులకు సమాచారం ఇచ్చారు. గోవును విడిపించి స్థానిక పశువైద్య సిబ్బందిని పిలిపించి చికిత్స చేయించారు. అనంతరం గోవును హింసించిన వ్యక్తులపై పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి కఠినంగా చర్య లు తీసుకోవాలని కోరారు. అలాగే స్థానిక ఈఓ నాగభూషణంరెడ్డి, స్థానిక ప్రజలు పోలీస్ స్టేషన్‌కు వెళ్లి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని కోరారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

- ముగ్గురికి గాయాలు


దేవేందర్‌రెడ్డి మృతదేహం

వీరపునాయునిపల్లె, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని ఎన్.పాలగిరి గ్రామానికి సమీపంలో శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో రామిరెడ్డి దేవేందర్‌రెడ్డి (19) అనే యువకుడు మృతి చెందగా, ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి. పోలీసుల వివరాల మేరకు.. వేంపల్లె మండలం ముత్తుకూరు గ్రామానికి చెందిన దేవేందర్‌రెడ్డి, వీరకుమార్‌రెడ్డి కలిసి పల్సర్ బైకులో పెట్రోల్ కోసం వీరపునాయునిపల్లెకు వస్తుండగా పాలగిరి మార్గమధ్యలో వెనుకవైపు నుంచి వస్తున్న లారీ ఢీకొంది. దీంతో పల్సర్ బైకు అదుపుతప్పి ప్రొద్దుటూరు నుంచి స్కూటీలో నారేపల్లెకు వస్తున్న స్కూటీని ఢీకొంది. ఈ సంఘటనలో దేవేందర్‌రెడ్డి మృతి చెందగా, వీరకుమార్‌రెడ్డికి తీవ్ర గాయాలయ్యా యి. మెరుగైన చికిత్స కోసం కర్నూలు ఆసుపత్రికి రెఫర్ చేశారు. అలాగే స్కూటీలో వస్తున్న ధర్మారెడ్డి అతని చెల్లెలుకు గాయాలయ్యాయి. వీరు ప్రొద్దుటూరు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. మృతుడి తండ్రి రామగంగిరెడ్డి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

పేద కళాకారులను ఆదుకోవాలి

పీలేరు రూరల్, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): పేద కళాకారులను ప్రభుత్వం ఆదుకోవాలని శ్రీలక్ష్మీనాట్య కళామండలి చైర్మన్ కత్తి రామలింగారెడ్డి కోరారు. శుక్రవారం పీలేరు పట్టణ శివారు ప్రాంతం తిరుపతి మార్గంలో లక్ష్మీవెంకటేశ్వర నాట్య కళామండలి కార్యాలయాన్ని ప్రారంభించిన ఆయన మాట్లాడుతూ కళలే జీవనాధారంగా ఎంచుకుని జీవిస్తున్న గ్రామీణ ప్రాంత పేద కళాకారులకు ప్రభుత్వం చేయూతనివ్వాలని కోరారు. త్వరలోనే 5 వేల మంది కళాకారులతో వివిధ రకాల ప్రదర్శనలు చేస్తూ భారీ ర్యాలీ చేయనున్నట్లు ఆయన చెప్పారు. పేద కళాకారులకు ప్రభుత్వం పెన్షన్లు, ఇండ్ల స్థలాలు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. అంతరించి పోతున్న గ్రామీణ కళలను కాపాడుకోవాల్సిన గురుతర బాధ్యత మనపై ఉందని తెలిపారు. కార్యక్రమంలో కళాకారులు శ్రీనివాసులు, రామాంజనేయరెడ్డి, మనోహర్, కృష్ణయ్య, నారాయణ తదితరులు పాల్గొన్నారు.

రైతు ఉత్పత్తిదారుల సంఘాలు బలోపేతం కావాలి

- సెర్ప్ అడిషనల్ సీఈవో



సమావేశంలో మాట్లాడుతున్న పీడీ రాజ్యలక్ష్మి

కడప ఎన్టీఆర్ సర్కిల్, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): రైతు ఉత్పత్తిదారుల సంఘాలు మరింత బలోపేతం కావాలని రాష్ట్ర పేదరిక నిర్మూలన సంస్థ (సెర్ప్) అదనపు సీఈవో శ్రీరాములునాయుడు అన్నారు. స్థానిక టీటీడీసీలో కడప-అన్నమయ్య జిల్లాల్లోని రైతు ఉత్పత్తిదారుల సంఘాల ప్రతినిధులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా రైతు ఉత్పత్తదారుల సంఘాలు చేపట్టిన ప్రగతిని సమీక్షించారు. అనంతరం డీఆర్‌డీఏ పీడీ డాక్టర్ రాజ్యలక్ష్మి మాట్లాడుతూ రైతు ఉత్పత్తిదారుల సంఘాల ద్వారా మరింత నాణ్యతతో కూడిన దిగుబడులు సాధించాల్సిన అవసరం ఉందన్నారు. వాటా మూల ధనం నుంచి రుణాలు అందించడంలో నగదు లావాదేవీలు చేయకూడదని సూచించారు. ఇప్పటి నుంచి నెల లోపు అన్ని చట్టబద్ధమైన లైసెన్సులు పొందాలన్నారు. పంటల వారీగా రైతులు చేపట్టిన పంటల పోషక విధానంపై శిక్షణలు నిర్వహించారని, మిగతా రైతులు కూడా దీన్ని అలవరుచుకునేలా అవగా హన తీసుకురావాలన్నారు. రైతు ఉత్పత్తి సంఘ సభ్యుల నుంచి అనుభవం ఉన్న 15 మందిని బోర్డు డైరెక్టరుగా నియమించుకోవాలని సూచించారు. ఉన్నతాధికారులతో సంభా షించగల అనుభవజ్ఞులైన చొరవ గల రైతులను గుర్తించి 15 మంది సభ్యులతో ఒకబోర్డు ఏర్పాటు చేసినట్లు చెప్పారు. కార్యక్రమంలో అన్నమయ్య జిల్లా డీఆర్‌డీఏ పీడీ నాగేశ్వర్‌రావు, రెండు జిల్లాల డీపీఎంలు, ఏపీయంలు, సీసీలు, తదితరులు హాజరయ్యారు.

రెండు లారీలు ఢీ - తప్పిన పెను ప్రమాదం

పీలేరు, అక్టోబరు 3(ఆంధ్రజ్యోతి): పీలేరు వైపు నుంచి చిత్తూరు వైపు వెళుతున్న లారీ ఒక కారు, మరో ఆటోను ఢీకొన్నాయి. శుక్రవారం పీలేరు వద్ద జరిగిన సంఘటనపై పోలీసుల కథనం మేరకు కర్నూలుకు చెందిన అరుణాదేవి, యతీంద్ర వర్మ దంపతులు కర్నూలు నుంచి చిత్తూరుకు వెళుతుండగా పీలేరు శివార్లలోని రిలయన్స్ పెట్రోలు బంకు వద్ద వారి కారును ఎదురుగా వస్తున్న సిమెంటు లారీ ఢీకొంది. కారుతోపాటు దాని వెనకాలే వస్తున్న ఆటోను సైతం ఢీకొంది. ఈ సమయంలోనే ప్రమాదానికి గురైన అదే లారీని ఎదురుగా వస్తున్న మరో లారీ ఢీకొంది. ప్రమాదంలో దంపతులిద్దరికీ స్వల్ప గాయాలు కాగా మరో లారీ, ఆటోలోని వారు సురక్షితంగా బయటపడ్డారు. ప్రమాద తీవ్రతకు కారు ముందు భాగం నుజ్జునుజ్జు అయ్యింది. పీలేరు పోలీసులు కేసు నమోదు చేశారు.

ఆర్ఓబీ పెండింగ్ పనులపై ఎమ్మెల్యే ఆరా

పీలేరు, అక్టోబరు 3(ఆంధ్రజ్యోతి): పీలేరులోని ఆర్ఓబీ పనులకు ఆటంకంగా నిలిచిన సమస్యలు, వాటి పరిష్కార మార్గాలపై ఎమ్మెల్యే నల్లారి కిశోర్ కుమార్ రెడ్డి దృష్టి సారించారు. మండల టీడీపీ అధ్యక్షుడు వారణాశి శ్రీకాంత్ రెడ్డి, ప్రముఖ కాంట్రాక్టరు శ్రీహరి రెడ్డి శుక్రవారం ఎన్‌హెచ్ అధికారులతో సమావేశమయ్యారు. చిత్తూరు, మదనపల్లె మార్గాల్లోని ఆర్ఓబీలకు అడ్డంకిగా నిలిచిన కోర్టు కేసులు, రెవెన్యూ సమస్యలు, స్థానిక ప్రజల అభ్యంతరాలపై వారు చర్చించారు. ఎన్‌హెచ్ ఈఈ శ్రీనివాసులు, ఏఈ మాధవన్ తదితరులు పాల్గొన్నారు.

పీలేరును రెవెన్యూ డివిజన్ చేయాలి

కలికిరి, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): అన్ని రంగాల్లో వేగంగా అభివృద్ధి చెందుతున్న పీలేరులో కొత్త రెవెన్యూ డివిజన్ ఏర్పాటు చేయాలని పలు ప్రజా సంఘాల నేతలు కోరారు. పీలేరు రెవెన్యూ డివిజన్ సాధన కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం నగరిపల్లెలో ఎమ్మెల్యే నల్లారి కిశోర్‌కుమార్ రెడ్డిని కలిసి ఈ మేరకు వినతి పత్రాన్ని అందజేశారు. జిల్లాల పునర్వ్యవస్థీకరణలో భాగంగా మదనపల్లె జిల్లా కేంద్రంగా ఏర్పాటయ్యే అవకాశమున్న నేపథ్యంలో పీలేరులో రెవెన్యూ డివిజన్ కార్యాలయాన్ని ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. కొత్త జిల్లాతోపాటు పీలేరు రెవెన్యూ డివిజన్ ఏర్పాటుకు కృషి చేయాలని ఎమ్మెల్యేని కోరారు.

నేడు పీలేరులో 'ఆటో డ్రైవర్ల సేవలో...'

పీలేరు, అక్టోబరు 3(ఆంధ్రజ్యోతి): ఆటో డ్రైవర్లకు రూ.15 వేల ఆర్థిక సాయం అందించే 'ఆటో డ్రైవర్ల సేవలో...' పథకాన్ని శనివారం ఎమ్మెల్యే నల్లారి కిశోర్ కుమార్ రెడ్డి ప్రారంభిస్తారని ఎంపీడీఓ రాజేశ్వరి తెలిపారు. పీలేరు మార్కెట్ కమిటీ ఆవరణలో శనివారం ఉదయం 10 గంటలకు జరిగే కార్యక్రమంలో ఆటో డ్రైవర్లు పాల్గొనాలని ఆమె తెలిపారు. పీలేరు ఎంవీఐ విజయలక్ష్మి, టీడీపీ నేతలతో కలిసి ఆమె సభ ఏర్పాట్లను శుక్రవారం పరిశీలించారు. పీలేరు మండలంలో 713, కలికిరిలో 320, కలకడలో 136, వాల్మీకిపురంలో 213, కేవీపల్లెలో 220, గుర్రంకొండలో 146 మందికి ఆర్థిక సాయం అందించనున్నట్లు వివరించారు. ఏఎంసీ చైర్మన్ పురం రామ్మూర్తి, సభ్యులు కిశోర్ నాయుడు, టీడీపీ మండలాధ్యక్షులు వారణాశి శ్రీకాంత్ రెడ్డి, మాజీ మండలాధ్యక్షుడు అమరనాథరెడ్డి పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయం

మహాత్మాగాంధీ విగ్రహ ఆవిష్కరణలో ఎమ్మెల్యే


చింతపర్తిలో మహాత్మాగాంధీ విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే నల్లారి కిశోర్‌కుమార్‌రెడ్డి

వాల్మీకిపురం, అక్టోబరు 3(ఆంధ్రజ్యోతి): తనను ఎంతగానో ఆదరించిన ప్రజల సమస్యల పరిష్కారమే తన ధ్యేయమని పీలేరు ఎమ్మెల్యే నల్లారి కిశోర్‌కుమార్‌రెడ్డి పేర్కొన్నారు. గురువారం చింతపర్తిలో సర్పంచ్ మహితశేషాద్రిరెడ్డి ఆధ్వర్యంలో మహాత్మాగాంధీ విగ్రహం ఆవిష్కరణ, ప్రజల సౌకర్యార్థం బస్ షెల్టర్‌ను ఆయన ప్రారంభించారు. ఈసందర్భంగా మహాత్మాగాంధీ విగ్రహానికి నివాళులర్పించారు. అనంతరం వృద్ధాప్యంలో పెన్షన్ తీసుకుంటూ చనిపోయిన వారి కుటుంబాలకు పింఛన్లు పంపిణీ చేశారు. గొల్లపల్లెలో విరూపాక్షమ్మ ఆలయంలో ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. తోటవీధికి చెందిన విజయకుమార్ మృతి పట్ల సంతాపం తెలియజేస్తూ కుటుంబీకులను పరామర్శించి భరోసా కల్పించారు. కార్యక్రమంలో మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్, టీడీపీ సీనియర్ నేత కంభం నిరంజన్‌రెడ్డి, రాష్ట్ర కురబ కార్పొరేషన్ డైరెక్టర్ వల్లిగట్ల వెంకటరమణ, మార్కెట్ చైర్మన్ చంద్రమౌళి, మండల పార్టీ అధ్యక్షుడు మల్లికార్జునరెడ్డి, నేతలు ద్వారకనాథరెడ్డి, శేషాద్రిరెడ్డి, పీవీ నారాయణ, మురళి, రాజేంద్రాచారి, తదితర కూటమి పార్టీల నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వాల్మీకిపురం పాతబస్టాండ్ ప్రాంగణంలోని మహాత్మాగాంధీ విగ్రహానికి నేతలు న్యాయవాదులు, యువత, విశ్రాంత ఉద్యోగులు, స్వచ్ఛంద సంస్థల సభ్యులు నివాళులర్పించారు.

మైనర్లు వాహనాలు నడిపితే చర్యలు

కురబలకోట, అక్టోబరు 3(ఆంధ్రజ్యోతి): బాలురు వాహనాలు నడిపితే చర్యలు తీసుకుంటామని ఎస్ఐ దిలీప్‌కుమార్ అన్నారు. అంగళ్లులో బాలురకు అవగాహన చేపట్టిన ఆయన మాట్లాడుతూ ఇటీవల మైనర్లు వాహనాలు నడుపుతున్నారని, వీటి వలన ప్రమాదాలు జరిగే ప్రమాదం ఉందన్నారు. వాహనాలు నడిపితే తల్లిదండ్రులపై కేసులు నమోదు చేయడం, జరిమానా విధిస్తామన్నారు. కావున విద్యార్థులు తమ భవిష్యత్తును కోల్పోయే ప్రమాదం ఉందన్నారు. కొందరు వీటిని ప్రోత్సహిస్తున్నట్లు తమ దృష్టికి వచ్చిందన్నారు.

శిక్షణ పూర్తి చేస్తేనే ఉద్యోగం

- పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ విజయరామరాజు

కడప ఎడ్యుకేషన్, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): మెగా డీఎస్సీ ద్వారా ఇటీవల ఎంపికైన కొత్త టీచర్లకు శిక్షణ తప్పనిసరి. శిక్షణ పూర్తిచేసిన తర్వాతే వారికి నియామకపు ఉత్తర్వులు జారీ చేస్తామని ఇటీవల జిల్లా విద్యాశాఖ అధికారులతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ విజయరామరాజు స్పష్టం చేశారు. వీరికి శుక్రవారం శిక్షణ ప్రారంభమైంది. 10వ తేదీ వరకు ఈ శిక్షణ ఉంటుంది. ఏదైనా కారణంతో శిక్షణకు మినహాయింపు కోరితే అనుమతిస్తారు. అయితే వారి కోసం తర్వాత మళ్లీ శిక్షణ కల్పిస్తారు. ఉపాధ్యాయ పోస్టులు ఖాళీగా ఉన్న పాఠశాలల్లో కొత్తవారిని నియమిస్తారు. ఈ ఏడాది జూన్‌లో జరిగిన బదిలీల్లో భాగంగా ఏదైనా పాఠశాలలకు చెందిన ఉపాధ్యాయులంతా బదిలీలు కోరి ఇంకా రిలీవర్ రాని కారణంగా అక్కడే పనిచేస్తుంటే.. అలాంటి చోట కొత్తవారికి మొదట ప్రాధాన్యత కల్పిస్తారు. కేటగిరీ 3, 4 ప్రాంతాల్లోనే ప్రాధాన్యత క్రమంలో నియమించాలని నిర్ణయించారు. సెప్టెంబరు 30 నాటికి ఖాళీలను పరిగణనలోకి తీసుకుని ఆన్‌లైన్‌లో ఖాళీల వివరాలను అప్‌లోడ్ చేయాలని విద్యాశాఖ అధికారులను ఆదేశించారు. కాగా.. జిల్లాలో ఎంపికైన 680 మంది నూతన ఉపాధ్యాయులకు శిక్షణ మొదలైంది. వీరిలో ఎస్జీటీ తెలుగు, ఉర్దూ విభాగాలకు కడపనగర శివారులోని గ్లోబల్ ఇంజనీరింగ్ కళాశాలలో శిక్షణ ఇస్తున్నారు. అలాగే స్కూల్ అసిస్టెంట్, ఫిజికల్ ఎడ్యుకేషన్‌కు సంబంధించి అన్నమయ్య జిల్లా మదనపల్లె పట్టణం పుంగనూరు రోడ్డులో ఉన్న గ్రీన్ వ్యాలీ ఇంటర్నేషనల్ స్కూల్లో శిక్షణ ప్రారంభించారు. శిక్షణ సమయంలోనే వారికి కౌన్సెలింగ్ నిర్వహించి పోస్టులు ఇస్తారు. ఈనెల 13 నుంచి కొత్త టీచర్లు విధులకు హాజరుకానున్నారు.

మరోవైపు మెగా డీఎస్సీ తుది జాబితాపై ఏమైనా అభ్యంతరాలుంటే అభ్యర్థులు అక్టోబరు 25 వరకు తెలుపవచ్చని డీఎస్సీ కన్వీనర్ ఎంవీ కృష్ణారెడ్డి తెలిపారు. ఇందుకోసం జిల్లా స్థాయి పోస్టులకు ఆర్జేడీ, ఇద్దరు డీఈఓలతో జోనల్ కమిటీ, రాష్ట్ర స్థాయి పోస్టులకు ముగ్గురు రాష్ట్రస్థాయి అధికారులతో కమిటీ లను నియమించినట్లు పేర్కొన్నారు. ఈ కమిటీలు 15 రోజుల్లో ఫిర్యాదులను పరిష్కరిస్తాయన్నారు. అభ్యర్థులు జోనల్ స్థాయి కమిటీ నిర్ణయంపై సంతృప్తి చెందకపోతే రాష్ట్రస్థాయి కమిటీకి అప్పీల్‌చేసుకోవచ్చని, రాష్ట్రస్థాయి కమిటీ నిర్ణయంపైన సంతృప్తి చెందక పోతే తుది అప్పిలేట్ అథారిటీ (పాఠశాల విద్య డైరెక్టర్)కు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. తుది అప్పిలేట్ అథారిటీ ఈ ఫిర్యా దులను 30 రోజుల్లో పరిష్కరిస్తుందని డీఎస్సీ కన్వీనర్ వివరించారు.

వేడుకగా విజయదశమి

● వైభవంగా గ్రామోత్సవం ● భక్తులతో కిటకిటలాడిన ఆలయాలు ● కురబలకోటలో కన్యకాపరమేశ్వరీ శయనోత్సవం

పీలేరు, అక్టోబరు 3(ఆంధ్రజ్యోతి): మండలంలో శరన్నవరాత్రి ఉత్సవాలు వైభవంగా ముగిశాయి. గురువారం గ్రామదేవత రౌద్రాల అంకాలమ్మ, మోడల్ కాలనీ యల్లమ్మ తల్లి, ఇందిరమ్మ కాలనీ దిన్ని గంగమ్మ, బండ్లవంక నడివీధి గంగమ్మ రాజరాజేశ్వరిగా, నెహ్రూబజారులోని కన్యకా పరమేశ్వరి అమ్మవారు విజయలక్ష్మిగా భక్తులకు దర్శనమిచ్చారు. రౌద్రాల అంకాలమ్మ, కన్యకా పరమేశ్వరి అమ్మవారికి ఉయ్యాల సేవ చేశారు. నడివీధి గంగమ్మను పురవీధుల్లో ఊరేగించారు. కాశీ విశాలాక్షి సమేత శివాలయం, చౌడేశ్వరీ, అగ్రహారం అష్టలక్ష్మీ సమేత నరసింహ స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. కన్యకా పరమేశ్వరి ఆలయంలో మహిళలు వసంతోత్సవం నిర్వహించారు. కార్యక్రమాల్లో ఆలయాల కమిటీ చైర్మన్‌లు కె.రామకృష్ణా రెడ్డి, దేవిరెడ్డి వెంకట రమణా రెడ్డి, రామిరెడ్డి, వెంకటమ్మ, శేఖర, ఈఓ మంజుల, సభ్యులు పాల్గొన్నారు.





పీలేరులో నడివీధి గంగమ్మ వారి ఊరేగింపు, బి.కొత్తకోటలో దుర్గామాత ఎదుట ఆలపిస్తున్న మార్వాడీ మహిళలు - విజయలక్ష్మిగా కన్యకా పరమేశ్వరి (పీలేరు)

భక్తులతో ఆలయాలు కిటకిట



విశేషాలంకరణలో నల్లవీరగంగాభవాని (వాల్మీకిపురం)

వాల్మీకిపురం, అక్టోబరు 3(ఆంధ్రజ్యోతి): మండల వ్యాప్తంగా విజయదశమి పండుగ వేడుకలను వైభవంగా చేసుకున్నారు. నల్లవీరగంగా భవాని, లక్ష్మీకామేశ్వరస్వామి, గండబోయనపల్లె సత్యమ్మ తల్లి, వాల్మీకి నగర్‌లోని బోయకొండ గంగమ్మ, చింతపర్తి, వాల్మీకిపురం వాసవీ కన్యకాపరమేశ్వరి అమ్మవారి, గొల్లపల్లె, విరూపాక్షమ్మతల్లి ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాయినగర్‌లోని షిరిడీసాయి బాబాను నగరోత్సవం చేశారు. కార్యక్రమాల్లో ఆలయాల ధర్మకర్తలు మొగ్రంరెడ్డి రామ్‌కుమార్‌రెడ్డి, పులి సత్యారెడ్డి, కువైట్ శంకరాచారి, తబ్జాల సతీష్, కాంతరాజు శెట్టి, అర్చకులు గోనవరపు శీనా స్వామి, ఉత్తన్నస్వామి, జనార్ధన స్వామి, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

రాజరాజేశ్వరి దేవిగా రెడ్డెమ్మ అమ్మవారు

గుర్రంకొండ, అక్టోబరు 3(ఆంధ్రజ్యోతి): సంతానలక్ష్మీ రెడ్డెమ్మ అమ్మవారు రాజరాజేశ్వరి దేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. అమ్మవారిని పరిమళ భరిత పుష్పాలతో ప్రత్యేకంగా అలంకరించగా రాజరాజేశ్వరిదేవిగా భక్తులను అనుగ్రహించారు. పోలేరమ్మ అమ్మవారు రాజరాజేశ్వరి దేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. అమ్మవారిని పురవీధుల్లో ఊరేగించారు. ఆలయాల్లో భక్తులు తీర్థప్రసాదాలను స్వీకరించారు.

మహిషాసురమర్దినిగా...

కలకడ, అక్టోబరు 3(ఆంధ్రజ్యోతి): కోనలో కొలువైన చౌడేశ్వరి దేవి గురువారం మహిషాసురమర్దినిగా భక్తులను కటాక్షించారు. కలకడ సిద్దేశ్వర ఆలయంలో కామాక్షి అమ్మవారిని దుర్గాదేవిగా అలంకరించి భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. సుబ్రమణ్యం స్వామి, విజయసారథి, మద్దిపట్ల వెంకటరమణనాయుడు, తదితరులు పాల్గొన్నారు.

కలికిరిలో వైభవంగా....



గుండ్లూరు మూలస్థానమ్మ (కలికిరి)

కలికిరి, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): మండలంలో విజయదశమిని పురస్కరించుకుని వైభవంగా ఉత్సవాలను నిర్వహించారు. గ్రామ దేవత యల్లమ్మ రాజరాజేశ్వరీదేవిగా దర్శనమిచ్చారు. గుండ్లూరులోని మూలస్థానమ్మ ఆలయంలో విజయదశమి వేడుకలు నిర్వహించారు. సోమేశ్వర ఆలయంలో పార్వతీదేవిని మహిషాసురమర్దినిగా భక్తులు దర్శించుకున్నారు. అంకాలమ్మ ఆలయంలో అమ్మవారిని అలంకరించారు. అన్న ప్రసాదం పంపిణీ చేశారు.

మదనపల్లెలో ఉత్సవాలు

మదనపల్లె అర్బన్, అక్టోబరు3(ఆంధ్రజ్యోతి): నీరుగట్టువారిపల్లెలో చౌడేశ్వరీదేవి ఆలయంలో గురువారం ప్రత్యేకాలంకరణలో అమ్మవారు దర్శనం ఇచ్చారు. సాయంత్రం రాజరాజేశ్వరీ దేవిగా భక్తులకు దర్శనం కల్పించారు. కార్యక్రమాలను ఆలయ కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు పురాణం చంద్రశేఖర్, బండి పవన్‌కుమార్ ఉపాధ్యక్షులు మోడెం సిద్దప్ప, ఉప్పు రామచంద్ర, ఆర్ నీలకంఠ, కొరమట్ల నాగరాజ, కమలమరి కృష్ణ, మార్కెట్ కమిటీ ఉపాధ్యక్షుడు రామిశెట్టి ఆంజనేయులు, శీలం రమేష్‌బాబు పర్యవేక్షించారు. కోర్టులో గంగమ్మను సాయంత్రం గాజులతో అంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. కమిటీ అధ్యక్షుడు పెరవలి వేణుగోపాల్ నాయుడు, కార్యదర్శి ప్రభాకర్ నాయుడు సభ్యులు పర్యవేక్షించారు. కన్యకాపరమేశ్వరీ దేవి ధనలక్ష్మీగా భక్తులను అనుగ్రహించారు. కార్యక్రమాలను ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు ఓంప్రకాష్, కార్యదర్శి దేవతా సతీష్ పర్యవేక్షించారు. సోమేశ్వర స్వామి, రాజరాజేశ్వరీ ఆలయాల్లో అమ్మవారిని రాజరాజేశ్వరీగా అలంకరించారు. ప్రసన్న వెంకటరమణ స్వామి ఆలయంలో మూలవిరాట్టును అభిషేకించి, ప్రత్యేక పూలతో అలంకరించారు. ఆలయ ఈఓ రమణ, కమిటీ మాజీ అధ్యక్షుడు బిజేపాండు, విశ్వబ్రాహ్మణ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ రామకృష్ణ కార్యక్రమాలను పర్యవేక్షించారు. బాట గంగమ్మ ఆలయంలో రాజరాజేశ్వరిగా భక్తులకు దర్శనం కల్పించారు. కమ్మగడ్డవీధి, నాగిరెడ్డి వీధి, బుగ్గవంక సమీపంలో, నీరుగట్టువారిపల్లెలోని తారక లే అవుట్లో దుర్గమ్మ మండపాల్లో హోమాలు, పూజలు నిర్వహించారు. గురువారం రాత్రి డీజేలు, చెక్కభజనల నడుమ అమ్మవారిని ఊరేగించారు. నియోజకవర్గ వైసీపీ ఇన్‌చార్జ్ నిస్సార్ అహ్మద్, బీసీ కమిషన్ మెంబరు శేషాచలపతి నాయుడు, సుగుణ, ఆంజనేయులు పాల్గొన్నారు. శనివారం దుర్గమ్మను ఊరేగించి కొత్తపల్లె చెరువులో నిమజ్జనం చేయనున్నట్లు తెలిపారు.



గాజుల అలంకరణలో కోర్టులో గంగమ్మ (మదనపల్లె)

విజయదుర్గా భవానిగా మాతమ్మతల్లి

నిమ్మనపల్లి అక్టోబరు 3(ఆంధ్రజ్యోతి): నవరాత్రి ఉత్సవాల్లో పెద్దహరిజనవాడలో వెలసిన మాతమ్మతల్లి విజయదుర్గా భవానీగా భక్తులకు దర్శనమిచ్చారు. అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి పూజలు నిర్వహించారు.



విశేషాలంకరణలో రాజరాజేశ్వరీ దేవి (మదనపల్లె)

శయనోత్సవంలో అమ్మవారు

కురబలకోట, అక్టోబరు 3(ఆంధ్రజ్యోతి): దసరాశరన్నవరాత్రోత్సవాల్లో కన్యకాపరమేశ్వరికి శయనోత్సవం చేశారు. కన్యకాపరమేశ్వరీ ఆలయంలో అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు. నాగరాజగుప్త, రామకృష్ణ, బాలకృష్ణ సేతు మాధవ్, మారుతీ కుమార్, రామ్మోహన్, రాధారాణి, పుష్పలత, సరళ పాల్గొన్నారు.

గంగమ్మకు సారె సమర్పణ

బి.కొత్తకోట, సెప్టెంబరు3 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో విజయదశమి వేడుకలు అత్యంత వైభవంగా నిర్వహించారు. గురువారం అమ్మవారికి సారె సమర్పణ జరిగింది. జ్యోతి సర్కిల్‌లో ప్రతిష్ఠించిన దుర్గామాత నుంచి పట్టణంలోని నల్ల గంగమ్మ ఆలయానికి సారె వెళ్లగా పట్టణంలోని పలు అమ్మవార్ల ఆలయాల నుంచి జ్యోతిసర్కిల్ దుర్గా మాతకు సారె సమర్పణ జరిగింది. శుక్రవారం మార్వాడీల శక్తి సంకీర్తన, చిన్నారుల భరతనాట్యం అలరించాయి.



కొత్తపల్లెలో దుర్గమ్మ ఊరేగింపు (మదనపల్లె)






శయన సేవలో కన్యకాపరమేశ్వరీ అమ్మవారు (కురబలకోట) - వసంతోత్సవంలో ఆర్యవైశ్య మహిళలు (పీలేరు) - గంగమ్మకు సారె సమర్పిస్తున్న భక్తులు (బి.కొత్తకోట)
గండబోయనపల్లెలో సత్యమ్మతల్లి అమ్మవారి ఊరేగింపు (వాల్మీకిపురం)

అలరించిన బొమ్మల కొలువు



ఈస్ట్‌కొత్తపేటలో ఇంట్లో ఏర్పాటు చేసిన బొమ్మల కొలువు

మదనపల్లె అర్బన్, అక్టోబరు 3: విజయదశమిని పురస్కరించుకుని ఈస్ట్ కొత్తపేటలో ఇంట్లో గృహిణి ఏర్పాటు చేసిన బొమ్మల కొలువు అలరించింది. గురువారం దసరా సందర్భంగా ఓలేటి జ్యోతి చెక్కబొమ్మలు, వేర్వేరు ఆకృతుల్లో అమ్మవార్లు, దేవతల బొమ్మల కొలువు ఏర్పాటు చేసి పూజలు నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ ఏటా దసరాకు ఇంట్లో బొమ్మల కొలువు ఏర్పాటు చేయడం ఆనవాయితీగా వస్తోందన్నారు. చిప్పిలి గ్రామంలోని మడిక్యయల శివాలయం ప్రధాన అర్చకుడు విశ్వేశ్వర ప్రసాద్ బొమ్మల కొలువు ఏర్పాటు చేశారు. ఇందులో శివపార్వతులు, వివిధ దేవతా మూర్తుల ఆకృతులు నెలకొల్పారు.

పేదలపాలిట సంజీవిని సీఎం సహాయ నిధి

కలికిరి, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): ఆర్థిక సమస్యలతో రాష్ట్ర ఖజానా కొట్టుమిట్టాడుతున్నా పేదలను ఆదుకునేందుకు సీఎం చంద్రబాబు నాయుడు వెనకాడటం లేదని ఎమ్మెల్యే కిశోర్‌కుమార్ రెడ్డి చెప్పారు. పేదల ఆరోగ్యం కోసం ఆర్థిక సహాయాన్ని మంజూరు చేయించడానికి తనకు కలిగిన అవకాశంతో నిరంతరం కృషి చేస్తున్నట్లు చెప్పారు. శుక్రవారం నగరిపల్లెలో 25 మందికి మంజూరైన సీఎంఆర్ఎఫ్ చెక్కులను ఆయన పంపిణీ చేశారు.

మైనర్లు వాహనాలు నడిపితే చర్యలు

● తల్లిదండ్రులపై కేసులు నమోదు చేస్తాం : డీఎస్పీ



మైనర్లకు, తల్లిదండ్రులకు కౌన్సిలింగ్ ఇస్తున్న డీఎస్పీ మహేంద్ర, పోలీసులు

మదనపల్లెఅర్బన్, అక్టోబరు 3(ఆంధ్రజ్యోతి): మైనర్లు వాహనాలు నడిపితే చర్యలు తప్పవని మదనపల్లె డీఎస్పీ హెచ్చరించారు. శుక్రవారం డీఎస్పీ కార్యాలయంలో వాహనాలు నడుపతూ పట్టుపడిన మైనర్లు, వారి తల్లిదండ్రులకు డీఎస్పీ కౌన్సిలింగ్ ఇచ్చారు. మైనర్లు వాహనాలు నడపడం చట్ట విరుద్ధమని, వారిని ప్రోత్సహిస్తూ వాహనాలు ఇచ్చిన తల్లిదండ్రులపై కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. మదనపల్లె డివిజన్ పరిధిలో 80 వాహనాలు మైనర్లు నడుపుతున్నట్లు గుర్తించి వాహనాలను స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు. వారిని పిలిపించి కౌన్సిలింగ్ ఇచ్చిన అనంతరం వాహనాలు ఇచ్చినట్లు చెప్పారు. కొన్ని వాహనాలను స్పేర్ పార్టులు మార్చి శబ్ధం వచ్చేలా వాహనాలు నడుపుతునాన్నరని దీనిని పోత్సహిస్తున్న మెకానిక్స్‌పై కూడా కేసులు నమోదు చేస్తామన్నారు. అలాగే త్వరలో మెకానిక్స్ పిలిచి వారికి జాగ్రత్తలు, సూచనలు తెలియ జేస్తామన్నారు. చాలా మంది యువత బైక్‌పై త్రిపుల్ రైడింగ్, రాత్రి పూట బైపాస్‌లో బైక్ రైడింగ్ నిర్వహిస్తున్నారని తమ దృష్టికి వచ్చిందని ఇలాంటివి మానుకోవాలని యువతకు సందేశం చేశారు. ఇక పై మైనర్లు వాహనాలు నడుపుతూ పట్టుపడితే కేసులు తప్పని హెచ్చరించారు. కార్యక్రమంలో వన్‌టౌన్ సీఐ మహమ్మద్ రఫీ, ఎస్ఐ అన్సర్‌బాషా, టూటౌన్ ఎస్ఐ రహిముల్లా, తదితరులు పాల్గొన్నారు.

ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడిగా రమేష్



కలికిరి, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): కలికిరి ఆర్యవైశ్య సంఘం నూతన అధ్యక్షుడిగా విశ్రాంత ఉపాధ్యాయుడు, టీడీపీ యూనిట్ ఇన్‌చార్జి భైరిశెట్టి రమేష్ శ్రేష్ఠి ఎంపికయ్యారు. శుక్రవారం స్థానిక కన్యకాపరమేశ్వరీ ఆలయ ఆవరణలో జరిగిన సంఘ సమావేశంలో కొత్త కార్యవర్గాన్ని ఏర్పాటు చేశారు. మండల అధ్యక్షుడిగా రమేష్ శ్రేష్ఠి, గౌరవాధ్యక్షుడిగా సూర్యనారాయణ గుప్త, ఉపాధ్యక్షులుగా కె.ప్రసాద్, ఎం.సుదర్శన్‌బాబు, ప్రధాన కార్యదర్శులుగా కె.పాండురంగయ్య శ్రేష్ఠి, డి.ప్రశాంత్, కార్యనిర్వాహక సభ్యులుగా ఎన్.నాగరాజు, జి.రంజిత్, బి.వెంటేష్, వివిల్ నరసింహులు, ఎం.రాంకుమార్, జి.శ్రీనివాసులు, బి.వెంకటేష్‌బాబు, కె.రవికుమార్, బి.ప్రదీప్, జయకుమార్, ఫణికుమార్ ఎన్నికయ్యారు.

ప్రభుత్వ భూములను కాపాడండి

- కలెక్టర్, ఎస్పీతో ఎమ్మెల్యే

మదనపల్లె టౌన్, అక్టోబరు 3(ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలో ప్రభుత్వ భూములు దురాక్రమణ కాకుండా రెవెన్యూ అధికారులు కాపాడాలని ఎమ్మెల్యే షాజహాన్‌బాష కలెక్టర్ నిశాంత్‌కుమార్‌ను కోరారు. శుక్రవారం రాయచోటిలో కలెక్టర్, ఎస్పీ ధీరజ్ కనుబిల్లిని ఎమ్మెల్యే కలిశారు. పట్టణంలో రోడ్లను విస్తరించాల్సిన అవసరం వుందన్నారు. మదనపల్లెలో అదనపు ట్రాఫిక్ సిబ్బందిని నియమించాలని కోరారు.

సూపర్ జీఎస్టీని సద్వినియోగం చేసుకోవాలి

మదనపల్లె అర్బన్, అక్టోబరు 3(ఆంధ్రజ్యోతి): సూపర్స్ జీఎస్టీ- సూపర్ సేవింగ్స్‌పై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని ఏపీ ఐఐసీ డైరెక్టర్ మైఫోర్స్ మహేష్, జీఎస్టీ కమిషనర్ చిరంజీవి అన్నారు. శుక్రవారం ఏపీఐఐసీ కార్యాలయంలో పారిశ్రామికవేత్తల అవగాహన సదస్సులో వారు మాట్లాడుతూ భారతదేశంలో ముఖ్యంగా ఏపీలో సూపర్ జీఎస్టీ సేవింగ్స్‌తో రైతులకు, సామాన్య ప్రజలకు అన్ని వస్తువులపై జీఎస్టీ గణనీయంగా తగ్గించారన్నారు. నిత్యావసరాలు, విద్యా సామగ్రి, మెడిసిన్స్‌పై జీఎస్టీ పూర్తిగా తొలగించి, 5శాతం, 18శాతం స్లాబులు 99 శాతం వస్తువులకు సేవల్లోకి తీసుకురావడం ప్రజలకు లాభదాయకమన్నారు. కార్యక్రమంలో డిస్ట్రిక్ట్ ఇండస్ట్రీస్ ఆఫీసర్ కృష్ణ కిషోర్, డిప్యూటీ జీఎస్టీ కమిషనర్ సునీతమ్మ, జీఎస్టీఓ శివయ్య తదితరులు పాల్గొన్నారు.




ఏపీఐఐసీ కార్యక్రమంలో మాట్లాడుతున్న మైఫోర్స్ మహేష్ - కలికిరిలో ట్రాక్టర్లు, ఎరువులు, వ్యవసాయ పరికరాల ప్రదర్శన

పేద, మధ్యతరగతికి చేయూత

కురబలకోట, అక్టోబరు 3(ఆంధ్రజ్యోతి): జీఎస్టీ తగ్గింపుతో పేద, మధ్యతరగతి ప్రజలకు చేయూతనందిస్తూ ప్రజల ఉజ్వల భవిష్యత్తుకు ప్రభుత్వం కృషి చేస్తోందని డీఎల్‌డీఓ అమరనాథరెడ్డి, ఎంపీడీఓ గంగయ్య పేర్కొన్నారు. నందిరెడ్డిగారిపల్లె సచివాలయంలో జీఎస్టీ తగ్గింపుపై అవగాహన చేపట్టారు. తగ్గించిన జీఎస్టీపై ప్రజలకు సమాచారం అందించాలన్నారు.

సద్వినియోగం చేసుకోండి

నిమ్మనపల్లి, అక్టోబరు 3(ఆంధ్రజ్యోతి): కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు సామాన్య ప్రజలపై భారం పడకుండా వుండేందుకు రూపొందించిన జీఎస్టీ డిప్యూటీ ఎంపీడీఓ బాలరాజు పేర్కొన్నారు. వ్యాపారులు తగ్గిన వస్తువు ధరలను షాపుల ముందు డిస్‌ప్లే చేయాలన్నారు. ఏపీఎం మురళి, ఏపీఓ రమేష్, ఏఓ సుజాత పాల్గొన్నారు.

సూపర్ జీఎస్టీ.. సూపర్ సేవింగ్స్

కలికిరి, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం ట్రాక్టర్లు, ఇతర వ్యవసాయ పరికరాలు, డ్రిప్ పరికరాలు, బయోపెస్టిసైడ్స్, సూక్ష్మ పోషక ఎరువులపై జీఎస్టీ తగ్గడంతో రైతులకు పెట్టుబడుల్లో భారీగా లబ్ధిచేకూరనుందని వ్యవసాయ అధికారులు తెలిపారు. పంచాయతీ ఆవరణలో వ్యవసాయ పరికరాలను ప్రదర్శనలో వుంచి జీఎస్టీ తగ్గించిన తరువాత ధరలపై రైతులకు అవగాహన కల్పించారు. అంతకు ముందు ట్రాక్టర్లతో పట్టణంలో ర్యాలీ నిర్వహించారు.